

గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ప్రభుత్వ రద్దు గండం నుండి బయటపడిన నెతన్యాహూ

అణుభద్రత చర్యల్లో ఇరాన్ విఫలం

దక్షిణాఫ్రికాలో వరదలు

లోపలి పేజీల్లో




సంపుటి 27, సంచిక: 352 | శుక్రవారం | 13-06-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## టేకాఫ్ అయిన సెకండ్లలోనే

# కుప్పకూలిన విమానం

## 241 మంది దుర్మరణం

### మృతుల్లో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ



విజయ్ రూపానీ

- మెడికల్ కాలేజీపై పడిన విమానం
- 25 మంది డాక్టర్లు, మెడికోల విషాద మరణం
- అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం
- ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఒకరు కెనడా, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులు
- ప్రమాద స్థలిని పరిశీలించిన కేంద్ర మంత్రులు అమిత్‌షా, రామ్మోహన్ నాయుడు



## గుజరాత్ అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదం

### మృత్యుంజయుడు





ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. అందులో 11ఎ సీట్లో ప్రయాణిస్తున్న విశ్వాస్ కుమార్ రమేశ్ అనే ఏకైక వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. అయన లేచి నడుచుకుంటూ వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**అహ్మదాబాద్ :** గుజరాత్‌లో ఘోర విమానం ప్రమాదం జరిగింది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం (నెంబర్ ఎఐ 171) రద్దీగా ఉండే నివాస ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన నిమిషం లోపే దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మరణించిన లేదా గాయపడిన వారి సంఖ్య అధికారికంగా ధృవీకరించలేదు. అయితే గుజరాత్ మాజీ సిఎం, బిజెపి నేత విజయ్ రూపానీ కూడా విమానంలో ప్రమాదంలో మరణించారు. వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం మేఘానినగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలోని సిటీ సివిల్ హాస్పిటల్, బిజె మెడికల్ కాలేజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస గృహాల సమీపంలో విమానం కూలిపోయింది. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో మెస్‌లో ఆహారం, ప్లేట్లు చిందరవందరగా పడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. విమానం శకలాలు భవనాలపై పడడంతో అవి దెబ్బతిన్నాయి. కొంతమంది డాక్టర్లు కూడా మృతి చెందినట్లు తరువాయి 2లో

‘అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా కలత చెందాను. ఇది హృదయ విదారకర ఘటన. దీనిపై మాటలు రావట్లేదు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుంది’
– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

‘అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదం. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా’
– ప్రధాని నరేంద్ర మోదీ

‘విమాన ప్రమాదం వార్త వినగానే హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణణాతీతం. ఈ క్లిష్ట సమయంలో ప్రతి క్షణం, ప్రతి క్షణం విలువైనదే. సహాయకచర్యలు వేగంగా జరగాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సాయం చేయడానికైనా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి’
– ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

‘లండన్ గాట్విక్‌కు బయల్దేరిన విమానం ప్రమాదానికి గురైన ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం’
– బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

‘అహ్మదాబాద్ విమాన ప్రమాదం మహా విషాదం. ప్రమాద ఘటన నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రధాని మోదీ ఫోన్ చేసి ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే నేను విజయవాడ నుంచి నేరుగా బయల్దేరి వచ్చాను. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. అన్ని కోణాల్లో లోతైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేస్తాం. అధికారులతో సమావేశం అనంతరం మరిన్ని వివరాలు అందిస్తాం. ఈ ప్రమాదానికి బాధ్యులను ఉపేక్షించం’
– కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం కూలడం విచారకరం. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో దాదాపు 200 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే సమాచారం తెలియటంతో అందరూ సురక్షితంగా ఉండాలని ఆయన భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బాధితులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి వీలైనంత వేగంగా సమర్థవంతంగా సహాయక చర్యలను కేంద్రం చేపట్టాలి.
– సిఎం రేవంత్‌రెడ్డి

---

## ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుల వర్షం

**ఆరుగురు మృతి, 8 మందికి గాయాలు**

ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో పలుచోట్ల పిడుగులు పడి ఆరుగురు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో చేనులో పత్తి విత్తనాలు వేస్తుండగా పిడుగుపడి నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. చేనులో ఉన్న మరో ఎనిమిది మంది పిడుగుపాటుతో గాయపడ్డారు. అటూ బేల మండలంలోను ఇద్దరు మృతి చెందారు. బేల మండలంలోనీ సాంగ్డి గ్రామంలో గెడం నందిని, సోన్‌కాస్ గ్రామంలో కోవ సునీత చేనులో విత్తనాలు వేస్తుండగానే ఈ ఇద్దరు పిడుగుపాటుతో మృతి చెందారు. గాదిగూడ మండలంలోని పిప్పిరి గ్రామంలోనూ తరువాయి 2లో



## ఐదురోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. శనివారం భూపాలపల్లి, ములుగు, తరువాయి 2లో



## ఇరిగేషన్ ఇఇ శ్రీధర్ ఆస్తులు రూ.200 కోట్లపైనే



- అరెస్టయిన శ్రీధర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించిన ఎసిబి
- సంపాదన అంతా కాళేశ్వరం పనుల్లో దోచుకుందేనని అనుమానిస్తున్న దర్యాప్తు సంస్థ
- కస్టడీ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్న అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు అయిన నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆస్తులు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లకుపైగానే ఉంటాయని అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు తేల్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టు చేసిన శ్రీధర్‌ను ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. తెలంగాణలో 13 ప్రాంతాలలో ఎసిబి అధికారులు సోదాలు చేయగా దిమ్మతిరిగే ఆస్తు లు బయటపడ్డాయి. ఈ సంపాదన అంతా కాళేశ్వరం పనుల్లో దోచుకుందేనని ఎసిబి అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో ఇతన్ని తరువాయి 2లో

## దేవుడి భూములు కబ్జా చేస్తే పిడి యాక్ట్



- మంత్రి కొండా సురేఖ హెచ్చరిక
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో 25 వేల ఎకరాలు కబ్జా చేసారని విమర్శ
- బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూములు పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేసేవారిపై పీడీ యాక్టులు పెడతామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. అసలు దేవాదాయ శాఖకు చెందిన భూములు కబ్జా కాకుండా చూస్తామని ఆమె పేర్కొన్నారు. దేవుడి భూములు పరిరక్షించడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి దేవుడి భూములు కాపాడుతున్నట్లు సురేఖ వివరించారు. గురువారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తరువాయి 12లో





## సంక్షేమ భవన్ ముట్టడి

- గురుకుల విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్
- విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..
- పరిస్థితి ఉద్రిక్తం



ప్రజాపక్షం/హైదరాబాద్

గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. వందలాది మంది విద్యార్థులు సంక్షేమ భవన్‌కు చేరుకోగానే ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి , కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, ఫలితంగా అందులో చదువుతున్న విద్యార్థులు సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. చాలా విద్యాసంస్థలు ఎటువంటి మౌలిక వసతులు లేకపోవడంతో, ప్రహరీ గోడలు, సరైన నిర్మాణాలు లేక పాములు, ఇతర క్రిమికీటకాలు రావడంతో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. సగానికి సగం గురుకుల విద్యాసంస్థలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాల చోట్ల ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో భవనాలకు తాళాలు వేయడంతో విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో తరువాయి 12లో

## భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

- రెవెన్యూ నుండి ఇంధన శాఖకు నవీన్ మిట్టల్
- లోకేశ్ కుమార్‌కు రెవెన్యూ కార్యదర్శి, సిసిఎల్‌ఎ బాధ్యతలు
- ఐ&పిఆర్ స్పెషల్ కమిషనర్‌గా చెక్కా ప్రియాంక
- హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన
- సిఎం సిపిఆర్‌ఒగా గుర్రం మల్సూర్



నవీన్ మిట్టల్ | లోకేశ్ కుమార్ | ప్రియాంక

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. వివిధ శాఖలలోని 33 మంది ఐఎఎస్ అధికారులు, ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులు మొత్తం 36 మంది అధికారులను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, న్యూఢిల్లీని తెలంగాణ భవన్‌కు రెసిడెంట్ కమిషనర్‌గా డాక్టర్ శశాంక్ గోయెల్‌ను, ఇంధన శాఖ తరువాయి 2లో

## మారిన జిల్లా ఇన్‌చార్జి మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గంలోకి కొత్తగా ముగ్గురు మంత్రులు రావడంతో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులలో మార్పులు చేర్పులు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా సి.దామెదర రాజనరసింహాను, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్‌ను, నిజామాబాద్‌కు ధనసరి అనసూయ సీతక్కను, కరీంనగర్‌కు తుమ్మల నాగేశ్వర రావును, ఆదిలాబాద్‌కు జూపల్లి కృష్ణారావును నియమించింది. కాగా కొత్తగా మంత్రులుగా నియమితులైన వివేక్ వెంకటస్వామిని మెదక్ జిల్లాకు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్లగొండకు, వాకిటి శ్రీహరిని ఖమ్మం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రులుగా ప్రభుత్వం నియమించింది. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాలలో ప్రజా పాలన కార్యకలాపాలను సమీక్షించి వాటి అమలును పర్యవేక్షిస్తారని ప్రభుత్వం ఉత్తర్వులలో తెలియజేసింది.

## హ్యాండ్లూమ్ వస్త్రాలు భారతీయుల అద్భుత స్వప్నాలు





ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి

- నేత కార్మికుల కళా సృజన నైపుణ్యాలను కొనియాడిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- చేనేత ఇక్కత్ పరిశ్రమ స్థితి గతలు తెలుసుకునేందకు పోచంపల్లి సందర్శన

హ్యాండ్లూమ్ వస్త్రాలంటే సాధారణం కాదని, అవి భారతీయుల వారసత్వ అద్భుత స్వప్నాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నేత కార్మికుల కళా సృజన నైపుణ్యాలను కొనియాడారు. పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ స్థితిగతులను, వస్త్ర ఉత్పత్తులను, తయారీ ప్రక్రియను, మార్కెటింగ్ ప్రమోటింగ్, కార్మికుల ఉపాధి వంటి వివిధ అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గురువారం ఆయన పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజం పార్కు ప్రత్యేక హాలులో ఏర్పాటు చేసిన నేత కార్మికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ అయ్యర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిసిపి అక్షాంశ్ యాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. చేనేత కార్మికుల ముఖాముఖిలో అభిప్రాయాలు విన్న తర్వాత గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కార్మికుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తానని, చేనేత కళారంగం తేలికైనది కాదని, అది సాంస్కృతిక వారసత్వ ఘనమైన సంపదని అని కితాబు ఇచ్చారు. వస్త్ర ప్రపంచంలో హ్యాండ్లూమ్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణాఫ్రికాలో వరదలు:50 మంది మృతి



**కేప్‌టౌన్ :** దక్షిణాఫ్రికాలో వరదల కారణంగా యాభైమంది మరణించారు. పలువురు గల్లంతయ్యారు. సహాయబృందాలు వారికోసం గాలిస్తున్నాయి. మృతులసంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇతర సహాయ చర్యలు చేపట్టాయి. దక్షిణాఫ్రికా తూర్పుప్రాంతరాష్ట్రంలో భారీవర్షాలు వరద ప్రమాదానికి దారితీశాయి. పూర్తిగా అభివృద్ధిచెందని గ్రామీణ కేప్ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలవల్ల స్కూలు బస్సు కొట్టుకుపోయింది. ఈ బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు పిలల్ల జాడ ఇంతవరకూ తెలియలేదని ఈస్ట్రన్ కేప్ గవర్నమెంట్ అధికార ప్రతినిధి ఖుసెల్వా రంత్జీ చెప్పారు. శీతాకాలంలో ఈ విధంగా వర్షాలు, వరదలు, మంచు ప్రమాదాన్ని ఎన్నడూ చూడలేదని సీనియర్ పౌరులు చెబుతున్నారు. నెల్సన్ మండేలా జన్మించిన ఈ కేప్ రాష్ట్రంలో 72 శాతం ప్రజలు ఈనాటికీతీవ్ర పేదరికంలోమగ్గుతున్నారు. ఈ ప్రాంతం ఇప్పటివరకూ ఎంతమాత్రం అభివృద్ధి చెందలేదు.

## ప్రభుత్వ రద్దు గండం నుండి
# బయటపడిన నెతన్యాహూ



### వీగిపోయిన ఇజ్రాయెల్ పార్లమెంటు రద్దు బిల్లు

**టెల్అవీవ్ :** ఇజ్రాయెల్ పార్లమెంటును రద్దు చేయాలని కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా 61 మంది ఓటు వేశారు. అనుకూలంగా 53 మంది ఓటు వేశారు. గురువారంనాడు ఈ బిల్లు వీగిపోవడంతో బెంజిమన్ నేతన్యాహూ ప్రభుత్వం ఒక పెద్ద గండం నుండి బయటపడింది. యూదు మతఛాందసపార్టీలు బిల్లుకు మద్దతు ఇవ్వకుండా చివరి నిమిషంలో రాజీపడి వెనక్కు తగ్గాయి. కూటమిలోని షా పార్టీ, యుటిజెలోని డెగల్ హోటరాహ్ వర్గం అధికార లికుద్ పార్టీతో సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ఒక అంగీకారానికి వచ్చి పార్లమెంటు రద్దు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు అంగీకరించాయి. అంతకుముందు అల్ట్రా ఆర్థోడాక్స్ యూదు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపింది. సైన్యం నుండి మినహాయించే తమ ఐడిఎఫ్ ముసాయిదా బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే అధికార కూటమి నుండి వైదొలతుగామని, ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రతిపక్ష బిల్లుకు మద్దతు ఇస్తామని షాస్ (ఛాందస యూదు హరేదీపార్టీ, యుటిజె (యునైటెడ్ తోరజ్ జుడాయిజం)పార్టీలు నేతన్యాహూను తొలుత హెచ్చరించాయి.ఇజ్రాయెల్ పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉన్నాయి. నేతన్యాహూకు చెందిన లికుద్ పార్టీ సారథ్యంలో ఏర్పడిన అధికార కూటమిలో ఎనిమిదిపార్టీలున్నాయి. ప్రధాన ప్రతిపక్షం యేష్ అతిడ్‌తోసహా ప్రతిపక్షంలో మొత్తం ఎనిమిది పార్టీలున్నాయి. 67మందిఎంపీల మెజారిటీబలంతో లికుద్‌పార్టీ అధికారం చెలాయిస్తున్నది. 2022లో ఇజ్రాయెల్‌లో 25వ పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకూ 36ప్రభుత్వాలుఇజ్రాయెల్‌ను పాలించాయి. ఇప్పుడు నేతన్యాహూ నాయకత్వంలో 37వ మంత్రివర్గం హయాంలోగడచిన 20 నెలలుగా పాలస్తీనాపై యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. గురువారంనాటికి 615 రోజులుగా గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగిస్తూ ప్రపంచదేశాల నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. హీబ్రూ భాషలో ఇజ్రాయెల్ పార్లమెంటును నెస్సెట్ అని పిలుస్తారు. తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇజ్రాయెల్ ప్రభుత్వ కూటమిలోని పార్టీలు కూడా ఈ బిల్లుకు భారీఎత్తున మద్దతు ఇస్తాయని మొదట అందరూ భావించారు. కానీ నేతన్యాహూ వర్గాలు రాజీమార్గంబాటపట్టి వారిని బుజ్జగించే చర్యలు తీసుకోవడంతో బిల్లు పార్లమెంటులో వీగిపోయింది. ప్రతిపక్షాలు అనేక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాయి. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినప్పటికీ కొత్తగా తిరిగి ఎన్నికలు జరిగి, మళ్ళీ పార్లమెంటు కొలువు తీరాలంటే కనీసం ఆరునెలల సమయం పట్టి ఉండేది. చాలాకాలంగా ఇజ్రాయెల్‌లో అంతర్గతంగా ప్ర ధాన మంత్రి నేతన్యాహూకు సర్వత్రా తీవ్ర వ్యతిరేక వాతావరణం నెలకుని ఉంది. చుట్టూ శత్రుపరివేష్ఠితమైన ఇజ్రాయెల్‌ను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్న అంతర్జాతీయస్థాయి మిత్రదేశం అమెరికా కూడా ఇప్పుడు అంతర్గతంగా సమస్యలలో ఉంది. ఇంతకుముందు జో బైడెన్ కూడా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారు. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్‌కూడానేతన్యాహూకుఅంతకంటే ఎక్కువగా మద్దతు ఇస్తున్నప్పటికీ తనకు ఇష్టలేని పనులు చేస్తున్న నేతన్యాహూపై ట్రంప్ కొంత అసహనం కూడా చూపిస్తున్నారు. బందీలను సజీవంగా తీసుకురావాలని ఇజ్రాయెల్‌లో బందీల సంఘాలు నిత్యం ప్రదర్శనలు, నిరసనలు చేస్తున్నాయి. మరోవైపు ఎడతెగనియుద్ధం ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతున్నది. ఇంకోవైపు అనివార్యంగా అందరూ సైన్యంలో పని చేయవలసిందేనని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల నుండి తమను మినహాయించాలని ఇజ్రాయెల్‌లో కొన్ని వర్గాలు పట్టుపడుతున్నాయి. అందుకు అధికార కూటమిలోని పార్టీలు, ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షాలు పార్లమెంటును రద్దు చేయాలని కోరుతూ ఒక బిల్లును పార్లమెంటుముందుంచాయి. ప్రత్యేకించి యూదుమతానికి చెందిన అతి ఛాందసవాద హడేరీ వర్గాలు తమ సంప్రదాయాలు, నిబంధనలు కాపాడుకోవడానికి యుద్ధానికి దూరంగా ఉండాలని కోరుకుంటున్నాయి. సమాజంలో వారు విభిన్నంగా ప్రవర్తిస్తారు.

## లాస్ ఏంజెల్స్‌లో ఆగని అరెస్టులు



**ఆస్టిన్ :** వారం రోజులుగాలాస్ ఏంజెల్స్‌లో జరుగుతున్న నిరసన ప్రదర్శనలు, పోలీస్–ప్రదర్శకులమధ్య సంఘర్షణ గురువారంనాడు కూడా కొనసాగింది. వరుసగా రెండో రోజు రాత్రి కూడా లాస్‌ఏంజెల్స్‌లో కర్ఫ్యూను కఠినంగా అమలు చేశారు. కర్ఫ్యూను ఉల్లంఘించిన వందలమందిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు నిరసనలు కొనసాగుతున్నాయి. అమెరికాలోని ఇతర నగరాలలో కూడా ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. కాగా అధ్యక్షుడు ట్రంప్ రెచ్చగొట్టే ప్రకటన చేస్తూ, లాస్ ఏంజెల్స్‌లో హింసాకాండకు పాల్పడుతూ, నిరసన ప్రదర్శనలు చేస్తున్నవారంతా అక్రమంగా దేశంలోకి వలస వచ్చినవారేనని విమర్శించారు. దాదాపు 450 మందిని కర్ఫ్యూ ఉల్లంఘించారన్న కారణంగా అరెస్టు చేశారు. డౌన్‌టైన్‌లో గురువారంనాడు వందలమంది నిరసన ప్రదర్శన చేశారు. వాషింగ్టన్ డి.సి, హూస్టన్, సీటెల్, న్యూయార్క్, టెక్సాస్, తదితర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ''ఇక్కడ రాజులు ఎవ్వరూ లేరు, రాజ్యాలు లేవు'' అని ప్రదర్శకులు ప్ల కార్డులు ప్రదర్శించారు.

# అణుభద్రత చర్యల్లో ఇరాన్ విఫలం




ఐఎఇఎ గవర్నర్ల బోర్డు తీర్మానం

**వియన్నా:** అణుభద్రత విషయంలో ఇరాన్‌కు ఎంతమాత్రం చిత్తశుద్ధి, నిబద్ధత లేవని ఐక్యరాజ్యసమితి అణునిఘా సంస్థ (ఐఎఇఎ) గవర్నర్ల బోర్డు ఒక తీర్మానం చేసింది. అణుభద్రతకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించడంలో ఇరాన్ పూర్తిగా విఫలమైందని విమర్శించింది. ఇరాన్ చర్యలను ఐఎఇఎ తప్పుపట్టింది. మంగళవారంనాడు గవర్నర్ల బోర్డు సమావేశంలో ఈ తీర్మానానికి అనుకూలంగా 19 మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా ముగ్గురు ఓటు వేశారు. మరో 11 మంది సభ్యులు గైరుహాజరయ్యారు. అణుభద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన బాధ్యతలను ఇరాన్ పూర్తిచేయలేదని తీర్మానం ఇరాన్‌ను విమర్శించింది. గడచిన ఆరు సంవత్సరాలుగా ఐక్యరాజ్యసమితి అణు నిఘా విభాగానికి సహకారం అందించడంలో ఇరాన్ విఫలమైందని గవర్నర్ల బోర్డు విమర్శించింది. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ వియన్నాలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఈ వివరాలు తెలియజేశారు. ఇరాన్‌లోని అప్రకటిత ప్రదేశాలలో యురేనియం జాడలను చూపించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ సమస్య అనేక సంవత్సరాలుగా నలుగుతోందని అన్నారు. ప్రపంచానికి ఇరాన్ సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. అణుపదార్థానికి సంబంధించిన విశ్వసనీయమైన సమాచారాన్ని ఐఎఇఎకు తెలియజేయడంలో ఇరాన్ ప్రభుత్వం విఫలమైందని, తనిఖీలు చేస్తున్నప్పటికీ అనేక సంవత్సరాలుగా ఇది సమస్యగా మారిందని అన్నారు. ఇదిలా ఉండగా ఐఎఇఎ విమర్శల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగమంత్రిత్వ శాఖ, ఇరాన్ అణుఇంధన సంస్థ (ఎఇఓఐ) ప్రకటన చేస్తూ, ఒక సురక్షితమైన ప్రదేశంలో కొత్త అణుశుద్ధి కేంద్రాన్ని నిర్మించామనీ, దీనికి సంబంధించిన వివరాలు తర్వాత తెలియజేస్తామని పేర్కొంది.

### 15న ఇరాన్ – అమెరికా మధ్య ఆరో విడత అణు చర్చలు

ఇరాన్–అమెరికా మధ్య ఈనెల 15వ తేదీన ఆదివారంనాడు ఆరో విడత అణు చర్చలు మస్కట్‌లో జరుగుతాయి. ఓమన్ విదేశాంగ మంత్రి అల్ బుసైదీ గురువారంనాడు ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేశారు. దీనిపై అమెరికా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇరాన్–అమెరికా మధ్య అణుసంబంధమైన చర్చలకు ఓమన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్ 12 నుండి మే 23వ తేదీ వరకూ ఈ రెండు దేశాలమధ్య ఐదు విడతలుగా పరోక్ష చర్చలు జరిగాయి. కానీ ఈ చర్చలన్నీ విఫలమయ్యాయి. అసలు ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని అమెరికా వాదిస్తున్నది. ఆరు అణుబాంబులు తయారుచేయగల శక్తిసామర్థ్యాలను ఇరాన్ ఇప్పటివరకూ సమకూర్చుకుందని అమెరికా చెబుతున్నది. యురేనియం శుద్ధి కార్యక్రమాలను తక్షణం నిలిపివేయాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా అందుకు ఇరాన్ తిరస్కరిస్తున్నది.

## భారత్–నేపాల్ మధ్య గ్రీన్ ఎనర్జీ సహకారం



**ఖాట్మండు :** పర్యావరణ అనుకూల గ్రీన్ ఎనర్జీ సహకారాన్ని అందించాలని భారత్‌ను నేపాల్ విదేశాంగమంత్రి అర్జూ రాణా దూబే కోరారు. ఈ రెండు దేశాలు గత ఏడాది జనవరినెలలో దీర్ఘకాలిక గ్రీన్ ఎనర్జీ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 10,000 మెగావాట్ల విద్యుత్‌ను రాబోయే పదేళ్ళకాలంలో భారత్‌కు ఎగుమతి చేసేందుకు వీలుగా ఈ ఒప్పందం జరిగింది. ఖాంట్మండులో గురువారం నాడు జరిగిన సమావేశంలో అర్జు రాణా మాట్లాడారు. ఖాట్మండు నవీన విదేశీ విధాన కేంద్రం, అనంత అస్పెన్ సెంటర్ థింక్ టాంక్‌లు సంయుక్తంగా భారత్–నేపాల్ వ్యూహాత్మక చర్చల గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు దేశాలమధ్యా గ్రీన్ ఎనర్జీ సహకారం పరస్పర ఆధారభూతంగా ఉంటుందన్నారు. దీనివల్ల పరిశుద్ధమైన కాలుష్యం లేని స్థిరమైన ఇంధన వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. వాణిజ్యం, రవాణా, పెట్టుబడులద్వారా సహకారాన్ని ఉద్ధృతం చేయడం ద్వారా ఆర్థిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్నదే రెండు దేశాలమధ్య సంబంధాలలో ప్రధాన అంశమని ఆయన చెప్పారు. రెండు దేశాలమధ్య 1,850 కి.మీ నిడివిగల సరిహద్దులు ఉన్నాయని, ఐదు భారత రాష్ట్రాలతో ఈ సరిహద్దులను నేపాల్ పంచుకుంటున్నదని చెప్పారు.

## రూ.200 కోట్లపైనే
(మొదటి పేజీ తరువాయి)

కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారించాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు నాంపల్లి ఎసిబి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. శ్రీధర్‌కు చెందిన తెల్లాపూర్‌లో ఒక ఖరీదైన విల్లా, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్స్, అమీర్‌పేట్‌లో కమర్షిల్ స్థలం, హైదరాబాద్‌లో ఇండిపెండెంట్ బిల్డింగ్, కరీంనగర్‌లో మరో ఇండిపెండెంట్ బిల్డింగ్, 16 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లలో మరో 19 రెసిడెన్షియల్ ఒపెన్ ప్లాట్స్‌లు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు బయట పడిన విషయం తెలిసిందే. ఇక ఇతని పేరుపై, కుంటుంబ సభ్యల పేర్లపై ఉన్న బ్యాంక్ లాకర్లను ఇంకా తెరవలేదు. ఇందులో కూడా ఏఏ పత్రాలు ఉన్నాయో, ఏఏ నగలు ఉన్నాయో ఒకటి రెండు రోజుల్లో తేలే అవకాశాలు ఉన్నాయి. థాయ్‌ల్యాండ్‌లో ఇటివలే శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపాడు. ఆ తరువాత హైదరాబాద్‌లో గ్రాండ్‌గా డిన్నర్ ఫంక్షన్ కూడా చేశాడు. ఇందుకోసం సుమారు రూ.25 కోట్లకుపైగానే ఖర్చు చేశాడని సమాచారం. దీనిపైదీనిపై కూడా ఎసిబి అధికారులు ఆరా తీస్తున్నారు.

## ఐఎఎస్‌ల బదిలీలు
(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శిగా నవీన్ మిట్టల్‌ను, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియయమించింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా డి.ఎస్.లోకేశ్ కుమార్‌ను, ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను, హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. టిజి ఆయిల్ ఫెడ్ ఎండిగా జె.శంకరయ్య, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రెటరీగా రాజీవ్ గాంధీ హనుమంతు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ కార్యదర్శి (సమన్వయం)గా గౌరవ్ ఉప్పల్, టిజి సమాచార కమిషన్ కార్యదర్శిగా బి.భారతి లక్‌పతి నాయక్, నియమితులయ్యారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా రాజీవ్‌గాంధీ హనుమంతు, నిజామాబాద్ కలెక్టర్‌గా వినయ్‌క్రిష్ణారెడ్డి, మహిళా శిశు అభివృద్ధి డైరెక్టర్‌గా జి.శ్రీజన, వ్యవసాయ సహకార శాఖ సంయుక్త కార్యదర్శిగా శివశంకర్ లోహేటి, జిఎడి సంయుక్త కార్యదర్శిగా చిట్టం లక్ష్మి, సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా కె.హైమావతి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వాసం వెంకటేష్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శిగా విపి గౌతం, సింగరేణి కాలరీస్ కంపెనీ డైరెక్టర్‌గా గౌతంపాట్రూ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా కె.నిఖిలా, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండిగా వల్లూరి క్రాంతి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, సిఇఒగా ఎ.నిర్మలా కంతి వెస్లీ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా ముజమిల్‌ఖాన్, హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీస్, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ డైరెక్టర్‌గా ఇ.నవీన్ నికోలస్, సమాచార, ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా చెక్కా ప్రియాంక, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్, కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా అశ్వీని తనాజి, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రఫుల్ దేశాయ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బి.షఫీయుల్లా, హెచ్ఎండి అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్‌గా విఎస్ఎన్ ప్రసాద్, పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నిఖీల్ చక్రవర్తిలు నియమితులయ్యారు. ఇదిలా ఉండగా నాన్ క్యాడర్ అధికారులు జె.శంకరయ్య టిజి ఆయిల్‌ఫెడ్ ఎండిగా, పి.శ్రీకాంత్ బాబు ఆయిష్ డైరెక్టర్‌గా, పవన్‌కుమార్ టిజిఐఐసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కాగా ముఖ్యమంత్రి ప్రధాన పౌర సంబంధాల అధికారిగా గుర్రం మల్సూర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## భారీ వర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. సోమ, మంగళవారాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు.

## కుప్పకూలిన విమానం
(మొదటి పేజీ తరువాయి)





సమాచారం. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయినట్లు భావిస్తున్నారు. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. శిథిలాల ప్రాంతం నుండి కాలిపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్నట్లు, గాయపడిన వారిని సమీపంలోని సిటీ సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు దృశ్యాలు వైరస్ అయ్యాయి. ఈ ప్రమాద ఘటన గురించి ప్రత్యక్ష సాక్షులు మీడియాతో మాట్లాడారు. విమానం ప్రమాద స్థలానికి దగ్గర్లోనే ఉన్న ఓ వ్యక్తి ఏం జరిగిందో చెప్పుకొచ్చాడు. 'మా ఆఫీస్ ఇక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో ఉంది. నేను ఆఫీస్ నుంచి బయటకు అడుగు పెట్టగానే చాలా పెద్ద శబ్దం వినిపించింది. అకస్మాత్తుగా ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఏం జరిగిందో మాకు అర్థం కాలేదు. ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి, ఇక్కడ శిథిలాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. మంటలు చెలరేగుతున్నాయి. విపరీతంగా పొగ కమ్ముకుంటోంది. ఏమీ కనిపించలేదు. అప్పుడు విమానం రెక్కలు ఇక్కడ పడిపోయాయని, ఒక విమానం కూలిపోయిందని మాకు తెలిసింది.. ప్రాణనష్టం గురించి మాకు తెలియదు' అని ఆ వ్యక్తి చెప్పాడు. 2020లో కేరళలోని కోజికోడ్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం తడి రన్‌వే నుండి జారిపడి రెండుగా విడిపోయిన తర్వాత ఇది భారతదేశంలో రెండవ అతిపెద్ద విమాన విపత్తు. విమానంలో ఉన్న 190 మందిలో, ఇద్దరు పైలట్లు సహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టిసిగా 8,200 గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఎటిసి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఎటిసికి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్ లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్ ఇండియా వెబ్ సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు ఉంటాయని పేర్కొంది. ఘటన నేపథ్యంలో అహ్మదాబాద్ నగరంలో విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు.

**రంగంలోకి ఎఎఐబి**

విమాన ప్రమాదంపై దర్యాప్తు చేయనున్నట్లు పౌరవిమానయాన శాఖ వర్గాలు వెల్లడించాయి. అటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) రంగంలోకి దిగింది. ఎఎఐబి డిజి, ఇతర అధికారులు ఘటనాస్థలానికి వెళ్లారు.

**చాలా మంది చనిపోయారు : కేంద్ర విదేశాంగ శాఖ**

విమానం దుర్ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన చేసింది. ఈ ప్రమాదంలో చాలా మంది మరణించినట్లు వెల్లడించింది. 'అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘటన మాటలకందని పెనువిషాదం. తాజాసమాచారం ప్ర కారం ఇందులో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల్లో ఎక్కువ మంది విదేశీయులు ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఘటనకు సంబంధించిన అప్ డేట్స్‌ను సంబంధిత శాఖకు ఎప్పటికప్పుడు పంచుకుంటాయని పేర్కొన్నారు. ప్రాణ నష్టంపై ఇప్పుడు కచ్చితమైన అంచనాకు రాలేమని, పూర్తి వివరాలకు మరికొంత సమయం పడుతుందని ఆయన తెలిపారు.

**గుజరాత్ మాజీ సిఎం విజయ్ రుపానీ మృతి**

ఎయిరిండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సిఎం, బిజెపి సీనియర్ నేత విజయ్ రూపానీ మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి, గుజరాత్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సిఆర్ పాటిల్ ధ్రువీకరించా రు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు విజయ్ రూపానీ ప్ర యాణానికి బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ఆయ న పేరుతో ఒక టికెట్ తొలుత నెట్టింట వైరల్‌గా మారింది. అపై ఆయన వి మానం ఎక్కినట్లు నిర్ధరించే ప్యాసింజర్ జాబితాలోనూ రూపానీ పేరు ఉండడంతో ఆయన సమాచారం గురించి పలువురు ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఆయన మృతిని పార్టీ ధ్రువీకరించింది. బిజెపికి చెందిన విజయ్ రామ్‌నిక్ లాల్ భాయ్ రూపానీ 2016 నుంచి 2021 వరకు రెండు సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా.. చిన్న కుమారుడు పూజిత్ ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

**మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం**

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఎయిరిండియా యాజమాన్యమైన టాటా గ్రూప్ స్పందించింది. మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియాగా అందించనున్నట్లు వెల్లడించింది. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా తామే భరిస్తామని తెలిపింది. ఈ మేరకు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఎయిరిండియా ప్రమాద ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆ బాధను వ్యక్తపరచడానికి మాటలు కూడా రావడం లేదు. ప్రమాదంలో ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి టాటా గ్రూప్ తరఫున రూ.1కోటి అందజేయనున్నాం. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా మేమే భరిస్తాం. వారి సంరక్షణ బాధ్యత కూడా మాదే. బిజె మెడికల్ హాస్టల్ నిర్మాణానికి మా వంతుగా తోడ్పాటు అందిస్తాం' అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎయిరిండియా ఎండీ, సిఇఒ క్యాంప్ బెల్ విల్సన్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

## మెట్రో పనులను చేపట్టొద్దు
### చార్మినార్, ఫలక్‌నుమా వద్ద చేయొద్దు
### హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్ట్ రెండో దశలో పనులు చార్మినార్, ఫలక్‌నుమాల సమీపంలో చేయపట్టరాదని హైకోర్టు రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వారసత్వ కట్టడాల పరిరక్షణపై ఎలాంటి అధ్యయనం చేయకుండానే మెట్రో నిర్మాణాలు చేసేందుకు ప్రణాళికను రూపొందించారని, మెట్రో కారిడార్–6 పనులు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) హైకోర్టులో వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.
మెట్రో పనుల కారణంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమాతోపాటు పలు నిర్మాణాలకు ప్రమాదం పొంచి ఉందని పిటిషనర్ లాయర్ వాదించారు. తెలంగాణ వారసత్వ కట్టడాల రక్షణ చట్టం, కేంద్ర పురావస్తుశాఖ చట్ట నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కౌంటరు దాఖలు చేయడానికి మూడు వారాల గడువు కావాలని ప్రభుత్వం కోరింది. ఇందుకు అనుమతిచ్చిన హైకోర్టు అప్పటి వరకు పనులు చేయరాదని ఆదేశించింది.

**జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ పనులను చేపట్టరాదు**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ పనులను చేపట్టరాదంటూ హైకోర్టు గురువారం ఆదేశించింది. అనుమతుల్లేకుడా నిర్మాణాలు కొనసాగిస్తుండటం సరికాదంది. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను అనుమతుల్లేకుండా నిర్మిస్తున్నా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. జీహెచ్ఎంసీ అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు జరుగుతున్నాయని లాయర్ చెప్పారు. వాటి ఫొటోలు తీసిన పిటిషనర్లపై కేసులు పెట్టారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, అనుమతుల్లేని నిర్మాణ పనులను నిలిపివేయాలన్నారు. వీటిపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జులై 3కు వాయిదా వేసింది.

## పిడుగుల వర్షం
(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ పనులలో నిమగ్నమై చేనులో పత్తి విత్తనాలు విత్తుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో మంగం భీంబాయి, సిడాం రాంబాయి, పెందూర్ మనోహర్, పెందుర్ సంజన, ఈ నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే పిడుగుపాటుతో మరో 8 మంది గాయపడగా వారిని స్థానికులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు వారికి చికిత్సను అందిస్తున్నారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## సిఎం రేవంత్‌పై కేసు విచారణ నిలిపివేసిన హైకోర్టు

**హైదరాబాద్:** బిజెపి పరువు ప్రతిష్టలు దెబ్బతీసేలా గత ఏడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన జన జాతరలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారంటూ బిజెపి పెట్టిన కేసు విచారణను హైకోర్టు నిలిపివేసింది. ఈమేరకు గురువారం జస్టిస్ కె.లక్ష్మ ణ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటరు దా ఖలు చేయాలంటూ ఫిర్యాదుదారు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆదేశించారు. విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు. బిజెపి అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు రద్దు అవుతాయని రేవంత్ ఆరోపణల వల్ల పార్టీ పరువు పోతోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. దీనిని కొట్టేయాలన్న రేవంత్ పిటిషన్‌లో ఫిర్యాదుదారు వెంకటేశ్వర్లు కౌంటరు దాఖలు చేయకపోవడంతో హైకోర్టు మండిపడింది. విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు కింది కోర్టులో కేసు విచారణపై స్టే విధించింది.

## అక్రమ నిర్మాణలపై చర్యలు లేకపోగా కుంటిసాకులా?

**హైదరాబాద్:** అక్రమ నిర్మాణాలపై తక్షణం చర్యలు తీసుకోకుండా కుంటి సాకులు చెబుతున్న నల్గొండ మున్సిపల్ అధికారులపై హైకోర్టు గురువారం మండిపడింది. కూల్చివేత ఉత్తర్వులు 2022లో జారీ అయినా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. పరస్పర లేఖలతో కాలయాపన చేయకపోతే తక్షణం ఎందుకు చర్యలు తీసుకోలేరని నిలదీసింది. నల్గొండ గొల్లగూడలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలంటూ 2022లో మున్సిపల్ కమిషనర్ ఆదేశాలిచ్చినా అమలు చేయకపోవడంపై 83 ఏళ్ల కె.రాములమ్మ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. విద్యుత్తు, నీటి సరఫరా నిలిపివేతకు లేఖలు రాశామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కూల్చివేత చర్యలు చేపట్టాలని లేఖ రాసినట్లు ప్రభుత్వ లాయర్ చెప్పారు. కూల్చివేత చర్యలు తీసుకుని రిపోర్టు ఇవ్వాలని ఆదేశించిన న్యాయమూర్తి విచారణను జులై 3కు వాయిదా వేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఫోన్ ట్యాపింగ్ కేసులో.. నేడు సిట్ విచారణకు హాజరుకానున్న ప్రభాకర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ–1 నిందితుడు ఎస్ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు శుక్రవారం సిట్ విచారణకు మూడోసారి విచారణకు హాజరుకానున్నారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తరువాత ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ఈనెల 9, 11 తేదీలలో రెండుసార్లు విచారించారు. మూడోసారి విచారణకు అతనిపై సంధించే ప్రశ్నలను సిట్ అధికారులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రభాకర్‌రావు ఉపయోగించిన రెండు ఫోన్‌లను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎస్ఐబిలో దశాబ్దకాలం నుంచి భద్రపరిచిన డేటాను ఎందుకు ఎత్తుకెళ్లాల్సి వచ్చింది, ధ్వంసం చేయాల్సి వచ్చిందనే విషయంపై మరింత లోతుగా విచారించాలని సిట్ అధికారులు యోచిస్తున్నారు.

## ఆటో మీటర్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆటో మీటర్ చార్జీల పెంపుదల, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డుతో పాటు ఇతర పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జిహెచ్ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసేందుకు కృషి చేసిన కూనంనేని సాంబశివరావుకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్‌లో గురువారం తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి నేతలు ఘనంగా సన్మానించారు. జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆటో మీటర్ చార్జీలు పెంచడం, ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12,000 ఆర్థిక సహాయం, ఆటో రవాణారంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించడం వంటివి పరిష్కరించడానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి నేతలు సిహెచ్. జంగయ్య, ఎండి.ఒమర్‌ఖాన్, ఎస్‌కె.లతీఫ్, ఎం.శ్రీనివాస్ (ఎఐటియుసి), వి.ప్రవీణ్, లింగం (టియుసిఐ), వి.మారయ్య, మహేష్ (బిఆర్‌టియు,) పి.శ్రీకాంత్, అజయ్‌బాబు(సిఐటియు), పి.యాదగిరి (టిఎన్‌టియుసి) పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై మాజీ సిఎం కెసిఆర్‌వి పచ్చి అబద్ధాలు

### తెలంగాణ విద్యావ్యవస్థ బలోపేతం కావాలి
### 17న వామపక్షాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరసన
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మాజీ ముఖ్యమంత్రి కమిషన్ ముందు హాజరై చెప్పిన విషయాలు పచ్చి అబద్ధాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అప్పుడు నేనే ఇంజనీయర్, నేనే మేస్త్రిని అని చెప్పుకున్న మాజీ ముఖ్యమంత్రి నేడు అరెస్ట్ అవుతాననే భయంతో నాకు ఏమీ సంబంధం లేదని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కాళేశ్వరంపై నాడు కెసిఆర్ కుటుంబం లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. నాడు కెసిఆర్, ఈటల రాజేందర్, హరీష్‌రావులే కాళేశ్వరం కూలడానికి ప్రధాన కారణమని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణకు కెసిఆర్ ఒరగబెట్టింది ఏమీ లేదనన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతం కావాలని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కుంటుబడిన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వానికి సూచించారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంపు వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు. ఆపరేషన్ కగార్ ఆపాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17న వామపక్షాల ఆధ్వర్యంలో హైద్రాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని, అలాగే మావోయిస్టులు కూడా తమ పంథా మార్చుకోవాలని, వామపక్షాలతో చేతులు కలిపి మతోన్మాదులను తరిమి కొట్టడానికి ఏకంకావాలని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో కలిసి రావాలని ఆయన సూచించారు.

**జూలై 5,6న కురవిలో సిపిఐ జిల్లా మహాసభలు**

జూలై 5,6 తేదీల్లో కురవి మండల కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మరో రెండేళ్ళు ప్రజాసమస్యలపై ఉద్యమాలు కొనసాగించేలా ఈ మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు, ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , నెల్లూరు నాగేశ్వరావు పాల్గొన్నారు.

## బాలల హక్కులు కాపాడాలి

### భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు... బడిలో
### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి
### బాలసంఘం, ఎఐవైఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉన్నదని పలువురు యువజన, బాల సంఘం నాయకులు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసంఘం, ఎఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 'బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు బడిలో' అనే నినాదంతో చిన్నారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, బాలసంఘం కన్వీనర్ షేక్ మహమూద్, హిమాయత్‌నగర్ మండల విద్యాశాఖాధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి సుమన్ మాట్లాడుతూ పేదరికం వల్ల పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా తమ కుటుంబ అవసరాల కోసం బాల కార్మికులుగా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదన్నారు. ఇందుకు మూల్యంగా వారి శారీరక, మానసిక పెరుగుదల లోపిస్తున్నదని, సహజంగా ఉన్న నైపుణ్యాలు, సామర్థ్యాలు నశిస్తాయన్నారు.
తల్లితండ్రులు యజమానుల దగ్గర తీసుకున్న అప్పు కోసం పిల్లలని తాకట్టు పెట్టడం వల్ల వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పెద్దలు చేయాల్సిన పనుల్లో పిల్లలకు తక్కువ వేతనం వెచ్చించి పనిచేయించుకోవచ్చని వారిని నియమించుకుంటారని, పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించినపుడే ఇందుకు పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పౌరులంతా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ రెవెన్యూ, కార్మిక శాఖలు పర్యవేక్షిస్తూ బాల కార్మిక కుటుంబాలలో చైతన్యం తీసుకువస్తూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు చేపట్టాన్నారు. ధర్మేంద్ర మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, విద్యాహక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపై హక్కులు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, కిషోర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీఖాన్ పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా పోలీసులు భేష్

### మా దేశంలో మహిళా పోలీసులే కనిపించరు..పెట్టమని చెబుతా
### మిస్‌వరల్డ్ ఒపెల్ సుచాతా శ్రీ



ప్రజాపక్షం/హైదరాబాద్:''మా థాయ్ లాండ్‌లో ఉమెన్ పోలీస్ అసలే కనిపించరు. మొత్తం మగ పోలీస్‌లే ఉంటారు. కానీ, తెలంగాణ హైదరాబాద్‌లో నేను విమానం దిగిన దగ్గర నుండి, తిరిగి వెళ్లే వరకు పోలీసులలో సగం మంది ఉమెన్ పోలీసులే కనిపించారు. అంతెందుకు, నాకు మొదటి రోజు నుండి తిరిగి వెళ్లేంతవరకు ఉమెన్ పోలీస్‌లు నావెంటే ఉండి, కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తెలంగాణలో మహిళా భద్రతా చర్యలు అద్భుతంగా ఉన్నాయి. ఇది, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని కలిగిస్తుంది. ఇలాంటి మహిళా భద్రతా చర్యలు మా దేశంలోనూ అమలు చేయాలని మా ప్రభుత్వాన్ని కోరుతాను'' హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన మిస్‌వరల్డ్–2025 విజేతగా నిలిచిన థాయ్ లాండ్ సుందరి మిస్‌వరల్డ్ ఒపెల్ సుచాతా శ్రీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సుమారు 40 రోజులు హైదరాబాద్‌లో గడిపిన ఆమె విజేతగా నిలిచి తన స్వదేశానికి బుధవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు ఈ సందర్భంగా ఆమె తన మనోభావాన్ని పై విధంగా వ్యక్తం చేశారు.



## గత ప్రభుత్వంలో సెరికల్చర్ విభాగం నిర్లక్ష్యానికి గురైంది

### రైతు కమిషన్‌కు వివరించిన అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యానికి గురైందని, నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో సెరికల్చర్ విభాగం నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని అధికారులు గురువారం రైతు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానిరెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్‌తో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఈ మేరకు సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో సెరికల్చర్‌ను కలపడం వల్ల సెరికల్చర్ మనుగడకే ప్రమాదంగా మారిందని వివరించారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో పట్టుపురుగుల సాగులో మంచి లాభాలున్నా.. పట్టించుకోలేదని, పట్టుపరుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కమిషన్ చైర్మన్, సభ్యులకు సెరికల్చర్ అధికార యంత్రాంగం వివరించింది. ముఖ్యంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో గత కొన్నేళ్లుగా నియామకాలు చేపట్టలేదని, రాష్ట్ర వ్యాప్తంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల సంఖ్య 60 మందే వున్నారని తెలిపారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా పట్టుపురుగుల సాగుకు నిధులు కూడా తీసుకోవచ్చని, తెలంగాణలో సిల్క్ దుస్తువుల డిమాండ్ ఉందని తెలిపారు. సెరికల్చర్ అధికారులు తెలిపిన వివరాలను విన్న రైతుకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్.. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పేరుకుపోయిన సమస్యలు, అభివృద్ధి చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును బీమారంగానికి అప్పగించొద్దు

### ఎఐటియుసి డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు సహజ మరణం జరిగినటువంటి క్లెయిమ్‌లను బీమా రంగానికి అప్పజెప్పాలి అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యదర్శి, అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్‌కి బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వము ఆలోచన చేయడం బాధాకరమని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా బీమా రంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో 15 లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులు నమోదై ఉన్నారని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా చెల్లిస్తున్న డబ్బులు లేబర్ డిపార్ట్‌మెంట్ చేతులు దులుపుకొని బీమా కంపెనీకి అప్పజెప్పడం వెనుక మతలబు ఏమిటని నిలదీశారు. అధికారులు ఎలాంటి కారణాలు చెప్పకుండా గోప్యంగా ఉంచడంలో అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. బీమా కంపెనీలకు అప్పజెప్పడం అంటే సంక్షేమ బోర్డు ఎత్తి వేసే కుట్రలో భాగమే అని ఆరోపించారు. ఈనెల నాలుగో తేదీన సంక్షేమ బోర్డు గుట్టుచప్పుడు కాకుండా ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదలచేశారు. ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏంటో చెప్పటంలేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ లేబర్ అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ అప్పనంగా బీమా కంపెనీలకు అప్పచెప్పటం విచారకరమని అన్నారు. కార్మికులను కార్మిక శాఖకు దూరం చేసే కుట్రలో భాగంగా ఇలాంటి ప్రయత్నం లేబర్ అధికారులు ప్రభుత్వం కూడబలుక్కొని చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ అధికారులు తమ పని భారం తగ్గించుకోవడం కోసం బీమా కంపెనీలకు సంక్షేమ బోర్డు నిధులు మళ్ళిస్తున్నారని అన్నారు. ఒక్కొక్క కార్మికునికి ఇన్సూరెన్స్ కోసం కంపెనీకి చెల్లిస్తున్నారని అధికారులను అడిగితే సమాధానం లేదని, ఈ పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తారో, ఎవరి అజమాయిషీ ఉంటుందనే అంశాలను దాటవేస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన అనంతరం వీటిపై ముందుకు వెళ్లాలని కోరారు. రెన్యువల్ గ్యాప్ పేరుతో క్లెయిమ్ నిలిపివేయడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేశం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఉపాధ్యక్షులు జి.పరమేశ్వర్, కోశాధికారి కె.నరసింహారెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ బొడ్డుపల్లి కిషన్ ఉమర్ కాన్ తదితరులు పాల్గొన్నారు



## మున్నూరుకాపు, గొల్ల కురుమలకు మంత్రి పదవులు ఇవ్వాలి

### కాంగ్రెస్ చీఫ్‌కు నేతల వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్నూరుకాపు, గొల్ల కురుమలకు మంత్రి పదవులు ఇవ్వాలని రెండు సామాజికవర్గాల నేతలు కాంగ్రెస్ పార్టీని కోరాయి. ఈ మేరకు మున్నూరుకాపు, యాదవ సంఘాల నేతలు గురువారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ వేములవాడ ఎంఎల్‌ఎ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని 33 జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన మున్నూరు కాపు సంఘం నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. మరోవైపు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నేతృత్వంలో యాదవ సామిజికవర్గాల నేతలు మహేష్‌కుమార్‌ను కలిశారు. రాష్ట్రంలో గొల్లలు 22 లక్షలు, కురుమలు 6 లక్షల మంది ఉన్నారని, గొల్ల కురుమలకు మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారుడు, ఒక ఎంఎల్‌సి, ఐదు కార్పొరేషన్‌ల చైర్మన్లు, ఐదు కమిషన్ సభ్యులు, పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్, మూడు వైస్ ప్రెసిడెంట్స్, 8 ప్రధాన కార్యదర్శుల పదవులు, ఐదు డిసిసిలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు పెద్దపీట సిఎం రేవంత్ రెడ్డి వేసినప్పటికీ అందులో గొల్ల కురుమలకు అన్యాయం జరిగిందని మహేష్‌కుమార్ ముందు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎపి మంత్రివర్గంలో గొల్ల కురుమలకు మంత్రి పదవి లేని ప్రభుత్వం లేదన్నారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో గొల్ల కురుమలకు తప్పక అవకాశం కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చినట్లు అనంతరం బీర్ల ఐలయ్య మీడియాతో చెప్పారు.

## విద్యార్థుల భవిత ఉన్నతంగా తీర్చిదిద్దాలి

### విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందించాలి
### బిసి సంక్షేమ శాఖ అధికారులతో.. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాలు కల్పించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. 2025–26 విద్యాసంవత్సరం బుధవారం నుంచి పునఃప్రారంభం కావడంతో బిసి సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాల విద్యను అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో, విద్యాబోధనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రాధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవితవ్యం కోసం శాయశక్తుల కృషి చేయాలన్నారు. రాష్ట్రం, దేశం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, బిసి సంక్షేమ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యబోధనలో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలన్నారు. అన్ని విషయాలను కూలంకుషంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి నెలవారి ఆరోగ్య పట్టికను సిద్ధం చేయాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో బిసి విద్యాసంస్థలు అత్యుత్తమ ఫలితాలు సాధించి, మొదటి స్థానంలో ఉండాలన్నారు. మంచి ఫలితాలు సాధిచడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతినెలా ఆర్‌సిఓలు, డిబిసిడిఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు, సంయుక్త కార్యదర్శులు తిరుపతి, మద్దిలేటి, ఎంబిసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఇఒ అలోక్ కుమార్, బిసి స్టడీసర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడి ఇందిర, ఆర్‌సిఒలు, ప్రాధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ప్రజలే బుద్ధి చెబుతారు

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ప్రజలే బట్టలు ఊడదీసి కొడతారని ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్‌కు ఉబలాటం ఎక్కువగా ఉందిని, ఆయన చేసిన తప్పులకు త్వరలో ఆయనే జైలుకు వెళ్ళే రోజు వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని స్పష్టం చేశారు. జరిగిన తప్పులపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అది రాజకీయ కక్ష ఎలా అవుతుందని ప్రశ్నించారు. కెటిఆర్ గత ప్రభుత్వ అసెంబ్లీలో సంస్కారం గురించి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కెసిఆర్‌ను తిట్టొద్దని నీతులు చెప్పాడు. మరి ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నువ్వు మాట్లాడుతున్నా... భాష ఎలాంటిదో ప్రజలందరూ గమనిస్తున్నారని కెటిఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు నీతులు చెప్పిన కెటిఆర్ ఇప్పుడు... రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని తిడుతున్న మాటలకు సమాధానం చెప్పాలన్నారు. కెటిఆర్‌ను చూసుకుని... సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న కొందరు బిఆర్‌ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెప్తాం అని హెచ్చరించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 17/SE(KZ)/GHMC/TA1/2025-2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 12.06.2025

**పనుల సంఖ్య:** 1 పని, చెత్త ఎత్తివేతల కోసం ఆర్ఎఫ్‌సిలు-1, **మొత్తం విలువ:** రూ.7948251.00, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభం తేది / ఆఖరి తేది:** *బిడ్ దాఖలు ప్రారంభ తేది:* 16.06.2025న మ.03.00గం.ల నుండి, *బిడ్ దాఖలు ఆఖరి తేది:* 26.06.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి చిరునామా:** ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి. ఫోన్ నం. 8790522144, కమిషనర్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్),
DIPR R.O. No. : 3487-PP/CL/ADVT/1/2025-26, Date: 12-06-2025 గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా నా యొక్క పూర్వ పేరు **VENKATRAVAMMA NAIDU, S/O. VENKATESWARLU** కలదు. అయితే నేను నా యొక్క పేరును **VENKATA RAVMANA ARRCHANA NAIDU** అని NUUMBEROLOGY ప్రకారం పేరు మార్చుకున్నాను.

ఇట్లు
తమ విధేయురాలు
VENKATRAVAMMA NAIDU
S/O VENKATESWARLU (పాత పేరు)
VENKATA RAVMANA
ARRCHANA NAIDU (కొత్త పేరు)

**బహిరంగ వేలం ప్రకటన**

తేదీ: 19.06.2025న ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ (MT Office) నందు ఉదయం 10 గంటలనుండి 12 గంటల వరకు పోలీస్ వాహనాల యొక్క పాత బ్యాటరీలు, పాత టైర్లు మరియు వాహనాల విడిభాగాలను (పాతవి) బహిరంగంగా వేలం వేయుటకు అధికారులు నిర్ణయించినారు. కావున ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొని అట్టి సామాన్లు దక్కించుకోగలరు.

ఇట్లు
**పోలీసు శాఖ, ఖమ్మం**

ప్రజాపక్షం
శుక్రవారం, 13 జూన్

## గొప్పలు.. తిప్పలు..

1956 నవంబర్‌లో తమిళనాడులో జరిగిన ఒక రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని నాటి ప్రధానమంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూను లేఖలో వేడుకున్నారు. ప్రమాదకారణం సాంకేతికపరమైనదేనని ఎంత నచ్చజెప్పినా ఆయన వినలేదు. చివరకు రాజీనామాపై ఆమోదముద్ర పడింది. వాస్తవానికి, అంతకు కొద్ది మాసాల ముందే ఆగస్టులో నాటి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగినప్పుడే లాల్ బహదూర్‌శాస్త్రి మొదటిసారి రాజీనామాను సమర్పించారు. నెహ్రూ బలవంతాన వెనక్కి తీసుకున్నారు. అది ఆనాటి నాయకుల నైతిక, వ్యక్తిగత బాధ్యత కట్టుబాటుకు మచ్చుతునక.

నేటి పరిణామాలను పరికిస్తే నైతికతకు కాలం చెల్లడమే కాకుండా మంచి జరిగితే ఆ ఘనత నాదేనని ఢంకా బజాయించి చెప్పుకోవడం, చెడు జరిగితే కిమ్మనకుండా కారణాన్ని వేరొకరిపై నెట్టివేయడం సర్వసాధారణమైంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ నేపథ్యంలో సాగుతున్న రసవత్తర రాజకీయ సన్నివేశం ఇందుకొక నిదర్శనం. ప్రాజెక్టుకు శిరస్సు అయిన మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలనే నిర్ణయం తనది కాదని, వ్యాప్కోస్, ఇంజనీర్లు, క్యాబినెట్ సబ్‌కమిటీ, క్యాబినెట్‌ల నిర్ణయమేనని మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు కమిషన్ ముందు వాంగ్మూలమిచ్చారు. అంతకుముందు విచారణ ఎదుర్కొన్న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అవే మాటలు వల్లె వేశారు. ఇది తెలంగాణ ప్రజలందరినీ ఆశ్చర్యచకితులను చేసింది.

ఎందుకంటే, ఏడాదిన్నర క్రితం ముందు వరకు తొమ్మిదిన్నరేళ్లలో అధికారంలో ఉన్న టి(బి)ఆర్‌ఎస్ హయాంలో సింహభాగం కాళేశ్వరం ప్రాజెక్టును ఘనతగా కథలు కథలుగా ప్రచారం చేసుకునేవారు. కెసిఆర్ తన మెదడును, కాళ్ళను కరిగించి, గూగుల్ మ్యాపులను పరిశీలించి, దగ్గరుండి బ్యారేజీలు, కాల్వలు, రిజర్వాయర్‌లకు రూపకల్పన చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపం కల్పించారని తమ అగ్రనేతకు గులాబీ నేతలు భుజకీర్తులు తొడిగారు. తెలంగాణ అంతటా సకల కాలాలలో సజీవ జల వాహికలను సృష్టించిన అపరభగీరథుడు అని కీర్తించారు. సుమారు లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రచారం మాటున అవినీతి, ఏటా కరెంటు ఖర్చు, చెల్లించాల్సిన రుణభారం పాతిక వేల కోట్లు హరించుకుపోతున్నాయనే ప్రతిపక్షం, అధికారపార్టీయేతర తెలంగాణవాదుల ఆర్తనాదాలు కొట్టుకుపోయాయి. చివరకు కట్టిన మూడు నాలుగేళ్లకే మేడిగడ్డ బ్యారేజీకి పిటలు వారి, బిఆర్‌ఎస్ అధికారంలో నుంచి దిగిపోయే చివరినాటికే నిరుపయోగంగా మారిపోయింది. దానిని ఎల్లంపల్లికి అనుసంధానించే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి అదే. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టే ప్రశ్నార్థకంగా మారింది.

విచారణ నేపథ్యంలో బిఆర్‌ఎస్ నేతలు చేసిన వాదనలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఘోష్ కమిషన్ ముందు వాంగ్మూలాలతో గతంలో ప్రచారపటాటోపంలో కొట్టుకుపోయిన ప్రజలకు విషయాలు కొత్తగా తెలుస్తున్నాయి. అందులో కాళేశ్వరమనేదే ప్రత్యేక, కొత్త ప్రాజెక్టు కానే కాదనేది ఒకటి. నిజానికి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లోనే డాక్టర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ కట్టి, గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఆ నీటిని గ్రావిటీ ద్వారా తరలించాలనేది ప్రతిపాదన. మహారాష్ట్ర అభ్యంతరాల మేరకు బ్యారేజీని 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గిస్తే అంగీకరించే స్థాయిలో నీళ్ళుండవనే కారణంతో, బ్యారేజీ పాయింటును తుమ్మిడిహెట్టి కెసిఆర్ సర్కార్ తరలించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇది ప్రాజెక్టు రీడిజైనింగ్ తప్ప కొత్తది కాదని బిఆర్‌ఎస్ నేతలు చెప్పకనే చెప్పినట్లయింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువ నదీ ప్రవాహంలో కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ నిర్మించారు. అక్కడి నుంచి ప్రవాహానికి ఎదురీదేలా నీటిని తోడి ఎగువన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు, చివరకు పైన ఉండే ఎల్లంపల్లికి భారీ మోటార్లతో పంపేవారు. సునాయాసంగా తుమ్మిడిహెట్టి నుంచి దిగువకు ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చే అవకాశాన్ని వదులుకొని భారీ ఖర్చుతో నీటికి ఎదురీదేలా కట్టిన మూడు బ్యారేజీల కథ ఏమైందో అందరూ చూస్తున్నదే! తుమ్మిడిహెట్టి నుంచైనా, మేడిగడ్డ నుంచైనా నీటిని తెలంగాణ ఏర్పాటుకు ముందే పూర్తయిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే దిగువన సాగుకు పంపిణీ జరిగింది. బిఆర్‌ఎస్ నేతలు చెప్పిన మరో విషయమేమిటంటే, వానలు బాగా పడితే ఎగువన శ్రీరాంసాగర్ నుంచి, మోస్తరుగా కురిస్తే కడెం ప్రాజెక్టు నుంచి, వానలు సరిగా పడకపోతేనే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్ళు వస్తాయని. అంటే కాళేశ్వరం కొత్త ప్రాజెక్టు కాదు, ఉన్నదానికి అదనం అని అంగీకరించినట్లయింది.

కాదనలేని వాస్తవమేమిటంటే, దిగువన నీటిని పంపిణీ చేసేందుకు కాలువలు, భారీ స్థాయిలో రిజర్వాయర్లను టి(బి)ఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించడం. ఆ రిజర్వాయర్లవల్లనే పెరిగిన పంట దిగుబడులు చెబుతున్నాయి. అయితే, అవసరం లేకున్నా భారీ సామర్థ్యం, వ్యయంతో వాటిని కట్టడం కూడా నిర్వహణాంశంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్ళను తోడిపోసే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వినియోగంలో లేకున్నా, ఎస్‌ఆర్‌ఎస్‌పి, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నీటి ద్వారానే నీటి సమృద్ధి సాధించింది. అంటే ఆ మూడు బ్యారేజీలకు బదులు మూడో వంతు ఖర్చుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించి ఉంటే ప్రయోజనం ఉండేదని నిపుణులు, ప్రతిపక్షాల వాదన. మిగతా డబ్బుతో కొంత కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే సరిపోయేది.

ఒకవైపు కాళేశ్వరంలో అవినీతి జరగలేదని బిఆర్‌ఎస్ నాయకులు వాదనలు చేస్తుంటే, మరోవైపు ప్రాజెక్టుకు ఇఎన్‌సిలుగా, ఇఇలుగా, ఇంజనీర్లుగా పనిచేసిన అధికారుల ఇళ్ళు, కార్యాలయాలపై జరుగుతున్న ఎసిబి దాడుల్లో విస్తుపోయేలా వందల కోట్ల ఆస్తుల దస్తావేజులు, సంపద బైట పడుతుండడాన్ని ఏమనాలి? అప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఘనత కెసిఆర్‌దే అని చెప్పి, ఇప్పుడు బ్యారేజీలు కుంగిపోవడంపై జరుగుతున్న విచారణలో మాత్రం ఇంజనీర్లు, అధికారులు, క్యాబినెట్ నిర్ణయాల ప్రకారమే దాని నిర్మాణం జరిగిందని బిఆర్‌ఎస్ నేతలు మాట మార్చడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. గొప్పలు పాలకులకు, తిప్పలు అధికారులకు అన్నమాట!

# కాళేశ్వరం ప్రాజెక్టు అను ఒక 'మాయ'!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

సామాన్యులను కట్టిపడేసే మాయ అంటే False Dreams + Fake Success + Forced Comparison. False Dreams: 'అతి తక్కువ సమయంలో, తక్కువకష్టంతో, పెద్ద విజయం సాధించవచ్చు' అని నమ్మించడం.
(Shortcut Success Syndrome). Fake Success:Looks, Likes, Lifestyle చూపించి నిజ జీవితాన్ని మరిచిపోయేలా చేయడం.
Forced Comparison: 'ఇతను ఇలా ఉన్నాడు, నేను ఎందుకు ఇలా లేను? 'అనే మైండ్‌సెట్ నాటడం. మాయ:నీకు అవసరం లేని దానిని కావాలని అనిపించడం, నీ తృప్తిని నాశనం చేయడం. నిజమైన జీవితం కాకుండా మాయా ప్రపంచంలో బతకించడం! 'ఈ కళలో ఆరితేరిన మనుషులు కెసిఆర్, కెటిఆర్, దాదాపు పదేండ్లు వాళ్ళు చేసిందంతా ఇదే. మాయతో సామాన్యుడ్ని బంధించివేయడమే. ఎన్నో పథకాలు, తాయిలాలు, సంక్షేమ కార్యక్రమాలు.

''జనానికి గొప్పగా ఉండేవి అంటే చాలా ఇష్టం. అవి వాళ్ళను ఆశ్చర్యచకితులను చేసేంత అద్భుతంగా, విశ్వరూపంలో కనిపించాలి. మీరు చూపించే అద్భుతాలను చూసేందుకు జనం తండోపతండాలుగా వస్తారు. కళ్ళకు కనిపించేది జనం హృదయాలకు సూటిగా చేరుతుంది. పైపై మెరుగులకే జనం ఎప్పుడూ ముగ్ధులవుతూ ఉంటారు'' సుప్రసిద్ధ రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెలి అన్నాడు. మాకియవెలి చెప్పింది చెప్పినట్టుగా ఈ దేశంలో సరిగ్గా ఆచరణలో పెట్టిన ఏకైక నాయకుడు కెసిఆర్.

కాగా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఎన్ని పుస్తకాలు అయినా రాయవచ్చు. ఎన్ని లక్షల పేజీలైనా రచించవచ్చు. ఏటా ఆదాయం 14,709 కోట్లు. ఖర్చు28,081 కోట్లు. ఇదీ స్థూలంగా కాళేశ్వరం కథ! ఈ ప్రాజెక్టుతో వినియోగంలోకి వచ్చింది 40,888 ఎకరాలు.

2019లోనే బరాజ్‌లు దెబ్బతిన్నానాటి కెసిఆర్ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. కాళేశ్వరం ఆయకట్టు అంతా ఒక కనికట్టు. 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీళ్లు ఇచ్చే విధంగా డిజైన్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో 2022 మార్చి నాటికి కేవలం 40,888 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీళ్లు ఇచ్చినట్టు తేలింది. దీనిని బట్టి కాళేశ్వరంలో లక్ష కోట్ల నిధులు ప్రవహించినా లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని స్పష్టం అవుతుంది. 2016 మే 2వ తేదీన కాళేశ్వరంకు శంకుస్థాపన జరిగింది. 2019 జూన్ 21వ తేదీన ప్రారంభించారు. 2022 మార్చి నాటికి 14.83 లక్షల ఎకరాలకు సంబంధించిన 'డిస్ట్రిబ్యూటరీ' వ్యవస్థ అభివృద్ధికి పనులను చేపట్టాలని నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం తలపెట్టింది. కానీ ఇందులో 56 ప్రాజెక్ట్ పనులకు 12పనులు మాత్రమే పూర్తి చేశారు. నాలుగు లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ అభివృద్ధి పనులు అసలు చేపట్టలేదు. మరోవైపు 32పనుల్లో తొలి ఒప్పందం గడువు ముగిసినా భూసేకరణ పూర్తి కాలేదు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక తెల్ల ఏనుగు అని నిర్ధారణ చేయడానికి పెద్దగా పరిశోధనలు చేయనవసరం లేదు. ప్రాజెక్ట్ మొత్తం పూర్తికాక ముందే కుంగిపోయి ప్రశార్థకంగా మారింది. ప్రాజెక్ట్‌లో నీళ్లు నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించడంతో పాటు, మరో 4.71 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం. అయితే కొత్త ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టులో పండే పంటలకు ఎత్తిపోసే నీళ్లు, తాగునీరు, పరిశ్రమలకు అందించే నీటికి అయ్యే ఖర్చుతో పాటు ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణ వాయిదాల చెల్లింపు కలిపి ఏటా ఖర్చు రూ.28,081.54 కోట్లుగా తేలింది. వాటన్నింటి ద్వారా ఆదాయం మాత్రం రూ.14,709.84 కోట్లు.

ఇందులో ఎత్తిపోతలకు అయ్యే విద్యుత్తు చార్జీలు రూ.10,374.56 కోట్లు. నిర్వహణ ఖర్చులు రూ.272.70కోట్లు కలిపి రూ.10647.26 కోట్లు అవుతుందని 'కాగ్' నివేదిక స్పష్టం చేసింది. లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్ట్‌కు 'కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్' ద్వారా తీసుకున్న రుణం రూ.64.204.13 కోట్లు. వడ్డీలు సకాలంలో చెల్లించకుండా వాయిదా వేయడంతో అదనంగా మరో రూ.19,556.4 కోట్ల వడ్డీ అసలుతో కలిపి భారం పడుతోంది. దీంతో అసలు రూ.87,369.89కోట్లు అయింది. దీనికి వాయిదాలుగా ప్రతి ఏటా వడ్డీ, అసలు కింద రూ.10 వేల కోట్ల నుంచి 14 వేల కోట్లవరకు చెల్లించవలసి ఉన్నది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. పైగా ఈ ప్రాజెక్ట్‌కు తెచ్చిన అప్పులు తీర్చడం కోసం, కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడినట్టు పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

2019 జూన్ 21న మహారాష్ట్ర, ఎపి సిఎంలు కూడా హాజరయి అట్టహాసంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి.ఆర్‌సీసీ వేసిన కోట్, సీసీ కర్టెన్ గోడలలో కొంత బాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకు పోయాయి.దీనివల్ల మేడిగడ్డ బరాజ్‌కు రూ.83.83 కోట్లు,అన్నారం 65.32 కోట్లు,సుందిళ్ల బరాజ్‌కు రూ.31.24 కోట్లు మొత్తంగా రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లింది.డిజైన్ లోపం,లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగింది.జరిగిన నష్టానికి తమకు సంబంధం లేదని 2019 లోనే కాంట్రాక్టర్లు ప్రకటించారు.తమకు ఇచ్చిన డిజైన్ల ప్రకారమే తాము పనులు చేశామని జరిగిన నష్టానికి తామెలా బాధ్యులమవుతామని ఎదురు ప్రశ్నిస్తున్నారు.నిధులు ఇస్తే పనులు చేయడానికి గుత్తేదార్లు ముందుకు వచ్చారు. దీంతో సాగునీటి శాఖనే ఈ పనులు చేపట్టడానికి రూ. 470.03 కోట్లతో అంచనాలు రూపొందించినా కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపట్టలేదు.

నిర్వహణ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగినట్లు కేంద్ర జలశక్తి శాఖ నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ తేల్చి చెప్పింది. 2019–20లలో మేడిగడ్డ ప్రాజెక్టును ప్రారంభించినప్పటి నుంచీ సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లను, లాంచింగ్ అప్రాన్‌లను తనిఖీ చేయలేదని, నిర్వహించలేదని కమిటీ గుర్తించింది. నిర్వహణ లోపం కారణంగానే బరాజ్ కుంగిందని కమిటీ అభిప్రాయపడింది. బరాజ్‌ను పునరుద్ధరించేవరకు ఇది నిరుపయోగంగానే ఉంటుంది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంటుందన్న అభిప్రాయాన్ని కేంద్ర జలశక్తి కమిటీ వ్యక్తం చేసింది.

ఇదిలా ఉండగ కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దేశమంతా ప్రచారం జరిగింది. ''కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంలా మారింది. వేల కోట్ల అవినీతి జరిగింది'' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా, జెపి నడ్డా అనేక సార్లు ఆరోపణలు చేశారు. కానీ కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ప్రస్తుత బిజెపి ఎంపి, కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా



పనిచేసిన ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా ఇచ్చిన వివరణతో బిజెపి షాక్‌కు గురయింది. ఈటల రాజేందర్, కెసిఆర్‌తో కుమ్మక్కయ్యారు. కాళేశ్వరంలో ఈటలకు కూడా వాటాలు ముట్టినందునే కెసిఆర్‌కు అనుకూలంగా మాట్లాడారు. అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందంటున్నారు. టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని ఈటల చెప్పారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే ప్రాజెక్టు అంచనాలను పెంచారని చెప్పారు. బిఆర్‌ఎస్‌తో బిజెపికి ఉన్న లోపాయికారీ ఒప్పందం మేరకే కెసిఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా? బిజెపి నాయకత్వం సమాధానం చెప్పాలి.

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల విచారణకు హాజరు కావడానికి, మూడు రోజుల ముందే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఒక బాంబు పేల్చారు. ''ఈటల, బిఆర్‌ఎస్ నాయకుడు హరీష్ రహస్యంగా సమావేశమైనట్టు నా దగ్గర పక్కా సమాచారం ఉంది'' అని పిసిసి అధ్యక్షుడు అన్నారు. మహేష్‌గౌడ్‌కు అందిన సమాచారం నిజమే అయితే ఈటల వివరణపై బిఆర్‌ఎస్ ప్రభావం ఉన్నట్టు భావించవచ్చు. ''కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ముందుగా రూ.82వేల కోట్ల అంచనా వేశారు. తరువాత ఎంత పెరిగిందో నాకు తెలియదు. డిపిఆర్ కోసం వ్యాప్కోస్ సంస్థకు రూ.595 కోట్లు విడుదల చేసినట్లు నాకు తెలియదు''. అని కాళేశ్వరం కమిషన్ విచారణలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎంపి ఈటల రాజేందర్ చెప్పారు.

''మహారాష్ట్ర అభ్యంతరాలు, సిడబ్ల్యూసి సూచనల నేపథ్యంలో ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సి వచ్చింది. సిడబ్ల్యూసి అనుబంధ సంస్థ అయిన వ్యాప్కోస్‌ను ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని కోరాం. సమస్యలన్నింటికీ పరిష్కారంగా నీటిలభ్యతకు పూర్తిగా భరోసా ఉన్న మేడిగడ్డ కనిపించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలని వ్యాప్కోస్ సిఫార్సు చేసింది. 2016 జులై 17న వ్యాపోస్ సంస్థ లైడార్ సర్వే చేసింది. 2017 సెప్టెంబర్ 17న సిడబ్ల్యూసి రాసిన లేఖలో మేడిగడ్డ వద్ద 283 టిఎంసిల నీళ్లున్నాయని చెప్పింది. అన్ని రిపోర్టులపై చర్చించి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలని నిర్ణయించాం. మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసే బాధ్యతను వ్యాప్కోస్‌కే అప్పగించినం. బరాజ్‌ల స్థలాలను వ్యాప్కోస్ ఎంపిక చేసింది. గతంలో ప్రాణహిత చేవెళ్ల డిపిఆర్‌ను వ్యాప్కోసే రూపొందించింది. వ్యాప్కోస్ సంస్థ నివేదికల ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించినం. 2016, జనవరి 17న వ్యాప్కోస్ డిపిఆర్ సమర్పించింది. ఆ తర్వాత నిర్ణయం తీసుకున్నం. వ్యాప్కోస్ నుంచి లెటర్ వచ్చాకే బరాజ్‌ల లొకేషన్లను మార్చారు. హైపవర్ కమిటీలో 'వ్యాప్కోస్' అధికారి కూడా సభ్యులుగా ఉన్నారు. హైపవర్ కమిటీ, వ్యాప్కోస్ కలిసి బరాజ్‌ల లొకేషన్ల మార్పునకు ఆమోదం తెలిపాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 30టిఎంసిలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, 10 టిఎంసిలు ఎన్ రూట్ గ్రామాల మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు,16 టిఎంసిలను పారిశ్రామిక అవసరాలకు.. ఇలా వివిధ వర్గాలకు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో రుణాల చెల్లించాలని అనుకున్నాం. కరోనా వల్ల 2 ఏండ్లు ఆలస్యమైంది. 3 బరాజ్‌లు, ప్రాజెక్టులోని రిజర్వాయర్లన్నింటిలో కలిపి 141 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవచ్చు. అత్యధికంగా మల్లన్నసాగర్‌లో 50 టిఎంసిలను నిల్వ చేసుకోవచ్చు''. అని మాజీ సిఎం కెసిఆర్, మాజీమంత్రి హరీశ్ రావు కాళేశ్వరం కమిషన్ ఎదుట వివరించారు.

కెసిఆర్, ఈటల, హరీశ్ రావుల వివరణలో ఒక సంస్థ పేరు పదే పదే ప్రస్తావనకు వచ్చింది. ఆ సంస్థ పేరు వ్యాప్కోస్. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినా వ్యాప్కోస్ రాష్ట్రాల్లో జలవనరులకు సంబంధించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, బరాజ్‌ల నిర్మాణాలకుగాను ప్రణాళిక, డిజైన్లు, నిర్మాణ వ్యవహారాలు ఇతర అంశాలపై సర్వేలు జరిపి, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి సంబంధిత ప్రభుత్వాలకు అందిస్తుంది. 'వ్యాప్కోస్'సూచనలు, నివేదికల ఆధారంగానే కాళేశ్వరంను నిర్మించినట్టు బిఆర్‌ఎస్ బలంగా వాదిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినంత మాత్రాన 'అత్యంత విశ్వసనీయత' గలిగినది అని ఎవరయినా సర్టిఫికెట్ ఇస్తే అంతకన్నా అవివేకమూ, అమాయకత్వము మరొకటి లేదు.

'వ్యాప్కోస్' మాజీ చైర్మన్, ఎండి రాజేందర్ గుప్తా, ఆయన కుమారుడు గౌరవ్‌లను 2023మేలో అరెస్టు చేశారు. రాజేందర్ గుప్తా ఇంట్లో రూ.38 కోట్ల నగదును సిబిఐ స్వాధీనం చేసుకున్నది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రాజేందర్ గుప్తాను జైలుకు పంపించారు. ఆయన వ్యాప్కోస్‌లో 1989లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి 2010ఏప్రిల్‌లో చైర్మన్, ఎండి అయ్యారు. ఐదేండ్ల తర్వాత ఆయన పదవీకాలం 2018 సెప్టెంబర్‌వరకు పొడిగించారు. మళ్ళీ 2020వరకు రెండేండ్ల కాలానికి పదవిని పొడిగించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2016నుంచి 2019వరకు మూడేండ్లలో నిర్మించారు. ఇదొక రికార్డుగా కెసిఆర్, ఆయన పార్టీ నాయకులంతా చెబుతుంటారు. ఇంత వేగంగా, ఇలాంటి భారీ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినందువల్ల కూడా, నాణ్యతాపరమైన సమస్యలు తలెత్తినట్టు నిపుణుల విశ్లేషణ. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ముడిపడి ఉన్న వారిలో వ్యాప్కోస్ మాజీ చైర్మన్ రాజేందర్ కుమార్ గుప్తా, ఇరిగేషన్ మాజీ ఈ.ఎన్.సి, హరిరామ్, మాజీ ఈ.ఈ.. నూనె శ్రీధర్ అరెస్టయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగాలపై ఈ ముగ్గురి అరెస్టులు జరిగాయి.ఇంకా ఎంతమంది అరెస్టు కానున్నారో తెలియదు.

''మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ వాళ్ళే బాంబులు పెట్టారేమో? బ్యారేజీ పగుళ్లకు వాళ్లే కారణం కావచ్చునేమో?. బ్యారేజీలో రెండు చోట్ల పగుళ్లు వస్తే ఏదో అయిపోయినట్లు చేస్తున్నారు. ఇలాంటి కట్టడం మరోదేశంలో నిర్మిస్తే కెసిఆర్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసేది. ఆయన కీర్తి అజరామరంగా ఉండేది. కెసిఆర్‌కు ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చేవి. రేవంత్ రెడ్డి చిల్లరగాడు. ఆయన కెసిఆర్ వెంట్రుక కూడా పీకలేరు'' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జూన్ 11న నిప్పులు చెరిగారు. సిఎంపై అన్ పార్లమెంటరీ భాషలో దుమ్మెత్తిపోశారు.

''రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రమాణం చేసే డిసెంబర్ 23వరకు, 60 రోజులకుపైగా అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం, బాంబులు ఎవరు పెట్టారో పోలీసులతో విచారణ చేసి ఎందుకు తేల్చలేదు? మీ బుకాయింపునకు సమాజం విస్తుపోతోంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికను ఎల్ అండ్ టి తిరస్కరించడాన్ని కెటిఆర్ స్వాగతించడం ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. నిర్మించిన నాలుగేండ్లకే మేడిగడ్డ భూమిలో ఐదు అడుగులు ఎందుకు కుంగింది? నిట్ట నిలువునా పునాది నుండి పైవరకు ఎందుకు చీలిపోయింది? మూడు బ్యారేజీలలో భూ అంతర్గత, భూ సాంకేతిక పరీక్షలు, ఇంకా అనేక పరీక్షలు ప్రముఖ వైజ్ఞానిక సంస్థలతో అన్నారం, సుందిళ్లలో కూడా చేయించాలని ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు సిఫారసు చేస్తున్నది? మూడు బ్యారేజీలలోనూ మేడిగడ్డ లాంటి అత్యంత ప్రమాదకర పరిస్థితిలే ఉన్నాయనేది వాస్తవం కాదా? ఎన్డిఎస్ఏ పేర్కొన్నట్లు ఆ నాలుగు సంవత్సరాలలో మేడిగడ్డ బ్యారేజ్ గుండా ప్రవహించిన భారీ వరద నీరు మేడిగడ్డ కుప్పకూలడానికి ప్రధాన కారణం.ఇందులో 90 శాతం నీరు ప్రాణహితదే. కెసిఆర్ ఒత్తిడిలో ఇంజనీర్లు సృష్టించిన వైకల్య విపత్తు ఇది.తక్కువ ఖర్చుతో పూర్తయ్యే తుమ్మిడిహెట్టి రాక్ బెడ్‌ను వదిలి,మూడు బ్యారేజీలను బలహీన ఇసుక బెడ్ దగ్గర రీ ఇంజనీరింగ్,రీ డిజైనింగ్ చేయడమే ఈ విపత్తుకు కారణం'' అని సామాజిక కార్యకర్త నయనాల గోవర్ధన్ అంటున్నారు.

# 'భారతమాత'పై అనవసర రాద్ధాంతం

బినొయ్ విశ్వం
మాజీ ఎంపి, సిపిఐ జాతీయ కార్యదర్శి

ఏటా జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించి ఇటీవల కేరళలో అకస్మాత్తుగా, అవసరం లేని వివాదం తలెత్తింది. దీనిని దురదృష్టవశాత్తు రాజ్‌భవన్ రేకెత్తించింది. కేరళలో ప్రతి ఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విస్తృతంగా నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని వేలాది మొక్కలను నాటుతుంటారు. ప్రజలు ఈ రోజును తమకు పర్యావరణంపై ఉన్న అవగాహనను, దాని పట్ల గల నిబద్ధతను సుసంపన్నం చేసుకునే రోజుగా జరుపుకుంటూ ఉంటారు.

**ప్రతిపాదన**

ఈ ఏడాది రాజ్‌భవన్ ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. దీనిని ప్రారంభించేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అంగీకారం తెలిపారు. ముందు రోజు సాయంత్రం వ్యవసాయ మంత్రి కార్యాలయానికి కార్యక్రమ వివరాలను పంపిస్తూ, ఒక చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాల్సి ఉంటుందని రాజ్‌భవన్ కొత్త ప్రతిపాదన పెట్టింది. ప్రతిపాదన అందిన వెంటనే మంత్రి కార్యాలయం మరింత స్పష్టత ఇవ్వాలని కోరింది. ఇందుకు గవర్నర్ కార్యాయలం స్పందిస్తూ, 'భరతమాత' అని చెప్పబడే చిత్రపటం ఫోటోను పంపించారు. ఆశ్చర్యకరంగా రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) తమ కార్యక్రమాలలో ఉపయోగించే రూపమే ఆ చిత్రపటంలో ఉంది. రాజ్‌భవన్ పంపిన చిత్రంలో భారతమాత సింహంపై కూర్చొని, ఆర్‌ఎస్‌ఎస్ జెండాను తలపించే కాషాయ జెండాను పట్టుకొని ఉంది. చిత్రపటం నేపథ్యంలో ఉన్న దేశపటము కచ్చితంగా గణతంత్ర భారతదేశ పటం కాదు.

కొన్ని సంప్రదింపుల తరువాత, ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ఆ చిత్రపటాన్ని ఉపయోగించడం, ఎక్కువ చేసి చూపడం అసమంజసమని గవర్నర్ కార్యాలయానికి మంత్రి సమాచారం అందించారు. కానీ, ఆ చిత్రపటం లేకుండా కార్యక్రమం నిర్వహించే అవకాశమే లేదని, తాను హాజరుకాబోనని గవర్నర్ నొక్కి చెప్పారు. అందుకు గల కారణాలేమిటో ఆయనకే తెలియాలి.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో కార్యక్రమ వేదికను సచివాలయం ప్రాంగణానికి మార్చవలసి వచ్చింది. దానికి గవర్నర్ తప్ప అతిథులందరూ హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారతమాత పట్టుకున్న కాషాయజెండాను గవర్నర్ కీర్తించినట్లు వార్తలు వెలువడ్డాయి. అది భారతదేశ ప్రతీక అని ఆయన వాదించారు. కేరళ ప్రభుత్వాన్ని, భారతమాత అనే ఆయన ఆలోచనను సమర్థించేందుకు సిద్ధంగా లేనివారిని విమర్శించారు కూడా.

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వ హయాంలో గవర్నర్‌లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు కేవలం కేరళకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా చోటుచేసుకున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. ఇప్పుడు ఈ వివాదాలకు భారతమాతను కేంద్రస్థానానికి తీసుకువచ్చారు గవర్నర్ ఆర్లేకర్.



భారతమాత వివాదానికి వ్యతిరేకంగా ఎఐవైఎఫ్ నిర్వహించిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బినొయ్ విశ్వం

**చలనశీల భావన**

భారతమాత భావన భారతదేశ ప్రజల సామూహిక స్మృతిలో వేళ్ళూనుకుంది. వలసవాద వ్యతిరేక పోరాటంలో ఈ భావనను విభిన్న సామాజిక రాజకీయ దృక్పథాలు కలిగిన వేర్వేరు సమూహాలు, సాతంత్ర్యపోరాటంలో సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తి కలిగించి, ఐక్యపరిచేందుకు ఉపయోగించేవి. ఒక ప్రత్యేక భావననే నిజమైన వ్యక్తీకరణగా, భారతమాత రూపుగా ఎవ్వరూ వాదించలేదు. అదొక విస్తృత భావన.

జాతి, జాతీయత, ప్రపంచ దృక్పథాలపై తమ స్వంత భావనలకు అనుగుణంగా అనేక మంది భారతమాతను అన్వయించుకున్నారు. చాలా కాలం తరువాత ఆర్‌ఎస్‌ఎస్ తన స్వంత అవసరాల కోసం , భారతమాత గురించి తమ స్వంత ఆలోచనతో ముందుకు వచ్చి ఉండొచ్చు.

ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన భారతమాత మాత్రమే నిజమైన ప్రతిమ అనే భావనను వ్యక్తిగా విశ్వసించే హక్కు గవర్నర్ ఆర్లేకర్‌కు ఉంటుంది. ఒక నిర్దిష్ట సిద్ధాంత ప్రభావంలో ఉండే వారికి భారతమాత కాషాయ జెండాను పట్టుకొని ఉంటుందనే ఆలోచన చేసే హక్కు ఉంటుంది. ఆమె సింహంపై కూర్చొని ఉండడాన్ని కూడా వారు స్తుతించవచ్చు. భారతమాత చిత్రపటంలో వెనుకాల ప్రత్యేకంగా గీసిన దేశపటం కూడా సరైనదేనని వారికి అనిపించవచ్చు.

తన సైద్ధాంతిక, సంస్థాగత చట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ అఖండ భారత్' అనే తమ స్వప్నానికి, సమరశీల పరాక్రమ జాతీయవాదానికి అనుగుణంగా భారతమాత రూపును ముందుకు తీసుకువచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ శాఖలలో ఇలాంటి భారతమాతను స్తుతించి ఉండొచ్చు. ఏదో ఒక వాదాన్ని మాత్రమే ఆమోదనీయమైన, అధీకృతమైనదిగా రుద్దడం వృథా ప్రయాస. అధికారిక కార్యక్రమాలలో ఆర్‌ఎస్‌ఎస్ తమ సైద్ధాంతిక, రాజకీయ భావజాలాన్ని జొప్పించేందుకు ప్రయత్నిస్తే విషయం మరింత సంక్లిష్టమవుతుంది. ప్రజాజీవితంలో గొప్ప అనుభవం కలిగిన గవర్నర్ ఆర్లేకర్‌కు ఇలాంటి కనీస సూత్రం తెలిసి ఉంటుందని ఆశిస్తాం. రాజ్యాంగ స్థానాలలో ఉండే వారు తమ రాజకీయ ఇష్టాయిష్టాలను ప్రదర్శించకూడదు. రాజకీయ నిబద్ధతకు, అధికారిక బాధ్యతకు మధ్య విభజన రేఖ వారి మదిలో మరింత ప్రస్ఫుటంగా ఉండాలి.


**నెహ్రూ ఏమన్నారంటే..**

గవర్నర్, ఆయన సైద్ధాంతిక ఆడుగుజాడలలో నడిచే ప్రజలకు అనేక కారణాల రీత్యా మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే ఇష్టం ఉండకపోవచ్చు. కానీ నెహ్రూను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఒక చోట ఇలా రాసారు – ''కొన్ని సార్లు నేను సమూహాన్ని చేరుకున్నప్పుడు, ఘన స్వాగత గర్జనలు నాకు అభివాదం చేస్తాయి: భారత్‌మాతాకీ జై – (మాతృభారతికి జయము) . అకస్మాత్తుగా వారిని నేను అడుగుతుంటాను.. ఈ అరుపులకు అర్థమేమిటి, ఈ భారతమాత ఎవరు.. భారతదేశం అంటే ఇదే అని వారు అనుకుంటారు. కానీ, అది అంతకంటే ఎక్కువ. భారతదేశ పర్వతాలు, నదులు, అడవులు, విశాల క్షేత్రాలు.. అవన్నీ కూడా మనకు ప్రియమైనవే, కానీ అంతిమంగా పరిగణనలోకి తీసుకునేది భారతదేశ ప్రజలను. వారిలాంటి ప్రజలను, నన్ను, విశాల నేలపై విస్తరించిన వారందరినీ. భారతమాత, మాతృభారతి, అంటే ఇలాంటి ప్రజలే. మీరంతా భారతమాతలో భాగాలే. ఒక విధంగా భారతమాత అంటే మీరే. ఈ ఆలోచన నెమ్మదిగా వారి మెదళ్ళల్లోకి ప్రవేశిస్తుంటే, ఒక గొప్ప ఆవిష్కరణను సాధించామనే భావనతో వారి కళ్ళు వెలిగిపోతాయి''.

# జీవనోపాధికి కుట్టు మిషన్

పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సూయింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించా అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి నేస్తమైంది కుట్టు మిషన్. మహిళలకు ఆకడత్ప మిత్రుడిలా నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి, నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం సాధారణమైంది.

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 13 జూన్‌న జాతీయ కుట్టు మిషన్ దినం లేదా నేషనల్ సీవింగ్ మిషన్ డే పాటించడం ఆనవాయితీగామారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్యజీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగామారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పనితీరు పట్ల అవగాహన, మిషన్



సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్రడిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం లాంటివి చేయవచ్చు.

కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 1829జూన్13న ఫ్రెంచ్ టేఫెంచ్ బార్థలెమి టిమ్మోనియర్ కృషితో కుట్టు యంత్రం తయారైంది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది. 10 సెప్టెంబర్ 1847న అమెరికన్ ఇలియాస్ హోవె తొలిసారి కుట్టు మిషన్‌ను పేటెంట్ చేసారు. 1851లో ఐజాక్ సింగర్ అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందింది వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. ఇలా కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది.

నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి, మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిహార్‌లో నిరుద్యోగం పెరిగిపోవడంపై కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు

**పాట్నా :** బిహార్‌లో ఉద్యోగాలు సృష్టించడంలో నితీశ్‌కుమార్ ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. పాట్నాలో జరిగిన నిరసన ప్రదర్శనలో నిరసనకారులతో పార్టీ సీనియర్ నాయకుడు రాజ్యసభ ఎంపి దీపేందర్‌సింగ్ హుడా భాగస్వామి అయ్యారు. నియోజన్ భవన్ వరకు ర్యాలీ జరిగింది. ఆగ్రహించిన నిరసనకారులు 'నియోజన్ భవన్' గేట్లకు తాళాలు వేశారు. బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ(బిపిసిసి) అధ్యక్షుడు రాజేశ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఉద్యోగాలైనా ఇవ్వండి లేదా గద్దె నుంచి వైదొలగండి' (అవర్ నౌకరీ దో...యా గద్దీ చోడో) నిరసనలు బిహార్‌లోని 25ప్రాంతాలలో జరిగాయని చెప్పారు. రాష్ట్రంలోని 25 నియోజన్ భవనాలు పనికిరాకుండా పోతున్నాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టని ఫలితంగా అవినిరుపయోగంగా ఉన్నాయన్నారు.

# భారత్‌లో జరిగిన భారీ విమాన ప్రమాదాలు..

**న్యూఢిల్లీ :** గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన విమానం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో భారత్‌లో జరిగిన విమానాల ప్రమాదాల్లో ఇది భారీదని నిపుణులు భావిస్తున్నారు. గతంలో జరిగిన భారీ విమాన ప్రమాదాలు పరిశీలిస్తే...



* 2020 కరోనా మహమ్మారి సమయంలో విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా బోయింగ్ 737–800 విమానం దుబాయ్ నుంచి కేరళలోని కోజికోడ్‌కు బయలుదేరింది. అదే సమయంలో భారీ వర్షం కారణంగా అదుపుతప్పింది. 30 అడుగుల లోయలో పడి విమానం రెండుగా చీలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్ల సహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

* 2010 మేలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 812 కుప్పకూలింది. ఇది అత్యంత భారీ ప్రమాదం. 166 మంది ప్రవాస భారతీయులు ఉన్న ఈ విమానం దుబాయ్ నుంచి మంగళూరుకు వచ్చింది. సకాలంలో రన్‌వేపై ఆగలేకపోయింది. రన్‌వే దాటి లోయలోకి దూసుకెళ్లింది. మంటలు చెలరేగడంతో 158 మంది మృతి చెందారు. వీరిలో 8 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

* 1998 జులైలో ఆలయన్స్ ఎయిర్ ఫ్లైట్ బోయింగ్ 7372 ఎ8 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. జనాలు ఉన్న ప్రాంత్రంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన బిహార్‌లోని పట్నా విమానాశ్రయం సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 55 మంది ప్రయాణికులు మరణించగా.. మరో ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు.

* 1996 హరియానాలో మరో ఘోర ప్రమాదం జరిగింది. సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానం 763, కజికిస్థాన్ ఎయిర్ లైన్స్ విమానం 1907 ఢీకొన్నాయి. సమాచారం లోపం కారణం ఈ ప్రమాదం జరిగింది. రెండు విమానాల్లో 340లకు పైగా మంది ప్రయాణికులు, సిబ్బంది మరణించారు.

* 1993 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన ఇండియన్ ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం సమయంలో ప్రమాదానికి గురైంది. రన్‌వేపైకి వచ్చిన ట్రక్కును ఢీకొట్టింది. దీంతో విమానంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 118 మంది ప్రయాణికులు, సిబ్బంది 55 (గ్రౌండ్ సిబ్బందితో కలిపి) ప్రాణాలు కోల్పోయారు.

* బెంగళూరు విమానాశ్రయంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 కుప్పకూలింది. రన్‌వేను తాకడంతో నాడు ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటన 1990 ఫిబ్రవరిలో చోటు చేసుకుంది. ఈ విమాన ప్రమాదంలో 146 ప్రయాణికులు, 92 మంది విమాన సిబ్బంది చనిపోయారు.

# న్యాయ క్రియాశీలత.. న్యాయ ఉగ్రవాదంగా మారకూడదు

### లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో జరిగిన సెమినార్‌లో సిజెఐ గవాయ్



**న్యూఢిల్లీ :** న్యాయపరమైన క్రియాశీలత నిలదొక్కుకోవాలి కానీ, అది న్యాయ ఉగ్రవాదంగా మారకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ఉద్ఘాటించారు. న్యాయ సమీక్ష అధికారాన్ని తక్కువగానే ఉపయోగించాలని, అయితే ఒక చట్టం రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించినపుడే దానిని అమలు చేయాలన్నారు. సాధారణంగా న్యాయవ్యవస్థ ప్రవేశించకూడని ప్రాంతంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంటారు' అని ఒక లీగల్ న్యూస్ పోర్టర్ నుంచి వచ్చిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా చెప్పారు. 'రాజ్యాంగం అనేది సిరాలో చెక్కబడిన నిశ్శబ్ద విప్లవం' అని అభివర్ణించారు. అది చారిత్రకంగా అణిచివేతకు గురైన వారి ఉద్ధరణకు హామీ ఇవ్వడమే కాకుండా ఒక పరివర్తన కలిగించే శక్తిగా పని చేస్తుంది' అని గవాయ్ చెప్పా రు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో మంగళవారం 'రాజ్యాంగ వాగ్దానం అమలు..ప్రాతినిధ్యం నుంచి ఆచరణ వరకు' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'రెండవ దళితుడు, మొదటి బుద్ధుడిగా అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన అణగారినవర్గాలపై సానుకూల ప్రభావాన్ని హైలెట్ చేస్తూ తననే ఒక ఉదాహరణగా చెప్పారు. అనేక దశాబ్దాల క్రితం భారతదేశంలోని మిలియన్ల కొద్దీ పౌరులు అంటరానివారిగా పిలువబడ్డారు. వారిని అపవిత్రులుగా చెప్పబడ్డారు. వారు వారికి వారుగా నోరువిప్పి మాట్లాడలేని వారుగా చెప్పబడ్డారు. 'కానీ ఈ రోజు మేం ఉన్నాం అని చెబుతున్నాం. ఎవరైతే అలా చెప్పబడ్డారో ఆ వర్గానికి చెందిన ఒక వ్యక్తే స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. ఈ దేశంలోనే అత్యున్నత న్యాయవ్యవస్థ కార్యాలయానికి ఆయన నిర్వాహకుడుగా ఉన్నారు' అని సిజెఐ చెప్పారు.

# జస్టిస్ యశ్వంత్‌వర్మ అవినీతి 'అభిశంసన'పై 'సుప్రీమ్' నివేదిక వెల్లడించండి

### కేంద్ర సర్కార్‌కు కాంగ్రెస్ విజ్ఞప్తి
### పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానానికి ప్రభుత్వం కసరత్తు



**న్యూఢిల్లీ :** జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ నివేదికను పార్లమెంట్ సమావేశాలకు ముందే ఆయన అభిశంసనపై ప్రభుత్వానికి వైఖరిని స్పష్టం చేయడం కోసం షేర్‌చేయాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ విషయాన్ని గురువారం ఆ పార్టీ వర్గాలు తెలియజేశాయి. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదని ఆ వర్గాలు చెప్పాయి. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన అధికారిక నివాసంలో మార్చిలో జరిగిన అగ్నిప్రమాదంలో అనేక నగదు కట్టలు కాలిపోయినట్లు కనుగొనడంతో ఆరోపణలు తలెత్తాయి. ఆ తర్వాత ఆయన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయబడ్డారు. కాలిపోయిన ఆ నగదు గురించి తనకు తెలియదని స్పష్టం చేశారు. అయితే ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ అనేకమంది సాక్షులను విచారించి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేసి జస్టిస్ యశ్వంత్‌వర్మపై నేరారోపణ చేసింది. ఈ నేపథ్యంలో జులై నెల 21నుంచి జరుగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. ఈఅభిశంసన తీర్మానం పట్ల తమ వైఖరిని స్పష్టం చేయడానికి కమిటీ రిపోర్టును షేర్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మంత్రి కిరెణ్ రిజిజును కోరిందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలియజేశాయి. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా తీసుకురానున్న అభిశంసన తీర్మానంపై అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు గతవారం నొక్కిచెప్పారు. న్యాయవ్యవస్థలో అవినీతి మరకను తుడిచివేసే ఒక పారదర్శక పార్టీగా అందరినీ కలుపుకుని పరిష్కరిస్తామని రిజిజు తెలియజేసిన విషయం తెలిసిందే. దీనికి అందరూ సమష్టి ప్రయత్నం చేసేలా కసరత్తు చేస్తామని ఆయన చెప్పారు.

# కర్ణాటకలో మళ్ళీ తాజా కులగణన

### ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడి





**బెంగళూరు :** పదేళ్ళ క్రితంనాటి కాలం చెల్లిన నివేదకను పక్కనపెట్టిన కర్ణాటక ప్రభుత్వం మళ్ళీ కొత్తగా కులగణన సర్వే చేయాలని నిర్ణయించింది. ఈ 'సోషియో ఎడ్యుకేషనల్ సర్వే' జనం మధ్య కులగణనగా పేరుపొందింది. పది సంవత్సరాల క్రితం చేసిన ఈ కులగణనలో తమను విస్మరించారంటూ ప్రధానంగా రెండు వర్గాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో మంత్రివర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారంనాడు చెప్పారు. 2015 లో గణాంకాల ఆధారంగా చేసిన సోషియో–ఎడ్యుకేషనల్ సర్వే నివేదిక ఆమోదం నిమిత్తం ఇప్పటికే మంత్రివర్గం ముందుకు వచ్చింది. ఈ తరుణంలో వచ్చిన ఫిర్యాదులు, అధిష్ఠానం ఆదేశాల మేరకు మంత్రివర్గం కొత్త నిర్ణయం తీసుకుంది. ఐతే ఇది ఒక్కలింగాస్‌కు, వీరశైవ లింగాయత్‌లకు సంబంధించిన విషయం కాదనీ, ఇది ఇతర వెనుకబడిన తరగతులకు సంబంధించిన విషయమని ముఖ్యమంత్రి చెప్పారు.

కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ తాజా సర్వే నిర్వహించి 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఐతే ఈ సర్వే చేసేందుకు ఎంత ఖర్చు అవుతుందనే విషయం మాత్రం చెప్పలేదు. ''మంత్రివర్గంలో ఈ మేరకు మేం ఒక నిర్ణయం తీసుకున్నాం, తాజాగా కొత్త సర్వే చేసేందుకు మూడు నెలలు గడువు విధించాం, వారు నివేదిక ఇస్తారు'' అని చెప్పారు. ఇటీవల సిద్ధరామయ్య స్టేడియంలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఢిల్లీలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీలను కలిసి వచ్చారు. తర్వాత మంగళవారంనాడు ఈ ఇద్దరు పార్టీ అగ్రనాయకుల ఆదేశం మేరకు మంత్రివర్గం తీర్మానం చేసింది. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చట్టం సెక్షన్ 11(1) ప్రకారం ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా సెక్షన్ 11(2) ప్రకారం కమిషన్‌ను సంప్రదించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2015 నాటి కులగణన నివేదిక మొదట ఈ ఏడాది ఏప్రిల్ 11వ తేదీన మంత్రివర్గం ముందుకు వచ్చింది. ఇక అప్పటినుండీ మూడు,నాలుగుసార్లు మంత్రివర్గం సమావేశాలు జరిపి ఈ నివేదికపై చర్చించింది. ఈ కులగణన నివేదికపై వివిధ వర్గాలు ప్రధానంగా కర్ణాటకలో ఉన్న వొక్కలింగాస్, వీరశైవలింగాయత్‌లు 2015లో చేసిన కులగణనను అశాస్త్రీయమైనదిగా పేర్కొంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని తిరస్కరించాలని ఈ రెండు ప్రధాన వర్గాలు డిమాండ్ చేశాయి. అదేవిధంగా అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ పాత నివేదికపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ''ఐతే పాత నివేదికను తిరస్కరించారా?'' అని ప్రశ్నించగా, ఆ నివేదిక రూపొందించి పదేళ్ళు గడచిపోయిందని, చట్టం చెప్పిన ప్రకారం కొత్తగా సర్వే చేయాల్సి ఉంటుందని సిద్ధరామయ్య అన్నారు. అంటే ప్రభుత్వానికి చట్టం గురించి తెలియదా? లేక కేంద్ర అధిష్ఠానం ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నారా? అని పాత్రికేయులు ప్రశ్నించారు. దీనిపై ఆయన సమాధానం చెబుతూ, ''మేం ఈ చట్టాన్ని పరిశీలించాం, ఈ విషయాలన్ని మంత్రివర్గంలో పలుసార్లు చర్చకు వచ్చాయి, ఈ మధ్యలో పార్టీ అధిష్ఠానం కూడా ఒక సలహా మా ప్రభుత్వానికి ఇచ్చింది'' అన్నారు. రాబోయే జనాభా గణాంకాలలో కులగణనను కూడా కలిపి నిర్వహించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయంచిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చినప్పుడు, తాము చేసే సర్వే కేంద్ర ప్రభుత్వం చేసే సర్వేకు చాలా భిన్నమైనదన్నారు. అంటే పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు ప్రభుత్వం తలవొగ్గిందా? అని పాత్రికేయులు ప్రశ్నించారు. ''మేం తలొగ్గలేదు, కేంద్ర అధిష్ఠానం చేసిన ఎలాంటి ఒత్తిడికీ మేం తలొగ్గలేదు, ప్రభుత్వం చట్టం చెప్పినట్లుగా వ్యవహరిస్తుంది'' అని సిద్ధరామయ్య సమాధానం చెప్పారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన నుండి ప్రజల దృష్టి మళ్ళించడంకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే విషయాన్ని తెరమీదకు తీసుకువచ్చిందని బిజెపి చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి తిరస్కరించారు.

# తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే
### రవీంద్రనాథ్‌ఠాకూర్ పూర్వీకుల నివాసం ధ్వంసం, 'యుఎస్' పాక్ ఆర్మీ చీఫ్‌కు ఆహ్వానంపై చర్చ డిమాండ్






**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో రవీంద్రనాథ్ ఠాకూర్ పూర్వీకుల నివాసం విధ్వంసం, అమెరికా సైన్యం 250వ వార్షికోత్సవానికి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌కు ఆహ్వానం అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో చర్చించేందుకు వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గురువారం తన 'ఎక్స్'లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల నివాసం విధ్వంసాన్ని ఆయన ఖండించారు. 'ఈ రెండు సంఘటనలు అంతర్జాతీయ స్థాయిలో తీవ్రస్థాయిలో విచారించదగినవి. అమెరికా సెంట్‌కామ్ కమాండర్ తన అద్భుతమైన కౌంటర్ టెర్రరిజం భాగస్వామియైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను అమెరికా ఆర్మీ 250వ వార్షికోత్సవానికి ఆహ్వానించడం బాధాకరం' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.బంగ్లాదేశ్‌లోని సిరాజ్‌గంజ్‌లో బంగ్లాదేశ్ జాతీయగీతం 'అమర్ సోనార్ బంగ్లా' రచయిత గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల నివాసంపై విధ్వంసాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది ఖర్గే 'ఎక్స్' పోస్టింగ్ లో ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ విధానానికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలు కూడా చర్చించడానికి ఉన్నాయన్నారు. మేము ఎప్పటినుంచో అన్ని రాజకీయ పార్టీల సమావేశాన్ని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తూనే ఉన్నా ఖాతరు చేయడం లేదన్నారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి సమక్షంలో ఒక సమావేశాన్ని నిర్వహించాలని, ప్రతిపక్షాలతో చర్చించి, ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. జాతీయ ప్రయోజనాల కోసం ఈ సమావేశం నిర్వహించాలని అనేకసార్లు ఇప్పటికే విజ్ఞప్తి చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ 'పిటిఐ' తో మాట్లాడుతూ అమెరికా ఇటీవలి ప్రకటనలు ఒక సవాల్, ఒక హెచ్చరికగా ఉన్నాయని, వీటి గురించి లోతుగా చర్చించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విభజన రాజకీయాలను ప్రోత్సహించేందుకే ఆసక్తి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. అమెరికా పాకిస్థాన్‌కు క్లీన్ చిట్ ఇస్తున్నదని ఆరోపించారు. తాజాగా అమెరికా ఆర్మీ జనరల్ మైఖేల్ కురిల్లా, కమాండర్ ఆఫ్ యుఎస్ సెంట్రల్ కమాండ్ (సిఇఎన్‌టిసిఒఎం) మాట్లాడుతూ కౌంటర్ టెర్రరిజంలో పాకిస్థాన్ చురుకుగా వ్యవహరిస్తున్నదని ప్రశంసిస్తూ ప్రస్తుతం పాకిస్థాన్ ప్రపంచానికి అద్భుత కౌంటర్ టెర్రరిజం భాగస్వామి అని కితాబు ఇచ్చిన విషయాన్ని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు.

# ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి చేరిన కొనుగోలు ధరల ద్రవ్యోల్బణం

### దేశంలో తెలంగాణలోనే అతి తక్కువ




**న్యూఢిల్లీ :** దేశంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత కొనుగోలు ధరల ద్రవ్యోల్బణం ఆరేళ్ళ కనిష్ఠస్థాయికి క్షీణించింది. రాష్ట్రాల వారీగా చూసినప్పుడు దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అతి తక్కువగా 0.55 శాతమ మేరకు ద్రవ్యోల్బణం నమోదైనట్లు ప్రభుత్వ డేటా తెలియజేసింది. ఈ ద్రవ్యోల్బణం మే నెలలో 2.82 శాతంగా నమోదు కావడంతో మంట తగ్గి ఆహార ధరలు చల్లబడినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా తెలియజేసింది. గురువారంనాడు ప్రభుత్వం ఈ గణాంకాలను విడుదల చేసింది. ఏప్రిల్ నెలలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత కొనుగోలు ద్రవ్యోల్బణం 2024 అతి తక్కువగా 3.16 శాతం, మే నెలలో 4.8 శాతాలుగా నమోదయ్యాయి. 2019లో కూడా అతి తక్కువగా 2.57 శాతంగా సిపిఐ నమోదైంది. ఆరేళ్ళ తర్వాత ఇప్పుడు మళ్ళీ చల్లబడి ఈ ధరల సూచీ 2.82 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో రిజర్వు బ్యాంకు గతవారంలో 50 బేస్ పాయింట్లను తగ్గించింది. దీంతో గడచిన ఫిబ్రవరి నుండి ఇప్పటివరకూ 100 బేస్ పాయింట్లను తగ్గించినట్లయింది.ఏడాది క్రితం మే నెలలో ఆహార ద్రవ్యోల్బణ భారీస్థాయిలో 8.69 శాతంగా నమోదు కాగా, ఈ ఏడాది మే నెలలో ఇదే ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా 0.99 శాతానికి తగ్గిపోయిందని ఎన్ఎస్ఓ పేర్కొంది.

''మొత్తం ఆర్థిక వ్యవస్థలో ధరల కదలికలు, ఆహార ద్రవ్యోల్బణం 2025 మే నెలలో గణనీయంగా క్షీణించడానికి ప్రధాన కారణం పప్పులు, ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, వాటి ఉత్పత్తులు, గృహోపకరణాలు, సేవలు, చక్కెర, తీపి వస్తువులు, చాక్లెట్లు, గ్రుడ్లు, ధరలు తగ్గడమేనని ఎన్ఎస్ఓ తన ప్రకటనలో తెలిపింది. గ్రామీణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం మే నెలలో 2.59 శాతం మేరకు ఉండగా, పట్టణభారత ప్రాంతాలలో ద్రవ్యోల్బణం 3.07 శాతంగా నమోదైంది. కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలలో ద్రవ్యోల్బణాన్ని పరిశీలిస్తే, కేరళలో 6.46 శాతం, పంజాబ్‌లో 5.21 శాతం, జమ్మూ కశ్మీరులో 4.55 శాతం, హర్యానాలో 3.67 శాతం, ఉత్తరాఖండ్‌లో 3.47 శాతంగా నమోదైంది. తెలంగాణలో అతి తక్కువగా 0.55 శాతం మేరకు ద్రవ్యోల్బణం నమోదైంది. నాలుగుశాతం కంటే అతి తక్కువస్థాయికి భరించగలిగేరీతిలో ద్రవ్యోల్బణం ఉండాలని రిజర్వు బ్యాంకుకు కేంద్ర ప్రభుత్వం ఒక లక్ష్యనిర్దేశం చేసింది. దీంతో రిజర్వుబ్యాంకు పూర్తిగా తన సర్వశక్తులనూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంపైనే కేంద్రీకరించింది. రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ తీసుకున్న నిర్ణయాలవల్లే ఈ ఈ స్థాయికి వచ్చిందని ఐక్రా చీఫ్ ఎకనామిస్ట్ ఆదిత్య నాయర్ అన్నారు.




### భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నాం, కానీ..

# ఇండియన్ ప్రెస్ నకిలీ వార్తలతోనే సమస్య : యూనుస్

### హసీనాను కట్టడి చేయమని మోదీని అడిగా... కుదరదన్నారు



**లండన్ :** భారతదేశంతో బంగ్లాదేశ్ సత్సంబంధాలను కోరుకుంటున్నదనీ, కానీ భారత పత్రికావ్యవస్థ, మీడియా వెదజల్లే నకిలీ వార్తల ప్రచారంతో ఆటంకాలు ఏర్పడుతున్నాయని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. ''చాలామంది చెబుతున్నది ఏమిటంటే భారతదేశంలో అత్యున్నతస్థాయి విధాన నిర్ణేతలకు దీనికి ఏదో సంబంధం ఉందని చెబుతున్నారన్నారు. దీనివల్ల బంగ్లాదేశ్ చాలా భయపడుతోందని, అధైర్యపడుతోందన్నారు. బ్రిటన్‌లో నాలుగు రోజుల పర్యటన చేస్తున్న యూనుస్ మూడోరోజు గురువారం లండన్ ఛాతమ్ హౌస్ బుద్ధిజీవుల సంచాలకుడు బ్రౌన్‌వెన్ మాడ్డోక్స్‌తో అనేక విషయాలు చర్చించారు. భారత్‌తో ద్వైపాక్షిక అంశాలతోపాటు ఇరుగుపొరుగు సంబంధాల గురించి యూనుస్ మాట్లాడారు. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యం కోసం ఒక బృహత్తర ప్రణాళికను వచ్చేనెల 'జులై ఛార్టర్' ప్రారంభించడం గురించి ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా భారత్‌లో తలదాచుకున్న విషయం, ఆమెను బంగ్లాదేశ్‌కు తిప్పిపంపాలని తాత్కాలిక ప్రభుత్వం చేసిన డిమాండ్ గురించి మడ్డోక్స్ ప్రస్తావించినప్పుడు, చాలా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. భారతదేశంలో తమకు ఎలాంటి మౌలిక సమస్యలూ లేవన్నారు. దేశంలో ఆగ్రహం పెల్లుబుకుతోంది, ఈ ఆగ్రహం నుండి దేశాన్ని బయటపడేసేందుకు తాము ఎంతో ప్రయత్నం చేస్తు న్నాం, సైబర్ చర్యల కారణంగానే ఇదంతా జరుగుతోంది, దీనినుండి మేం వెనక్కు వెళ్ళలేం, వారు ఆకస్మికంగా ఏదోఒకటి చెబుతారు, ఆచరణలో ఇంకేదో చేస్తారు, దాంతో తిరిగి ఆగ్రహం పెల్లుబుకుతుంది'' అని యూనుస్ భారత్‌ను తీవ్రంగా తప్పుపట్టారు. ఇది మాకు ఒక పెద్ద సవాలు, ఈ లక్ష్యాన్ని మేం ఛేదించాలి, ప్రజలకు శాంతియుత జీవనాన్ని అందించాలన్నారు. హసీనా విషయంలో భారతదేశం పాత్ర స్పష్టంగా లేదన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో తీవ్రఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి, ఇప్పుడు ఆమె భారత్‌కు వెళ్ళారు, అందువల్ల ఆమెపై ఉన్న ఆగ్రహం అంతా కూడా ఇప్పుడు భారత్‌పైకి మళ్ళింది'' అన్నారు. ''ప్రధానమంత్రి మోదీతో ఇటీవల నాకు మాట్లాడే అవకాశం వచ్చింది, మీకు షేక్ హహసీనాకు ఆతిథ్యం ఇచ్చారు, అది మీ విధానం,ఆ విధానాన్ని మార్చుకోమని నేను మిమ్మల్ని అడగడంలేదు, కానీ ఆమె మీ దేశంలో కూర్చుని బంగ్లాదేశ్ ప్రజలపై విమర్శలు చేయకుండా కట్టడి చేయండి, ఆమె ఆన్‌లైన్‌లో బంగ్లాదేశ్ ప్రజలపై విమర్శలు గుప్పిస్తున్నారు,దీంతో యావత్ బంగ్లాదేశ్ ఆగ్రహంతో ఊగిపోతోంది అని మోదీకి చెప్పాను, కానీ మోదీ మాత్రం, ''హసీనా సోషల్ మీడియా కార్యకలాపాలను మేం కట్టడి చేయలేం'' అని చెప్పేశారు. కానీ ఆ విధంగా చెప్పినంతమాత్రాన సరిపోదు, బంగ్లాదేశ్‌లో ప్రజలు అట్టుడికిపోతున్నారు, మీరు ఏదో ఒక మాట చెప్పేసి వెళ్ళిపోతే కుదరదని యూనుస్ అన్నారు. షేక్ హసీనా ప్రధానమంత్రి పదవి నుండి వైదొలగిన తర్వాత భారత్–బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రివర్గంలో బంజారాలకు చోటు కల్పించాలని బంజారా గిరిజన జెఎసి నాయకులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గురువారం జరిగిన బంజారా, గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రాజేష్ నాయక్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ బంజారా సమాజం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నదన్నారు. బంజారా సమాజం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఏ ఎంఎల్‌ఎకైనా మంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై త్వరలో సిఎం రేవంత్ రెడ్డిని, ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బంజారా గిరిజన సంఘాలు కలిసి పార్టీలకు అతీతంగా గిరిజనుల హక్కుల సాధనకు 'బంజారాల ఆత్మగౌరవ సభ' నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జెఎసి నేతలు మూడావత్ కార్తీక్ నాయక్, శ్రీమన్ నాయక్, జె.డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన యుపి స్పీకర్ సతీష్ మహానా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సతీష్ మహానా గురువారం తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సతీష్ మహానా దంపతులు బంజారాహిల్స్, మంత్రుల నివాసంలోని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ అధికార నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఉత్తరప్రదేశ్ శాసనసభల నిర్వాహణపై ఇరువురు స్పీకర్లు చర్చించుకున్నారు. తన నివాసానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులను స్పీకర్ ప్రసాద్ కుమార్ శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.

## గల్లీలో గలీజ్ దందాలు.. ఢిల్లీలో గులాంగిరి

సిఎం రేవంత్ రెడ్డిపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాంగిరి చేస్తున్నట్లుగా సిఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్‌మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్‌మెంట్ దొరకని ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడన్నారు. కెసిఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవమన్నారు. రేవంత్‌రెడ్డి, బిజెపి ఒక్కటి అన్నది వాస్తవమన్నారు. రేవంత్ రెడ్డి , బిజెపి దోస్తాన్ చాలా సార్లు బయట పడిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బిజెపి ఎంపిలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయపడ్డారని ఆరోపించారు. 8 మంది బిజెపి ఎంపిలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారన్నారు. బిజెపి పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడంలేదన్నారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తుందని మాట్లాడిన ఈడి, సిబిఐ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు రేవంత్ రెడ్డిని నమ్మకండని, కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బిజెపిలోకి రేవంత్ రెడ్డి పోతారని ప్రశాంత్ రెడ్డి అన్నారు. బిజెపి, కాంగ్రెస్ కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బిజెపి ఎంపిలు ఉండి తెలంగాణకు ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు.

## మూడు దౌత్యపరమైన ఎదురుదెబ్బలు

అమెరికా నుండి భారత్‌కు

దేశ రాజకీయాలకోసమే విదేశాంగవిధానం

జైరామ్ రమేశ్ విమర్శ

**న్యూఢిల్లీ :** అమెరికావల్ల భారతదేశం దౌత్యపరంగా మూడు ఎదురుదెబ్బలు తిందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. దేశంలో రాజకీయాలకోసం మోదీ ప్రభుత్వం విదేశాంగ విధానాన్ని అందుకు అనుగుణంగా నడిపిస్తోందని విమర్శించింది. భారత్–పాకిస్థాన్ కాల్పుల విరమణ వ్యవహారాన్ని అమెరికా ప్రభుత్వం తరచు పెద్దదిగా చేసి చూపించి తన గొప్పలు చాటి చెప్పుకుంటున్నదనీ, విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని, దేశీయ రాజకీయాలను పరిగణనలోకి తీసుకుని విదేశాంగ విధానన్ని మోదీ నడిపిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ ఘాటుగా విమర్శించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. అమెరికా ఇటీవల చేసిన ప్రకటనలు భారత్‌కు పెద్ద సవాలుగా, ఒక హెచ్చరికగా మారాయన్నారు. దేశంలో విభజన రాజకీయ క్రీడలపైన మాత్రమే ప్రధానమంత్రి ఆసక్తి చూపిస్తున్న తరుణంలో అమెరికా ఇటీవలి సవాలు, హెచ్చరికలపై తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అందువల్ల నరేంద్రమోదీ తక్షణం తన మొండి పట్టుదల పక్కనపెట్టి అఖిలపక్ష సమావేశాన్ని, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. ''నిన్న అంటే బుధవారంనాడు భారతదేశ విదేశాంగ విధానం, దౌత్యం మూడు ఎదురుదెబ్బలను చవిచూసింది, తిరస్కరించడానికి సాధ్యంకానంతగా ఈ ఎదురుదెబ్బలు తగిలాయి, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో పాకిస్థాన్ ఒక అసాధారణమైన భాగస్వామి అని అమెరికా సెంట్రల్ కమాండ్ జనరల్ ఒక ప్రకటన చేశారు. అసాధారణ భాగస్వామి అంటే ఏమిటి? 2011 మే రెండో తేదీన ఒసామా బిన్‌లాడెన్ పాకిస్థాన్‌లోని అబ్బొట్టాబాద్‌లో దొరికాడు, అతడిని ఆనాడు అమెరికా సైన్యం కాల్చి చంపింది'' అని గుర్తుచేశారు. ఆ విధంగా పాకిస్థాన్‌కు అమెరికా సెంట్రల్ కమాండ్ జనరల్ క్లీన్ చిట్ ఇచ్చారు. అమెరికా జనరల్ మైఖేల్ కురిల్లా గడచిన మంగళవారంనాడు అమెరికా సాయుధ సేవల సభా కమిటీ ఎదుట సాక్ష్యం ఇస్తూ పాకిస్థాన్‌కు క్లీన్ చిట్ ఇచ్చారు.



## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి

మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి**

విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థాయికి వచ్చామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు పునర్ వైభవం తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. వేసవి సెలవుల ఆనంతరం స్కూళ్ల పునఃప్రారంభం సందర్భంగా గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కెజిబివి పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. విద్యార్థులతో కలసి అల్పాహారం చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకోసం అన్ని పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం,నాణ్యమైన ఆహారం అందిస్తుందన్నారు.

## చార్టెడ్ అకౌంటెంట్లు
# నైతికతకు కట్టుబడి ఉండాలి

హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన సిఏ విద్యార్థుల జాతీయ సదస్సులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చార్టెడ్ అకౌంట్‌టెంట్లు నైతికతకు కట్టుబడి ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా(ఐసిఎఐ),హైదరాబాద్ శాఖల ఆధ్వర్యంలో శిల్పకళావేదికలో ఏర్పాటుచేసిన సిఏ విద్యార్థుల జాతీయస్థాయి సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మన దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్డుతోపాటు అనేక పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణ మారనుందని తెలిపారు. అంతేకాకుండా ఐటీ, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్స్ టైల్ పార్క్ వంటి వాటితో అభివృద్ధిలో ప్రపంచ పటంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని భట్టి వివరించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ దేశవ్యాప్తంగా బయటికి వస్తున్న సిఏ విద్యార్థులకు సైతం వేదికగా నిలుస్తుందన్నారు. నూతనంగా సిఏ కోర్స్ పూర్తి చేసుకుని వస్తున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భట్టి విక్రమార్క భరోసా కల్పించ్చారు. భారతదేశ ఆర్థిక, ధన, వినియోగం నైతికతకు మూల స్తంభంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా (ఐసిఎఐ) నిలుస్తుందని తెలిపారు.

ఈక్రమంలో చార్టెడ్ అకౌంట్ టెంట్లు నైతికతకు కట్టుబడి ఉండాలని, టెక్నాలజీ ఆటోమేషన్ శరవేగంగా పెరుగుతున్న ప్రస్తుత యుగంలో మీ నిజాయితీయే మీకు అత్యంత విలువైన ఆస్తి, మీ పని ఎల్లప్పుడూ నిజాయితీ, సమన్యాయం బాధ్యతను ప్రతిబింబించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆకాంక్ష వ్యక్తం చేశారు. 1949లో పార్లమెంటు చట్టంతో స్థాపించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియన్‌ను తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక క్రమశిక్షణ, వృత్తిపరమైన విలువలు,ప్రజల నమ్మకానికి ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందన్నారు. దేశ వ్యాప్తంగా 4.26 లక్షలకు పైగా సభ్యులు, దాదాపు పది లక్షల మంది విద్యార్థులతో మీరు ఒక బలమైన ఆర్థిక శక్తిగా మారారని డిప్యూటీ సిఎం భట్టి ఈ సందర్భంగా అభివర్ణించారు. ఇందులో హైదరాబాద్ బ్రాంచ్ పాత్ర మరింత విశిష్టమైనదని, 14,500 మందికి పైగా సభ్యులు, 31,000 మందికిపైగా విద్యార్థులతో ఇది ఐసిఎఐకి విలువైన ఆభరణంగా నిలిచింది, మీరు కేవలం అంకెలు, సంఖ్యలు కాదు ఒక శక్తి, ఒక ఆశయం, ఒక ప్రతిభకు ప్రతీక అన్నారు. మీ విజయం కేవలం మీకు మాత్రమే చెందదు. అది భారతదేశ పురోగతికి చేయూతనిస్తుందని, గొప్ప వృత్తి గౌరవాన్ని ఎప్పటికీ నిలబెట్టాలని తాను కోరుకుంటున్నట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సూచించారు.

## విమాన ప్రమాదంపై ప్రముఖుల దిగ్భ్రాంతి, మృతులకు సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమానాప్రమాదంపై తెలంగాణకు చెందిన ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. మృతులకు ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ముఖ్యంగా ఈ విమానం మెడికల్ కాలేజ్ హాస్టల్‌పై కూలిపోవడంతో విద్యార్థుల ప్రాణాలు పోవడం మరింత తీవ్ర విషాదంగా మారిందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆయన సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబాలకు మనోధైర్యం లభించాలని వారన్నారు. గుజరాత్‌లో అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే ప్రయాణంలో ఉన్న విమానం జనావాసాలపై కుప్పకూలిన విషాద ఘటనపై టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ హృదయదోళకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ హృదయపూర్వక సంతాపం తెలియజేశారు. ఈ ప్రమాదంపై పట్ల బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నివాసాల మీద విమానం కూలడంతో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రయాణికులు, సామాన్యులు, సహా, వైద్య విద్యార్థులు మరణించడం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ, సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన కుటుంబాలను ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కెసిఆర్ కోరారు. పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరగడం పట్ల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. జరిగిన ఘోర విమాన ప్రమాదంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం జనావాసాలపై కుప్పకూలిన ఘటన తన హృదయాన్ని కలిచివేసిందన్నారు.

## నాణ్యతలో రాజీ పడకుండా.. సకాలంలో పనులు పూర్తిచేయాలి

ఇంజనీర్ ఇన్ చీఫ్ భాస్కర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాణ్యతలో రాజీ పడకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీర్ ఇన్ చీఫ్, జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. చార్మినార్ జోన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ తనిఖీలో శాస్త్రిపురం ఆర్ఒబి, ఫలక్‌నుమా ఆర్ఒబి, నల్లగొండ క్రాస్‌రోడ్స్ నుండి ఒవైసి ఫ్లైఓవర్, అజీమ్ హోటల్ రోడ్డు, గుర్రం చెరువు డ్రెయిన్ పనులను పరిశీలించారు. ప్రగతి గుర్తించబడినప్పటికీ, కొన్ని ప్రదేశాలలో స్థల పరిమితులు, సామగ్రి సరఫరా సమస్యలు, సమన్వయ సవాళ్ల కారణంగా పనులలో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. పర్యవేక్షణను నిశితంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## దారుణస్థితిలో విద్యావ్యవస్థ

బిఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో విద్యా వ్యవస్థ దారుణస్థితిలో ఉందని బిఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ కుదేలైందన్నారు. బీహార్ రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై ప్రధాని మోదీకి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లేఖ రాశారని, రాహుల్ గాంధీ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయాలన్నారు. బీహార్ కన్నా ఘోరమైన సమస్యలు తెలంగాణ విద్యా వ్యవస్థలో ఉన్నాయన్నారు. కెసిఆర్ హయాంలో విద్యా వ్యవస్థ వెలుగు వెలిగిందన్నారు. కెసిఆర్ సిఎం అయ్యాక 660 గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. కామన్‌సెన్స్ లేని అధికారులు విద్యాశాఖలో ఉన్నారన్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను గురుకులాల్లోకి రానివ్వడంలేదన్నారు. సర్దుబాటు పేరుతో ప్రభుత్వ స్కూళ్లను మూసేస్తున్నారని తెలిపారు. నాయిని రాజేందర్ రెడ్డి, బల్మూరి వెంకట్ బలుపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మిమ్మల్ని తెలంగాణ ప్రజలు తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు.

## స్త్రీ–పురుష సమానత్వ సూచీలో
# 131వ ర్యాంకుకు దిగజారిన భారత్

దక్షిణాసియాలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన బంగ్లాదేశ్

అందరికంటే అట్టడుగున నిలబడిన పాకిస్థాన్

వరల్డ్ ఎకనామిక్ ఫోరం–2025 నివేదిక

**న్యూఢిల్లీ :** స్త్రీ–పురుష సమానత్వ సూచీ నివేదికలో భారతదేశం 148 దేశాల జాబితాలో 131వ స్థానానికి దిగజారింది. గత ఏడాది 146 దేశాలతో రూపొందించిన నివేదికలో భారత్ 129 స్థానంలో ఉంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం గురువారంనాడు ఈ నివేదిక విడుదల చేసింది. దేశీయంగా ఎదుగుదల ఉన్నప్పటికీ ఇతర దేశాలతో పోల్చిచూసినప్పుడు వెనుకబడింది. కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత వార్షిక పురోగతిని చూసినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ–పురుష సమానత్వం 68.8 శాతం సమీపానికి చేరిందని నివేదిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికశక్తిలో స్త్రీలు 41.2 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, నాయకత్వ స్థానాల్లో 28.8 శాతం మేరకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని నివేదిక తెలిపింది.

రాజకీయ సాధికారతలో స్త్రీల భాగస్వామ్యం గత ఏడాదిలో 14.7 శాతం ఉండగా ఈ ఏడాది 13.8 శాతానికి స్వల్పంగా తగ్గింది. మంత్రివర్గస్థాయిలో స్త్రీలపాత్రలు కూడా 6.5 శాతం నుండి 5.6 శాతానికి క్షీణించింది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్ ఈ ఏడాది ఆర్థికంగా, రాజకీయ సాధికారత విషయంలోనూ ఉత్తమ పనితీరు ప్రదర్శించింది. 75 ర్యాంకులు ముందుకు దూసుకుపోయి 24వ స్థానంలో నిలబడింది. నేపాల్ 125 ర్యాంకు, శ్రీలంక 130వ ర్యాంకు, భూటాన్ 119వ ర్యాంకు, మాల్దీవులు 138వ ర్యాంకులలో ఉండగా పాకిస్థాన్ మాత్రం అందరికంటే ఆఖరున 148వ ర్యాంకులో నిలబడింది. దక్షిణాసియా ఈ ఏడాదిలో 64.6 శాతం స్కోరుతో ప్రపంచ స్త్రీ–పురుష సమానత్వ సూచీలో ఏడవస్థానం సాధించింది. దక్షిణాసియాలోని ఏడు దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఒక్క బంగ్లాదేశ్ మాత్రమే 24 శాతం, 77.5 శాతం స్కోరుతో మొదటి 50 దేశాల జాబితాలో నిలబడిందని నివేదిక పేర్కొంది. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాల విషయంలో దక్షిణాసియా రీజియన్ 40.6 శాతం స్కోరు సంపాదించింది. ఆదాయాలు పొందే విషయంలో మైనస్ 7.8 పర్సంటేజీ పాయింట్లతో దిగజారింది. విద్యారంగంలో దక్షిణాసియా 95.4 శాతం స్కోరుతో ఆరో ర్యాంకులో నిలిచింది. ఆరోగ్యం, జీవితకాలం విషయంలో దక్షిణాసియా 95.5 శాతం స్కోరు సంపాదించింది. పార్లమెంటరీస్థాయిలో భూటాన్, మాల్దీవులు మాత్రమే స్త్రీ–పురుష సమాన భాగస్వామ్యంతో ఐదుశాతం స్కోరు సంపాదించాయి.

భారతదేశ ఆర్థికవ్యవస్థను మొత్తంగా చూసినప్పుడు ప్లస్ 0.3 పాయింట్లకు వెళ్ళి మెరుదల సాధించినప్పటికీ దక్షిణాసియాలో కేవలం 64.1 శాతం స్కోరుతో అతితక్కువస్థాయి ర్యాంకులు పొందే దేశాలమధ్యకు చేరింది. 2025 సంవత్సరానికిగాను ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన ఈ స్త్రీ–పురుష సమానత్వ నివేదికలో, కార్మిక రంగానికి సంబంధించి మాత్రం స్త్రీ–పురుషుల భాగస్వామ్యం గత ఏడాదిలాగానే ఇప్పుడు కూడా 45.9 శాతంగానే కొనసాగింది. విద్యాసముపార్జన సమానత్వ విషయంలో భారతదేశం 97.1 శాతం స్కోరు సంపాదించింది. విద్యాసముపార్జనలో స్త్రీల భాగస్వామ్యం సానుకూలగా ఉంది. అక్షరాస్యతలో స్త్రీల వాటా, ప్రాదేశికంగా విద్యాలయాల్లో నమోదు కూడా మొత్తంగా చూసినప్పుడు గణనీయంగా మెరుగుపడింది. ఆరోగ్యరంగంలో, జీవిత కాలం విషయంలో కూడా సమానత్వం అత్యధికంగా నమోదైంది. జననాలు, స్త్రీ, పురుషుల పుట్టుక నిష్పత్తి, ఆరోగ్యకరమైన జీవనం విషయంలో కూడా మిగతా దేశాలతో పోల్చినప్పుడు భారతదేశం తన స్కోరు పెంచుకుంది. ఐతే ఈ రంగాలకు సంబంధించి భారత్ ఎదుగుదలను ఇతర దేశాలతో పోల్చిచూస్తే తరుగుదల కనిపించింది. స్త్రీ–పురుషుల జీవితకాలం తగ్గింది.

''భారతదేశం స్త్రీ–పురుష సమానత్వ సూచీలో 64.4 శాతం స్కోరుతో 131వ స్థానానికి దిగజారింది, 2024 నివేదిక ప్రకారం చూస్తే, భారత్‌లో స్త్రీ–పురుష సమానత్వ పనితీరు ఇతర ఆర్థిక వ్యవస్థల కంటే గణనీయంగా తగ్గింది'' అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం–2025 నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక రూపొందించేటప్పుడు నాలుగు అంశాలను ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంది. స్త్రీ–పురుషుల ఆర్థికరంగ భాగస్వామ్యం, అవకాశాలు, విద్యాపరమైన ఎదుగుదల, ఆరోగ్యం, జీవన ఉనికి, రాజకీయ సాధికారత అనే అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఈ ఈ నివేదిక రూపొందించారు.

''భిన్న రూపాలలో చూసినప్పుడు భారతదేశం ఆర్థికరంగ భాగస్వామ్యం, అవకాశాలపరంగా స్త్రీ–పురుషులమధ్య సమానత్వం గతంకంటే పెరిగింది. ప్లస్0.9 పర్సంటేజీ పాయింట్ల ద్వారా 40.7 శాతానికి తన స్కోరును మెరుగుపరచుకుంది. ఐతే చాలా విభాగాలలో సూచీలలో మార్పులు లేవు. సంపాదనపరంగా చూసినప్పుడు అంచనా ఆదాయాలు 28.6 శాతం నుండి 29.9 శాతానికి పెరిగాయని నివేదిక పేర్కొంది.

## ప్రముఖ హీరో నానీతో ఏఐ ఆధారిత..
# 'ఆశీర్వాద్ మసాలా' టెక్ క్యాంపైన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో ఐటిసి ఆశీర్వాద్ మసాలాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నేచురల్ స్టార్ నాని ఎంపికైనట్లు ఐటిసి లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పీయూష్ మిశ్రా వెల్లడించారు. బ్రాండ్ ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ, సినిమాటిక్ మాయాజాలం, వినియోగదారులు పాల్గొనడాన్ని ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఒక చోట చేర్చే ఆకర్షణీయమైన డిజిటల్ అనుభవాన్ని అందిస్తోందన్నారు. ఈ విలక్షణమైన ఏఐ మద్దతు గల అనుభవం, వాట్సాప్ బాట్ ద్వారా నెరవేర్చబడిందని చెప్పారు. తెలుగు సినిమా నేచురల్ స్టార్ నానీతో పాటు తమను తాము ప్రదర్శించుకునే వ్యక్తిగత మూవీ పోస్టర్స్‌ను సృష్టించడం ద్వారా ప్రాచుర్యంలోకి అడుగు పెట్టవాల్సిందిగా వినియోగదారులను ఆహ్వానిస్తోందన్నారు. ఇప్పుడు లైవ్‌లో ఉన్న ఇంటరాక్టివ్ కాంపైన్, రోజువారీ సూపర్ స్టార్, గృహిణిని తమ సొంత బ్లాక్ బస్టర్ క్షణంలో నానీ యొక్క తోటి స్టార్‌గా మార్చడం ద్వారా వారిని సంబరం చేయడానికి రూపొందించబడిందన్నారు. ఈ వినూత్నమైన డిజిటల్ విస్తరణ కాంపైన్, 'దమ్ము మీదే, స్టార్ మీరే'పై ఇతివృత్తం రూపొందించబడిందన్నారు.

బ్రాండ్ ఇప్పుడు తమ వినియోగదారులపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. తమ సొంత వ్యక్తిగత మూవీ పోస్టర్‌లో నానీతో సహ నటుడుగా మారే అవకశాన్ని వారికి ఇస్తోందన్నారు. ఉపయోగించడానికి సులభమైన ఏఐ మద్దతు గల వాట్సాప్ బాట్ ద్వారా, ప్రణయం, హాస్యం, థ్రిల్లర్, యాక్షన్ వంటి ప్రసిద్ధి చెందిన శైలీల ద్వారా అనుగుణమైన మూవీ పోస్టర్‌లను వినియోగదారులు తయారు చేయవచ్చు అని, సినిమా స్టైల్ మాయాజాలాన్ని ప్రతి కుటుంబంలోకి తీసుకురావచ్చు అన్నారు. ఆశీర్వాద్ చిల్లీ పౌడర్ ప్యాక్స్ వెనక ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం, లేదా ఆశీర్వాద్ మసాలా వారి అధికారిక తెలుగు సోషల్ హ్యాండిల్స్‌పై బయోలో లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా బాట్‌లోకి వచ్చిన తరువాత, యూజర్లు తమకు ఇష్టమైన భాషను ఎంచుకోవచ్చు అని చెప్పారు. శైలి, క్యారక్టర్ సెట్టింగ్‌ని తమ పోస్టర్ కోసం ఎంచుకోవచ్చు అన్నారు. సెల్ఫీ భాగస్వామం చేయండి, నేచురల్ స్టార్ నానీతో తమను ప్రదర్శించుకునే వ్యక్తిగత పోస్టర్ తో తమను చూసుకోవచ్చు అని తెలిపారు.

## వ్యాపారాల్లో మహిళలు
# ఆర్థికంగా ఎదగాలి



- పలు పథకాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు వారి పేరుతోనే మంజూరు చేస్తున్నాం
- త్వరితగతిన ఇండ్ల పూర్తికి అధికారులు కృషి
- మంత్రి సీతక్క వెల్లడి
- ఏటూరు నాగారం ఐటిడిఏ గిరిజన భవనంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి**

మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మహిళల పేరునే అన్ని పథకాలను మంజూరు చేస్తున్నదని, నేడు ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళల పేరునే మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం ఐటిడిఏ గిరిజన భవనంలో ఏటూరునాగారం, ఎస్ఎస్ తాడ్వాయి, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లోని నిరుపేదలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్రా, ఏఎస్‌పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి ఇందిరమ్మ గృహల నిర్మాణం కోసం మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను అందజేవారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 5వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడమే కాకుండా సంబంధిత మంత్రి మరో వెయ్యి ఇండ్ల మంజూరుకి అనుమతిచ్చారని, మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆశించారు. గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వం సంవత్సరానికి వెయ్యి ఇండ్లను కూడా మంజూరు చేయలేదని, నేటి ఇందిరమ్మ ప్రభుత్వం సంవత్సరానికి 3500 ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుందని వివరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, రుణాలు పొందుతున్న మహిళలు పలు వ్యాపారాలలో ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల ప్రత్యేకాధికారులు, మండల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ రమేష్‌కి అభినందన




**ప్రజాపక్షం/నర్వః** నర్వ మండలానికి నూతనంగా నియమితులైన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ఐ రమేష్ కి బిజెపి నర్వ మండల అధ్యక్షులు టి.అజిత్ సింహరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతూ శాలువాలతో సన్మానించడం జరిగింది. బిజెపి పదాదికారులు, బిజెపి మండల నాయకులు, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు , శక్తి కేంద్ర ఇంచార్జిలు, యువ మోర్చ నాయకులు, పెద్దకడ్మూర్, రాంపూర్, పాతర్చెడ్, ఉండెకోడ్, సిపురం, లంకాల్, నాగిరెడ్డి పల్లి, యాంకీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే చదవండి



**ప్రజాపక్షం/మద్దూర్ః** బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండల కేంద్రంలో ఎంఈఓ ఆంజనేయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధించబడుతుందని సూచించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంతకుముందు ఎంఈఓ కార్యాలయం నుండి బడిబాట ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ శేఖర్ రెడ్డి, విజయ్, దేవేంద్రప్ప, భీమ్చేన్, నగేష్, శ్రీనివాస్, వెంకట్‌రాములు, ఆనందం, రామకృష్ణ, హన్మంతు, పీడీ కతలప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికుల వయస్సును 14 నుండి 16కు పెంచాలి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** బీసీ ఉమ్మడి జాగృతి సేన మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో బీసీ జాగృతి సేన నాయకుల సమావేశం లో బీసీ జాగృతి సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సినిమా, టెలివిజన్, సోషల్ మీడియాలలోని కొన్ని దృశ్యాల వల్ల బాల బాలికల జీవితా ల పై పెను ప్రభావం పడి, దురాలవాట్లకు దగ్గరూ, విద్యాకు దూరమవుతూ, పసిప్రాయంలోనే, కొందరు బాల బాలికలు, మత్తు పదార్థాలు, మద్యం సేవిస్తూనేరాల వైపు తమ దృష్టిని మళ్లిస్తూ తమ జీవితాలను ఆగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల బాలికల మనసులను ప్రభావితం చేసే చట్ట వ్యతిరేక దృశ్యాలు,ఇంటర్నెట్, టెలివిజన్, సినిమా, సోషల్ మీడియాలలో, ప్రసారం కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఐదు పంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయసుగల బాలబాలికలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని, అప్పుడే సృజనాత్మకత పెరిగి, శాంతియుత భావి భారత నిర్మాతలు అవుతారన్నారు. బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, గోపాల్, లింగం పేట్ శేఖర్, కార్మిక నాయకులు, రామస్వామి, శివ శంకర్, రాము, సురభి రఘు, గోపాల్, నాగేష్ పాల్గొన్నారు.

## 'ఫీజుల నియంత్రణ' అమలు చేయాలి




**ప్రజాపక్షం/ మక్తల్ :** ఫీజు నియంత్రణ చ ట్టాన్ని ప్రైవేటు పాఠశాలలో పకడ్బందీగా అమలు చేయాలని, అనుమతుల్లేని ప్రైవేటు పాఠశాలలను మూసివేయాలని పిడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య డిమాండు చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి వినతిపత్రం ఇచ్చారు. సంధ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుంది. ఇప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించలేదు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పనకు కృషి చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించి అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలను మూసివేయాలని కోరారు. పిడిఎస్‌యు జిల్లా నాయకులు అజయ్, ఆకాష్, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

## పంట మార్పిడితో ప్రయోజనాలెన్నో..



**ప్రజాపక్షం/బిజినేపల్లిః** పంట మార్పిడి తో పలు ప్రయోజనాలు ఉన్నాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈటెల సత్యనారాయణ అన్నారు. గురువారం వనపర్తి జిల్లాల్లో పెద్దమందడి లోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలెం బీఎస్పీ కళాశాల శాస్త్రవేత్తలె నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతన్నలకు పంట మార్పిడి వలన పలు ప్రయోజనాలతో పాటు భూమిలో సారం పెరిగి ముందు అధిక దిగుబడులు సాధించకోవచ్చన్నారు. అందువలన రైతున్నలు ప్రతి సంవత్సరం పంట మార్పిడి పద్ధతిని పాటించాలన్నారు. వ్యవసాయ అధికారులు కృష్ణ వెంటస్వామి మాజీ జెడ్పిటిసి విష్ణు వర్ధన్ రెడ్డి సింగిల్ విండో చైర్మన్ నరేష్ కుమార్ ఆదర్శ రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి అభినందనలు



**ప్రజాపక్షం/మక్తల్ః** తెలంగాణ రాష్ట్ర పశువర్ధక క్రీడలు,, యువజన శాఖల మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి నేడు హైదరాబాదులోని మినిస్టర్స్ క్వాటర్స్ లో ప్రభుత్వం కేటాయించిన ఇంటి నెంబర్ 1 లో గృహప్రవేశం చేయడం జరిగింది. మంత్రి గృహప్రవేశం సందర్భంగా మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి కి పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపిన శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ బండ ప్రకాష్ నాగర్ కర్నూల్ శాసన సభ్యులు రాజేష్ రెడ్డి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీ కృష్ణ అమ్మాపూర్ సంస్థానాధసులు రాంభూపాల్ బికెఆర్ ఫౌండర్ బాలకృష్ణారెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గీతా సెల్ అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్ కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, అశికారులు, మక్తల్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 'జనంసాక్షి' ఎడిటర్‌పై కేసు ఎత్తివేయాలి

### అదనపు డిజిపి మహేష్‌భగవత్‌కు టియుడబ్ల్యుజె వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోగులాంబ గద్వాల జిల్లా, పెద్దధన్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్ప్రభావాలపై వరస కథనాలను ప్రచురించిన జనంసాక్షి పత్రిక ఎడిటర్ ఎం.ఎం.రహమాన్ పై రాజోలీ పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించు కోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రభుత్వాన్ని కోరింది. టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, అదనపు డిజిపి మహేష్ భగవత్, మల్టీజోన్2 ఐజి సత్యనారాయణలను కలిసి గురువారం వినతి పత్రాలు అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, జనంసాక్షి పత్రిక ఎడిటర్ రహమాన్ గద్వాల జిల్లాకు చెందడంతో ఆ ప్రాంతంతో ఆయనకు అనుబంధం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత ఎనిమిది నెలలుగా ఆ ప్రాంత రైతులు చేస్తున్న పోరాటాల్ని జనంసాక్షి పత్రిక వరుస కథనాలు రాసిందని ఆయన తెలిపారు. పెద్దధన్వాడలో రైతులు ఆందోళన చేసిన రోజైన జూన్ 4న, రహమాన్ హైదరాబాద్లోనే ఉన్నాడని, ఆ రోజు ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఓ పరీక్షా కేంద్రంలో హిస్టరీ సబ్జెక్టు పరీక్షను కూడా రాశాడని విరాహత్ పేర్కొంటూ.. హాల్ టిక్కెట్ ను సాక్ష్యంగా చూపించారు. అంతేకాకుండా గతంలో పెద్దధన్వాడలో జరిగిన ప్రత్యక్ష ఆందోళనలో ఏనాడూ రహమాన్ పాల్గొనలేదన్నారు. కేవలం అక్కడి రైతులు చేసిన ఆందోళలను జనంసాక్షి పత్రిక నిత్యం కథనాలను ప్రచురించిందని, దీనిపై అక్కసు పెంచుకున్న ఫ్యాక్టరీ యాజమాన్యం, ఎడిటర్ రహమాన్ను ప్రధాన నిందితుల జాబితాలో చేర్చడం భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టులాంటిదిగా భావిస్తున్నామన్నారు. ఉద్దేశపూర్వకంగా ఫ్యాక్టరీ యాజమాన్యం ఏ2 నిందితుడిగా రహమాన్ను చేర్చడం విచారకరమన్నారు. జనంసాక్షి ఎడిటర్పై నమోదైన 30 సెక్షన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి విచారణ జరపకుండా జనంసాక్షి ఎడిటర్ప అక్రమంగా కేసులు నమోదు చేసిన రాజోలి ఎస్సై జగదీష్ చర్యలు తీసుకోవాలని విరాహత్ అలీ డిమాండ్ చేసారు. పోలీసు ఉన్నతాధికారులను కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాజేశ్వరి, హెచ్.యూ.జె అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్ ఉన్నారు.

## బస్‌పాస్ చార్జీలు తగ్గించాల్సిందే




**ప్రజాపక్షం/అచ్చంపేటః** ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఆర్‌టిసి బస్‌పాసుచార్జీలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అంబేద్కర్‌చౌరస్తావద్ద నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ అచ్చంపేట నియోజకవర్గం సమితికార్యదర్శి పెరుమాళ్లగోపాల్, నియోజకవర్గపు సమితినాయకులు చౌటమల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఎడమచేతితో ఇచ్చి కుడిచేతితో లాక్కుంటుందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పేరుతో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సుప్రయాణం కల్పిస్తున్నామని గొప్పలుచెబుతూ, విద్యార్థులకు , ఇతరులకు బస్‌పాస్‌చార్జీలుపెంచి భారం వేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం పెట్టినప్పుడు తెలంగాణలో 3వేలబస్సులు కొత్తవి తెస్తామని ఇంతవరకు మాటమర్చారన్నారు. చార్జీలను పెంచడంవల్ల పేదప్రజలు, విద్యార్థులకు అదనంగా భారం పడుతుందన్నా రు. సిపిఐ నియోజవర్గపు సమితినాయకులు పరంధాములు, సిపిఐ నాయకులు లక్ష్మణ్‌శివరాజ్, చంద్రయ్య, కృష్ణ, తిరుపతయ్య, రాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

## జడ్చర్లలో భారీ వర్షం

**ప్రజాపక్షం/జడ్చర్లఃజడ్చర్లలో** కురిసిన భారీ వర్షం కారణంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జా మ్ ఏర్పడింది. సమాచార ం అందుకున్న వెంటనే జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వరద నీటిని రహదారికి పక్కకు మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాక, ట్రాఫిక్ నియంత్రణలో స్వయంగా పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నల్లకుంట చెరువుకు నీరు చేరే ప్రధాన కాల్వలను పూడ్చి వేయడంతో పాటు, పట్టణ డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యంగా నిర్వహించిన ఫలితంగా ప్రతి వర్షంలో జడ్చర్లలో ఈ సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. ఇలా ఉండకూడదనే ఉద్దేశ్యంతో తాను ఎమ్మెల్యే అయ్యాక పట్టణంలో వర్షపు నీరు నిలకడ లేకుండా సజావుగా వెళ్లిపోవడానికి అవసరమైన స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మించేందుకు రూ.14 కోట్లుమంజూరుచేయించానని తెలిపారు.టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

## నర్వ ఎస్ఐ రమేష్‌కు సన్మానం




**ప్రజాపక్షం/నర్వః** నర్వ పోలీస్ స్టేషన్ లో నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా రమేష్ బాధ్యతలు స్వీకరించారు. నర్వ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వి.మహేశ్వర్ రెడ్డి నర్వ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ యం.లక్ష్మణ్ వైస్ ఎంపీపీ వినతి శంకర్ మండలపార్టీ నాయకులు. పార్టీ కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

# విపక్షాల జిమ్మిక్కులు నమ్మరు

### ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే యత్నం
### కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్‌కుమార్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిన్నరగా ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్న రేవంత్ సర్కార్‌ను బదనం చేయడానికే విపక్షాలు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్‌కుమార్ విమర్శిస్తున్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది విపక్షాలు ప్రజల మండలాలను చూరగొనడానికి జిమ్మిక్కులు చేస్తున్నారని ఆయన దుయబట్టారు. కాంగ్రెస్ పార్టీని దూషించడానికే బిఆర్ఎస్, బిజెపి కంకణం కట్టుకున్నాయని ఎవరెన్ని కుట్రలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికలు విజయం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్ పరిధిలో వ్యత్యాసాలు ఉన్నాయంటూ తమకు అనుకూలంగా వార్డుల విభజన చేశారని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడం అర్ధరహితం అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాలమూరు దశదిశా మార్చడానికి ప్రయత్నిస్తుంటే విపక్షాలు పనిగట్టుకుని అవాక్కులు చివాకులు పేలుతున్నారని ఆయన విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ పార్టీదేనని విజయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్‌చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి బెనహర్, కాంగ్రెస్ నాయకులు అజ్మత్ అలి, కిషన్ నాయక్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల విభజనలో పొరపాట్లు సరిచేయాలి

### మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిః** మహబూబ్‌నగర్ నగర పాలిక వార్డుల విభజన శాస్త్రీయంగా లేదని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన పొరపాట్లను సరిచేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు డిమాండు చేశారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. శాస్త్రీయంగా మహబూబ్‌నగర్ నగర పాలిక వార్డుల విభజన చేయాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో గెలిచేందుకు అవకాశం ఉన్న విధంగా అధికార పార్టీల నాయకులు కొత్త వార్డుల ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇదే విధంగా వార్డుల విభజన చేస్తే భవిష్యత్తులో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని అన్నారు. పెద్ద గ్రామ పంచాయితీలు, వార్డులా పేరు కనుమరుగయ్యే విధంగా విభజన చేసారని పేర్కొన్నారు. స్థానిక ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా కొత్త వార్డుల ఏర్పాటు ఉందని తెలిపారు. అధికారులు సరి చేయకుంటే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలకు వాస్తవాలు వివరించి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షులు శివరాజ్ మాట్లాడుతూ గతంలోవార్డులవిభజనసమయంలో అందరూ ఒప్పుకున్న తరువాత ఆమోదం తెలిపినట్టు చెప్పారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్ని పక్షాల సలహాలు తీసుకున్న తరువాతే ముందుకు వెళ్లాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక దగ్గర కూర్చోని వార్డుల విభజన చేయడం కాదని, అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించాలని, సీనియర్ వార్డు మెంబర్లతో సమావేశం పెట్టి వారినుంచిఅభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. ఇదే రీతిగా అధికారపార్టీ తీరు ఉంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం ప్రజలు చెప్తారన్నారు. కొన్ని వార్డులో ఎక్కువ ఓట్లు ఉన్నాయో, కొన్ని వార్డులో ఎక్కువ ఉన్నాయన్నారు.చేస్తున్న పొరపాట్లను ఎత్తి చూపితే ప్రతిపక్షం నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పడం సరికాదని తెలిపారు. ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ కౌన్సిలర్స్ అనంతరెడ్డి, రామ్‌లక్ష్మణ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, శరత్ చంద్రారెడ్డి ఉన్నారు.

## 'మహిళలకు వరంగా మారిన నవరత్నాలు'

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధిః** మహబూబ్ నగర్‌ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం మహిళలకు వరంగా మారిందని మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు గుండా మనోహర్ పేర్కొన్నారు. శిక్షణా కేంద్రంలో రెండవ బ్యాచ్ పూర్తి అయిన సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎంతో మేధోమథనం చేసి మహిళలకు ఉపాధి ఉద్యోగ అవకావాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రమే మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం అని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఈ శిక్షణా కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్ లలో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామని, ఇప్పటివరక మొదటి బ్యాచ్‌లో 217 మంది శిక్షణ పూర్తి చేసుకోగా, రెండవ బ్యాచ్ లో 247 మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా సెంటర్ లో శిక్షణ పొందిన మహిళలు 30, 40% వరకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయని, మిగతావారు కూడా తమ ఇంటి దగ్గరనే స్వయం ఉపాధి పొందుతున్నారని, ఇక్కడ శిక్షణ తీసుకొని, ఏదైనా యూనిట్ ప్రారంభించాలనుకునే వారి కోసంరుణాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే బ్యాంకుఅధికారులతో మాట్లాడి రుణా లు ఇప్పిస్తూ సహకారం అందిస్తున్నారన్నారు. ఈనెల 17న మొదటి బ్యాచ్ పూర్తి చేసుకున్న వారికి యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేస్తామని, అదే రోజు రెండవ బ్యాచ్ వారికి ఫేర్వెల్ పార్టీ ఇస్తున్నట్లు తెలిపారు. మూడవ బ్యాచ్ కు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి గల వారు అప్లై చే సుకోవాలని, వచ్చే బుధవారం తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణ కేంద్రం ఇంచార్జీ నిజలింగప్ప, ఎమ్మెల్యే పి.ఎ. అనిల్, సెట్విన్ సంస్థ ఇంచార్జీ విజయ్ కుమార్, మహబూబ్ నగర్ ఫస్ట్ ఫ్యాకల్టీ గౌతమి, భవాని, కవిత, అనూష ఉన్నారు.


## చరిత్రలో నిలిచిన బాదేపల్లి హైస్కూల్

### శతాబ్ది సంబరాలు చేసుకుందాం
### శాసనసభ్యులు అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** బాదేపల్లి బాలుర జెడ్పి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. హైస్కూల్లో 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కోఆర్డినేసన్ కమిటీ తేది నిర్ణయిస్తే మూడు రోజుల ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ తో పాటు శీతాకాల విడిదికి హైదరాబాద్ వచ్చే రాష్ట్రపతిని ఆహ్వానించి అదే సమయంలో వేడుకలు జరుపుకుందామని కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు అంటున్నారన్నారు.పూర్వవిద్యార్థులకోఆర్డినేషన్ కమిటీ సభ్యులు బి. రవికుమార్, వి. కృష్ణ, రమణాచార్యులు, ఇబ్రహీంచ వెంకటేష్, పెద్దిబాబు, పరమటయ్య, శ్రీహరి, సంతోష్ చారి, బాబర్ల ,బి. శివకుమార్, కె. లక్ష్మయ్య, యాదయ్య , ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ,ఎంఈఓ మంజూలాదేవి, టీచర్లబృందం పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/జడ్చర్లః** అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలని జడ్చర్ల మండల పరిధిలోని కావేరమ్మపేట, కొత్తతాండా తదితర గ్రామపంచాయితీ ప్రజల తరపున గిరిజన సంఘం నాయకులు జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జడ్చర్ల మండలంకావేరమ్మపేటయందుకొత్తతండా గ్రామ పంచాయితీ ప్రజల తరపున నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో సర్వే నెంబర్స్ 135/2, 135/3 మల్లెబోయిన్ పల్లి శివారు గ్రామంలో అప్పట్లో 500 వందల రూపాయలు చెల్లించి పట్టాదారు నుంచి ప్రభుత్వం సేకరించి 6 ఎకరాల పట్టభూమిని నిరుపేద గిరిజనులకు ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి కొత్త తండాను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్త తండాలోమిగిలిన కొన్ని ప్లాట్ల యందు తండా అభివృద్ధి కొరకు గ్రామ పంచాయితీ, మినీ ఫంక్షన్ హాల్, అంగన్‌వాడి భవనం వంటి వాటిని నిర్మించి ఉపయోగించాలని నిర్ణయించారు. గ్రామ పంచాయితీ పాలకవర్గం మొట్టమొదటి తీర్మానం చేసి ఆ స్థలం యందు గ్రామ పంచాయితీ భవనం కొరకు శంకుస్థాపన కూడా చేశారు. దానిని ఈ మధ్య కొందరు దళారులు, అసాంఘీక శక్తులు కుమ్మక్కై మొహ్మద్ సల్మాన్ అనే వ్యక్తి నుంచి 2023 వ సంవత్సరంలో 20 గుంటల భూమిని కేతవత్ గోవిందునాయక్, కేతవత్ సక్రు నాయక్ అనే వ్యక్తులు గుంటల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుని దానికి నాలా కన్వర్షన్ చేయించి, నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ గా మార్చి ఇతరులకు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి హుటాహుటిన అక్రమ నిర్మాణాలకు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గ్రామ పాలకవర్గానికి గ్రామ సెక్రెటరీ సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. నిర్మాణాలనుఅడ్డుకోకుండా కబు ర్లు చెబుతూ పరక్షంగా అక్ర మ నిర్మాణాలకు సహకరి స్తూ కొత్తతండా అభివృద్ధికి ఆటంకం కలిగిస్తునారన్నారు. కొత్తతండా ప్రజలపై దయ ఉంచి కొత్త తండా గ్రామానికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి, అక్రమ నిర్మాణాలను తొలగించి తండా అభివృద్ధి కొరకు పాటుపడాలని కోరారు.పత్రాన్ని సమర్పించిన వారిలో కొత్తతండా గ్రామ ప్రజలు వడత్యవత్ రమేష్ నాయక్, నేనవత్ శంకర్ నాయక్, భద్రు నాయక్, చందర్ నాయక్, ఆనంద్ నాయక్, ధనుంజయ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రఘు నాయక్, మంజునాథ్, రమేష్‌నాయక్, రాజేష్ నాయక్, రాజు నాయక్, అనిల్ నాయక్, గోపాల్ నాయక్ అనిల్ నాయక్, గోపాల్ నాయక్, సుధాకర్, ఉమ్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** సమాజంలో బడిలో ఉండవలసిన బాలలు పనిలో ఉంటున్నారని బాలలతో పని చేయించే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి పి పురుషోత్తం పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జరిగిన బాలకార్మిక వ్యతిరేక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలల చేతులలో పుస్తకాలు ఉండాలి గాని పనిముట్లు కాదని వివిధ శాఖలు బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలలలో చేర్పించాలన్నారు. న్యాయ సేవ సంస్థ బాల కార్మికుల నిర్మూలనకు సంపూర్ణంగా సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, కార్మిక శాఖ అధికారి అరుణకుమారి, సిడబ్ల్యుసి చైర్మన్ చింత కృష్ణ, చీఫ్ అడ్వైజర్ డిఫన్స్ కౌన్సిల్ ఎన్ భీమార్జున్ రెడ్డి, బాలల అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నల్లగొండ జిల్లా లో ప్రసిద్ధిగాంచిన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన హుండి ఆదాయం రూ.63,09,560 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి యస్ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం చెర్వుగట్టు దేవస్థానంలో ముందుగా గట్టు క్రింద గల అమ్మవారి ఆలయ హుండి ఆదాయం రూ.7,95,660, గట్టు పైన స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం 55,13,900/లు 79 రోజులకు గాను రూ.63,09,560/ అక్షరాల అరవై మూడు లక్షల తొమ్మిది వేల ఐదు వందల అరవై రూపాయలు వచ్చినట్లు తెలిపారు. అధేవిధంగా దేవస్థాన సన్నిధిలో నిర్వహించే అన్నదానం రూ.49,512/ వచ్చినట్లు తెలిపారు. ఇట్టి హుండి లెక్కింపు కార్యక్రమము దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, నల్లగొండ శ్రీదుర్గ శివసాయి సేవా సమిత సభ్యులు,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నల్లగొండ బ్రాంచి సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్డు వెడల్పు చేస్తే ఇండ్లను కోల్పోతాం

### పనులు నిలిపివేయాలని సిపిఐ ఎమ్మెల్సీకి బాధితులు మొర

**ప్రజాపక్షం/మునుగోడు:** రోడ్డు వెడల్పు చేస్తే ఇండ్లు పూర్తిగా కోల్పోతాం... రోడ్డు వెడల్పు పనులు ఆపి న్యాయం చేయాలని బాధితులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలసి మొరపెట్టుకున్నారు. మునుగోడు మండల కేంద్రంలో తరతరాలు నుండి ఇండ్లను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నాం. అయితే ఇక్కడ నుండి చిట్యాల వరకు రోడ్డు వెడల్పులో భాగంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేసేందుకు ఆర్అండ్‌బి అధికారులు కొలతలు కొలుస్తూ మార్కు చేస్తున్నారు. దీంతో ఇండ్లు కోల్పోతామని భయంతో ఆందోళన చెందిన బాధితులు ఎమ్మెల్సీ సత్యంను కలిసి తమకు న్యాయం చేయాలని కోరడంతో బాధితుల విన్నపం స్పందించి సంబంధిత ఆర్అండ్‌బి ఉన్నత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడారు. రోడ్డు వెడల్పు కోసం ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు,నిధులు మంజూరు కాలేదని అలాంటి సమాచారం ఉంటే సంబంధిత బాధితులకు ముందస్తు సమాచారం అందిస్తామని అధికారులు తెలిపారు. బాధితులకు ఎప్పుడు అన్యాయం జరిగినా తాను అందుబాటులో ఉంటానని ఎవరు కూడా ఆందోళన చెందొద్దని ప్రజలకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ విద్యా వ్యవస్థను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి కృషి చేస్తూ విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** అంతర్జాతీయ 11వ యోగా ఉత్సవాల సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఎంహెచ్‌వో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజు యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంతో పాటు ఉల్లాసంగా ఉండవచ్చునని అన్నారు. ఈనెల 21వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు, జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నునావత్ కుమార్, డాక్టర్ బి.రామకృష్ణ, డాక్టర్ విజయసారథి, డాక్టర్ ప్రసాద్, యోగ శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వకుంటే రాజీనామా



**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి తనకు వద్దు జిల్లా అధ్యక్షులు ఇవ్వాలని లేదంటే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన మీద ఉన్న నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్త నుండి పట్టణ అధ్యక్షునిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులుగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. తాను ఎప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే ఉంటానని తనపై కొంతమంది పనిగట్టుకొని కోమటిరెడ్డికి దూరం అవుతున్నారని,కాంగ్రెస్ పార్టీ వీడుతున్నారని ప్రచారం చేయడానికి పార్టీ కార్యకర్తలు,ప్రజలు నమ్మొద్దని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట ఏడిఏ శాంతి నిర్మల అన్నారు. గురువారం మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీలర్ కేంద్రాలను తనిఖీ చేశారు. విక్రయ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ యాదగిరిగుట్ట శాంతి నిర్మల, ఎంఏఓ యాదగిరిగుట్ట సుధా, ఎంఏఓ బోధన్ పోచంపల్లి శైలజ, ఎంఏఓ ఆత్మకూర్ ఎం పూజ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ రాకతో

# హ్యాండ్లూమ్ వ్యాపారాలు వృద్ధి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మిస్ వరల్ కంటెస్టెంట్స్ రాకతో చేనేత వస్త్ర వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయని నేత కార్మికులకు మద్దతుతో పాటు ప్రోత్సాహం లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర గవర్నర్ పోచంపల్లిని సందర్శించి నేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చేనేత పరిశ్రమ స్థితిగతులను తెలుసుకొని మెరుగైన ఫలితాలు సాధించడం కోసం గవర్నర్ పోచంపల్లిని సందర్శించిన సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు జీవనస్థితిగతులను సునిశితంగా తెలుసుకునేందుకు రావడం కార్మికుల ముఖాముఖిలో అభిప్రాయాలను తెలుసుకొని ప్రభుత్వానికి తగు సూచనలు చేసి నేత పరిశ్రమను ఆదుకోవాలని ఆయనను కోరారు. తరచుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు పరిశ్రమను సందర్శిస్తూ ఉంటే ప్రచారం బాగా పెరిగి వ్యాపారాలు పెరుగుతాయని అన్నా రు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం వినూత్న పథకాలతో చేయూతను అందిస్తుందని పేర్కొన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కు యాదాద్రి భువనగిరి జిల్లా కు త్రిఫ్ట్ పథకం కింద 90 కోట్ల రూపాయలు ఇచ్చిందని, అలాగే రుణ మాఫీ కింద ఆర్థిక సహాయం ఇవ్వనుందని, నేతన్న భరోసా ,నేతన్న బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గవర్నర్తో ముఖాముఖిలో పాల్గొన్న పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, తడక రమేష్, అంకం పాండు, మెరుగు శశికళ, గుర్రం హేమలత, భారత గగనలు చేనేత పరిశ్రమ పట్ల అభిప్రాయాలు తెలిపారు. పోచంపల్లి చేనేత ఉత్పత్తులు బాగున్నాయని, అయితే మార్కెటింగ్ సరిగాలేదని, ఈ సమస్యను పరిష్కరిస్తే నేత కార్మికులు బాగుపడతారని, వ్యవసాయ రంగానికి సహకరించినట్లు గానే చేనేత రంగానికి కూడా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. పోచంపల్లి గ్రామం ఇక్కత్ కు మాత్రమే ప్రసిద్ధి కాదని, ఇది నాలుగు రకాల సబ్జెక్టులతో ముడిపడి ఉందని, నేత, డయింగ్, కలర్ అన్నిరకాల పరిజ్ఞానం చేనేత కార్మికులందరికీ జియో ట్యాగింగ్ ఇవ్వాలని ,ఇక్కత్ పరిజ్ఞానాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆత్మ స్థైర్యం తో పాటు, జీవన ప్రమాణాలు పెరిగాయని, త్రిఫ్ట్ పథకం వల్ల తనాకు రెండు లక్షల 15 వేల రూపాయలు వచ్చాయని, పిల్లల చదువుకు వినియోగించానని,అయితే నేత కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తోపాటు ఆయన ఉపేందర్, భాగ్యలక్ష్మి, యాదగిరి అనే నేత కార్మికులకు నేతన్న రుణాల కింద 5 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. నేతన్న పొదుపు పథకం కింద యాదాద్రి భువనగిరి జిల్లా మొత్తానికి రెండు కోట్ల పదిహేను లక్షల 25 వేల చెక్కును నేత కార్మికులకు అందజేశారు. అంతకుముందు పార్కులో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను గవర్నర్ ఉన్నతాధికారులతో పాటు ఆయన పరిశీలించారు. చేనేత కార్మికులు తెలుగులో చెప్పిన అభిప్రాయాలను టై అండ్ డై అధ్యక్షులు భారత లవ కుమార్ హిందీలో అనువాదం చేసి చక్కగా వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, జిల్లా కిసాన్ సేన అధ్యక్షులు , నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల డ్రై రన్...



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ముందస్తుగా కృష్ణానదికి వరద వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కొద్ది రోజుల క్రితం ప్రాజెక్టు అధికారులు రేడియల్ క్రస్ట్ గేట్ల రబ్బర్ సీల్ మరమ్మతు పనులను అదేవిధంగా 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్ చేసే సెంట్రల్ డివైజ్ యూనిట్, ఎండ్ డివైజ్ యూనిట్ లకు సంబంధించి సర్వీసింగ్, గ్రీజింగ్ పూర్తిచేయడం జరిగింది. అయితే గురువారం ప్రాజెక్టుకు సంబంధించిన 13 రేడియల్ క్రస్ట్ గేట్లను ప్రాజెక్టు అధికారులు డ్రై రన్ నిర్వహించడం జరిగిందని వీటితోపాటు ప్రాజెక్టు 5 క్రస్ట్ గేట్ల రోప్ లకు కార్డియం కాంపౌండ్ ను అప్లై చేయడం పూర్తయిందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. గేట్లకు సంబంధించిన మిగిలిన పనిని మరో రెండు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందని వారన్నారు.

**ప్రాజెక్టుకు స్వల్ప ఇన్ ఫ్లో....** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా గురువారం ఉదయం 8905 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంది. రెండు రోజుల క్రితం 590 అడుగులకు గాను511 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటి మట్టం స్వల్ప ఇన్ ఫ్లో తోగురువారం సాయంత్రానికి 512.60 అడుగులుగా ఉండి 136.1274 టీఎంసీల నీటి నిల్వ తో ఉంది కుడి ఎడమల కాలువ నుంచి ఎటువంటి నీటి విడుదల కొనసాగకపోవడంతో పాటు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ఎస్ ఎల్ బి సి ఏ ఎం ఆర్ పి ద్వారా మాత్రం 900 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదలవుతుంది.

## అక్రమ హద్దురాళ్ళను తొలగించి న్యాయం చేయండి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తమ సొంత భూమిలోనికి అక్రమంగా చొరబడి హద్దురాళ్ళను తొలగించిన వ్యక్తులపై చట్టరీత్యా చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు గార్లపాటి భూపాల్ రెడ్డి అధికారులను కోరారు. గురువారం నల్లగొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ మండలం, జి చెన్నారం గ్రామంలో కూకుంట్ల శేఖర్, వద్ద సర్వే నెం.70, 71 లలో 3ఎకరంల భూమిని కొనుగోలు చేసినామనీ ధరణిలో అట్టి భూమి నమోదు అయి 2021 లో పాసుబుక్ రావడం జరిగిందన్నారు. ఈ భూమిని భూమిని మండల, జిల్లా సర్వేయర్ సర్వే చేసి హద్దులు చూపడం జరిగిందనీ. ఆ రిపోర్టు ప్రకారం నేను నా భూమికి పోలీస్‌ల సమక్షములో హద్దు రాళ్ళు పాతుకొని కంచె ఏర్పాటు చేసుకున్నాననీ తెలిపారు.కాని మా పక్క భూమి యజమాని కంచర్లకుంట్ల వెంకట్రాంరెడ్డి దానిని తొలగించారు.వాళ్ళ కి సపోర్టుగా కనగల్ పిఎస్ ఎస్ఐ విష్ణు మమ్ముల్ని భయపెడుతున్నారనీ. మా భూమిపైకి ఇద్దరి కానిస్టేబుల్‌ను పంపించి మమ్ములను బెదిరిస్తున్నారని ఇట్టి విషయంలో పూర్తిగా పరిశీలించి సమగ్ర విచారణ జరిపించి ఎస్ఐ. పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

# భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు

### సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు జూన్ 20వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు రెవిన్యూ అధికారులు వస్తారని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని ఆధారాలతో రెవిన్యూ సదస్సులలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకి ఎంతో మేలు జరుగుతుందని, రెవిన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలమర్రి గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సు ద్వారా 169 దరఖాస్తులు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తదుపరి అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణంను సందర్శించారు. జిల్లాలో 610 రేషన్ షాపులకి 17,577 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం వచ్చినందున ప్రజలు ఎవరు ఆధైర్యపడకుండా ఉండాలని చివరి లబ్ధిదారునికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. బియ్యంను వంట చేసుకున్నారా, అన్నం నాణ్యత బాగుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వేసవి సెలవులు అనంతరం పునఃప్రారంభం అయినాయి. పరిసరాలు పరిశుభ్రంగా చేయాలన్నారు. పిల్లలకి అందించే పోషక ఆహారంలో నాణ్యత పాటించాలని, పిల్లలకి మంచి విద్య నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ర్యాలీ

**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అలంపూర్ పట్టణంలో రాజ్కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు ప్రారంభించగా పురవీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల కార్మికులను బడిలో చేర్పించే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పెద్దలు పనికి పిల్లలు బడికి పోయేలా ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి పిల్లలను బడికి పంపాలన్నారు. నిర్వాహకురాలు రత్నకుమారి మాట్లాడుతూ కరోనాలో పాఠశాలలు మూతపడి అప్పట్లో ఎంతోమంది చదువుకు దూరమయ్యారని దాని నుండి బాల కార్మిక వ్యవస్థ మొదలైన ప్రస్తుతం ప్రభుత్వం బాల కార్మిక నిర్మూలనకు అనేక విధాల కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కొట్టు శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టుల దరఖాస్తుకు ఆహ్వానం

**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్ మీడియట్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇంటర్ మీడియట్ తెలుగు, ఇంగ్లీష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, ఎంపిహెచ్‌డబ్ల్యా సబ్జెక్టులలను బోధించేందుకు లెక్చరర్ పోస్టులు ఖాళీ ఉన్నందున బిఈడి పిజి చేసి అర్హత కలిగిన వారు మండలంలో ఈనెల 16వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించడమే మోదీ లక్ష్యం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ అత్యాధునిక వైద్య సేవలు అందించడమే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం అని మహబునగర పార్లమెంట్ సభ్యురాలు ఎయిమ్స్ బోర్డు మెంబర్ డీకే అరుణ అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో గల ఎయిమ్స్ ఆసుపత్రిని ఆమె సందర్శించి వైద్య సేవలను భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది రూపాయలకే అత్యాధునిక వైద్యం అందించాలని సంకల్పంతో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటు చేశారన్నారు. 2026 సంవత్సరం వరకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, దాసరి మల్లేశం, చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు బోనగిరి సదానంద గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల చంద్రశేఖర్ రెడ్డి, భువనగిరి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, యువ మోర్చా అధ్యక్షులు పట్నం కపిల్ పాల్గొన్నారు.



# కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి నర్సింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, బాలలకు తరగతి గదితోనే ఉజ్వల భవిష్యత్ ఉందని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ నెంబర్2 ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లాఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గంలో నడిపే వృత్తి ఉపాధ్యాయ వృత్తి, తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, దేవుడు ప్రసాదించిన వరం ఉపాధ్యాయులని అన్నారు. బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరు పాఠశాలలకు వెళ్లాలని, బాలల చదువులకు ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలోఓ ప్రతి బుధవారం రోజున పోలీస్ ప్రజా బరోసా కార్యక్రమం నిర్వహిస్తూ పౌరులు సన్మార్గంలో నడవాలని మంచిని బోధిస్తూ పోలీసుగా మేము కూడా ఉపాధ్యాయుల వలే పనిచేస్తున్నామని అన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సప్రవర్తనపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ సంవత్సరం 10వ తరగతిలో మంచిమార్కులు తెచ్చుకుని ప్రధమ స్థానం విద్యార్థికి 10,116 రూపాయలు, ద్వితీయ స్థానం విద్యార్థికి 5116 జిల్లా పోలీస్‌శాఖ తరుపున బహుమతిగా ఇస్తాను అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ యం. ఉదయశ్రీ, సిఐ రాజశేఖర్, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడ

## కెకెఆర్ నుండి ఐదుగురు ఔట్

ఐపిఎల్ 2025 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) తీవ్రంగా నిరాశపరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కెకెఆర్.. పేలవ ప్రదర్శనతో కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. స్టార్ ఆటగాళ్ల వైఫల్యం ఆ జట్టు కొంపముంచింది. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్ తీవ్రంగా నిరాశపర్చగా.. భారీ అంచనాలు పెట్టుకున్న రింకూ సింగ్, వెంకటేశ్ అయ్యర్, క్వింటన్ డికాక్ తేలిపోయారు. దాంతో కేకేఆర్ 14 మ్యాచ్‌లకు ఐదు మాత్రమే గెలిచి 8వ స్థానంలో నిలిచింది. వర్షం కారణంగా రెండు మ్యాచ్‌లు రద్దవ్వడం కూడా కెకెఆర్ ప్లే ఆఫ్స్ అవకాశాలపై ప్రభావం చూపింది. ఈ వైఫల్యం నేపథ్యంలోనే ఐపిఎల్ 2026 మినీ-వేలానికి ముందు జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. జట్టు బలహీనతలను సరిదిద్దుకోవడంతో పాటు పర్స్ వాల్యూను పెంచుకునేందుకు కేకేఆర్ అవసరం లేని ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది.

### వెంకటేష్ అయ్యర్



ఐపిఎల్ 2024 సీజన్‌లో టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన వెంకటేశ్ అయ్యర్‌ను కేకేఆర్ రూ. 23.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ ఈ సీజన్‌లో అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఈ క్రమంలోనే వెంకటేశ్ అయ్యర్‌ను వేలంలోకి వదిలేసే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్స్ వాల్యూను పెంచుకోవడానికి అయ్యర్‌ను వదిలేయవచ్చు. వేలంలో తక్కువ ధరకు అతన్ని తిరిగి కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది.

### క్వింటన్ డి కాక్



ఓపెనర్‌గా అదిరిపోయే ఆరంభాలు అందిస్తాడని భావించిన క్వింటన్ డికాక్ తీవ్రంగా నిరాశ పరిచాడు. ఐపిఎల్ 2025 సీజన్ మెగా వేలంలో ఈ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కోసం కేకేఆర్ రూ. 3.60 కోట్లు ఖర్చు చేసింది. కానీ అతను 8 మ్యాచ్‌ల్లో 21.71 సగటుతో 152 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో రాజస్థాన్ రాయల్స్‌పై 97 పరుగుల తో అజేయంగా నిలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమయ్యాడు. అతని స్థానంలో రెహమనుల్లా గుర్బాజ్‌ను ఆడించగా.. అతను కాస్త మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ క్రమంలోనే డికాక్‌ను వదిలేసి భారత వికెట్ కీపర్‌ను తీసుకనే ప్రయత్నం కేకేఆర్ చేయవచ్చు.

### అన్రిచ్ నోర్జే



సౌతాఫ్రికా స్టార్ పేసర్ అన్రిచ్ నోర్జేను కేకేఆర్ రూ. 6.50 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం 2 మ్యాచ్‌లే ఆడి ఒక వికెట్ తీసాడు. గాయంతో సీజన్ ఆరంభంలోనే జట్టుకు దూరమయ్యాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో స్టార్ పేసర్‌ను కేకేఆర్ తీసుకోవచ్చు.

### స్పెన్సర్ జాన్సన్



మిచెల్ స్టార్క్ స్థానాన్ని భర్తీ చేయగలడని ఆసీస్ లియా లెఫ్టార్మ్ పేసర్ స్పెన్సర్ జాన్సన్‌ను రూ. 2.80 కోట్ల భారీ దరకు కేకేఆర్ కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం 4 మ్యాచ్‌లు ఆడి ఒకే ఒక్క వికెట్ తీసాడు. 11.73 ఎకానమీతో ధారళంగా పరు గులిచ్చాడు. పేస్ విభాగాన్ని పటిష్టం చేయాలనుకుం టున్న కేకేఆర్.. జాన్సన్‌ను వదిలేసి మరో పేసర్‌ను తీసుకునే ప్రయత్నం చేయవచ్చు.

### మొయిన్ అలీ



ఐపిఎల్ 2025 సీజన్‌లో కెకెఆర్ తరఫున ఆడిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. బ్యాటింగ్‌లో పెద్దగా అవకాశాలు రాణించక పోయినా.. బౌలింగ్‌లో అంతగా ప్రభావం చూపలేకపోయాడు. ఇప్పటికే రస్సెల్, సునీల్ నరైన్ వంటి విదేశీ ఆల్‌రౌండర్లు ఉండటంతో మొయిన్ అలీని తుది జట్టులో ఆడించలేని పరిస్థితి నెలకొంది. రూ. 2 కోట్లు పెట్టిన తీసుకున్న మొయిన్ అలీ 6 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు తీసాడు. మొయిన్ అలీ స్థానంలో భారత యువ ఆటగాడిని కేకేఆర్ ఎంచుకోవచ్చు.

## కోహ్లీ, రోహిత్ లేరు.. మీకిదే గోల్డెన్ ఛాన్స్: గౌతమ్ గంభీర్



తమను తాము నిరూపించుకునేందుకు కుర్రాళ్లకు ఇదే సరైన సమయం అని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ నేపథ్యంలో టీమిండియా యువ ఆటగాళ్లను ఉద్దేశించి గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి సీనియర్ ఆటగాళ్లు లేరని, వారి గైర్హాజరీలో సత్తా చాటేందుకు ఇదే సరైన అవకాశంగా భావించాలని కుర్రాళ్లకు సూచించాడు. శుభ్‌మన్ గిల్‌ను టీమిండియా నయా టెస్ట్ సారథిగా నియమించగా.. రిషభ్ పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జూన్ 20 నుంచి లీడ్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే ఇంగ్లండ్‌కు చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది. ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా కుర్రాళ్లను ఉద్దేశించి గంభీర్ చేసిన వ్యాఖ్యలను బీసీసీఐ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.ప్రస్తుతం మనం ఉన్న స్థితిని రెండు విధాలుగా చూడొచ్చు. ఒకటి మనం ముగ్గురు అత్యంత అనుభవం కలిగిన ఆటగాళ్లు రోహిత్, విరాట్, అశ్విన్ లేకుండా బరిలోకి దిగుతున్నాం. రెండోది దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మనకు ఉన్న అద్భుతమైన అవకాశంగా చూడటం. ఈ జట్టులో గెలవాలనే కోరిక, అభిరుచి, ప్రత్యేకంగా ఏదైనా చేయాలనే నిబద్ధత ఉందని నేను అనుకుంటున్నాను. మనం త్యాగాలు చేస్తే.. మనం కంఫర్ట్ జోన్ల నుంచి బయటకు వస్తే.. మనం పోరాడటం ప్రారంభిస్తే.. ప్రతీ సెషన్, ప్రతీ గంట, ప్రతీ బంతిని మనం చిరస్మరణీయంగా మలుచుకోగలం.ఆ ప్రయత్నాన్ని ఈ రోజు నుంచే ప్రారంభించండి. దేశం కోసం ఆడటం కంటే పెద్ద గౌరవం మరొకటి లేదు. అందుకోసం ప్రతీ ట్రైనింగ్ సెషన్‌ను ఉపయోగించుకుందాం. దానికి అనుగుణంగా శిక్షణ పొందుదాం. బౌలర్లు అయినా.. బ్యాటర్లు అయినా.. ఒత్తిడిలో ఎలా ఆడబోతున్నామో ఇక్కడే తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. ప్రతీ బంతిని ఒక ఉద్దేశంతో ఆడుదాం.'అని గంభీర్ కుర్రాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు.

# ఫోకస్ వ్యవసాయం



## ఖరీఫ్‌లో లాభదాయకమైన పంటలు

ఖరీఫ్ సీజన్ అంటే వర్షాకాలంలో (జూన్ నుండి అక్టోబర్ వరకు) సాగు చేసే పంటలు. ఈ కాలంలో వర్షపాతం, తేమ ఎక్కువగా ఉండటంతో నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంటలు బాగా పండుతాయి. వీటిలో ముఖ్యమైన లాభదాయక ఖరీఫ్ పంటలను పరిశీలిస్తే, ముందుగా వరిని ప్రస్తావించాలి. భారతదేశంలో అత్యధికంగా సాగు చేసే ఖరీఫ్ పంట వరి. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఇది అత్యంత లాభదాయకం. ఇతర పంటల విషయానికి వస్తే, మొక్కజొన్న తక్కువ కాలంలో దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సోయాబీన్ వంటి నూనె గింజల పంటలు కూడా లాభదాయకంగా ఉంటాయి. వాణిజ్యపంటల్లో పత్తి మంచి ఆదాయాన్ని ఇస్తుంది. ఎక్కువ కాలం పడినా, మంచి దిగుబడి, ఆదాయం ఇవ్వగలిగే పంట చెరకు. వేరుశెనగ తక్కువ పెట్టుబడితో మంచి లాభాల నిస్తుంది. నువ్వులు, మినుములు, కందులు, పెసలు, జొన్న, రాగి: ప్రాంతానుసారం మార్కెట్ డిమమాండ్ ఉన్న చోట లాభదాయకంగా ఉంటాయి. ఇటీవల కాలంలో చిరుధాన్యాలు (Millets) ఎక్కువ డిమాండ్‌తో, విస్తృతంగా లాభాలు ఆర్జిస్తున్నాయి. తక్కువ నీటితో, ఆరోగ్యపరంగా డిమాండ ఎక్కువగా ఉంది. టమాటా వంటి కూరగాయలు, ఆకు కూరలతోనూ మంచి ఆదాయం లభిస్తుంది. 2025–26లో ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంచారు. ముఖ్యంగా నువ్వులు, రాగి, పత్తి, చిరుధాన్యాలకు అధికంగా పెరిగాయి. రైతులు పెట్టుబడిపై కనీసం 50 శాతం లాభం పొందేలా ఎంఎస్‌పిని సవరించారు. కాబట్టి, ఈసారి ఖరీఫ్ సీజన్ రైతులకు లాభసాటిగా ఉంటుందని ఆశిద్దాం.

## సాంకేతికతతో ఆదాయం...



ఆధునాతన సాంకేతికత, యాంత్రికీకరణ రైతుల ఆదాయాన్ని పెంచుతున్నాయి. యంత్రాలు, ఆధునిక పరికరాలు, డ్రోన్లు, స్మార్ట్ ఇరిగేషన్ వంటి సాంకేతికతలు పంటల దిగుబడిని పెంచడంలో సహాయపడతాయి. ఇది ప్రతి యూనిట్ భూమి నుండి ఎక్కువ ఉత్పత్తిని పొందేందుకు అనుకూలిస్తుంది. యాంత్రికీకరణ వల్ల కూలీలపై ఆధారపడటం తగ్గుతుంది, కార్మికుల ఖర్చు తగ్గుతుంది. ఇది రైతుల ఖర్చును తగ్గించి, లాభాన్ని పెంచుతుంది. సమాచార సాంకేతికత, డిజిటల్ పోర్టల్లు, మొబైల్ యాప్లు, సెన్సార్లు వంటివి రైతులకు కాలానుగుణ సలహాలు, మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం అందిస్తూ, ఎంచుకున్న పంటలు, పోషక నిర్వహణలో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడతాయి. అదే విధంగా సాంకేతికతలు అధిక విలువ గల పంటలు, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు (పశువులు, కోళ్లు, తేనెటీగలు) మార్గం చూపుతాయి. ఇది రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి తోడ్పడుతుంది. పంటల బీమా, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం వంటి సేవలను సులభతరం చేస్తుంది. ఇది రైతులను అనిశ్చితి నుండి కాపాడుతుంది మరియు ఆదాయ స్థిరత్వాన్ని పెంచుతుంది.



## వర్షపాతం ఆధారంగా...

ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఈసారి రుతుపవనాలు ఎనిమిది రోజులు ముందుగానే ప్రవేశించాయి. 2009 తర్వాత ఇంత ముందుగా రుతుపవనాల రాక ఇదే మొదటిసారి. వ్యవసాయానికి ఎంతో ఉపయోగంగా ఉండే వాతావరణం కొనసాగుతుందని నిపుణులు అంటున్నారు. సాధారణంగా వర్షాధారంగా సాగు చేసే రైతులకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి అవసరం, ఎక్కువ మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.

### తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

సగటున 40 నుంచి 60 సెంటీ మీటర్ల వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటి అవసరం తక్కువగా ఉండే పంటలు ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.

- **చిరుధాన్యాలు (మిల్లెట్స్):** జొన్న, సజ్జ, రాగి వంటి మిల్లెట్లు తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో అధిక దిగుబడి, మంచి లాభం ఇస్తాయి.
- **పప్పు ధాన్యాలు:** కంది, పెసర, మినుము, శనగ వంటి పప్పు పంటలు తక్కువ నీటితో కూడా బాగా పండుతాయి.
- **వేరుశెనగ:** తక్కువ నీటితో సాగు చేయవచ్చు, మార్కెట్ డిమాండ ఎక్కువగా ఉంటుంది.
- **సోయాబీన్:** తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేయవచ్చు.
- **పత్తి:** లోతైన నల్లరేగడి నేలలు, తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో లాభదాయకంగా ఉంటుంది.
- **గోరుచిక్కుడు, జీలుగ:** పశుగ్రాసపు పంటలు, తక్కువ నీటి అవసరం.

వర్షపాతం, నేల రకం, స్థానిక మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంట ఎంపిక చేసుకోవడం ఉత్తమం. వర్షాధారంగా సాగు చేయాలంటే తక్కువ నీటి అవసరం ఉన్న పంటల వైపు మొగ్గు చూపితే లాభం ఎక్కువ.

### మధ్యస్థ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

- **పత్తి:** మధ్యస్థ వర్షపాతం, లోతైన నల్లరేగడి నేలల్లో వర్షాధారంగా సాగు చేయవచ్చు.
- మొక్కజొన్న: తక్కువ నీటి అవసరం, మార్కెట్ డిమాండ్ ఎక్కువ.

### ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో..

- **వరి:** అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో వరి సాగు లాభదాయకం.

స్థూలంగా చూస్తే ఈ ఖరీఫ్‌లో చిరుధాన్యాలు, పప్పు పంటలు, వేరుశెనగ, సోయాబీన్, పత్తి వంటి పంటలు ఎక్కువ లాభాలను ఆర్జించి పెడతాయని వ్యవసాయ నిపుణుల అభిప్రాయం.

## ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన బాధ్యత సర్కారుదే

ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్య మసకబారుతుందని దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యకర్తల సమావేశం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీలు పెట్టి ఫోటోలు దిగి బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వపాఠశాలలకు రారని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదిరి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం విద్యారంగంపై దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, మహేష్, నాగరాజు, ప్రతాప్, రాకేష్, నరేష్, గోపి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల పారిశుద్ధ్య కార్యక్రమం పేరుతో మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో ఆదివారం పండగ సెలవులు కూడా ఇవ్వకుండా పనిచేయిస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. గురువారం మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ సంఘాల బాధ్యులు మునిసిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఒకవైపు వర్షాలు కురుస్తుండడం, తగిన పనిముట్లు, భద్రతా పరికరాలు లేకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు పనిముట్లు, రైన్ కోట్లు, గ్లౌజులు, బూట్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నర్సింగరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, టియుసిఐ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎం.సుదాకర్ పాల్గొన్నారు.

## బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో పాలకులు విఫలం


సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** తెలంగాణ విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో గత పాలకులు పూర్తి గా విఫలం చెందారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. బయ్యారం మండల సిపిఐ మహాసభ సంతులాల్ పోడు తండా గ్రామంలో గంగనబోయిన రాజు, బోడ కాంతి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. కామ్రేడ్ గుగులోత్ భద్రు స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం మహాసభనుద్దేశించి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపననే మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపన చేసి మహబూబాబాద్ జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. నిరంతరం పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని, ఇది పేద ప్రజలకు అండగా నిలిచి, ప్రజా ఉద్యమాల క్షేత్రంలో పురుడు పోసుకున్న పార్టీ అన్నారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సిపిఐ ప్రతినిధులను నిలబెట్టి వారి గెలుపునకు కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండేలా ప్రణాళికా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందింస్తూ వాటి పరిష్కారానికి కార్యకర్తలు ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, కళింగరెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు నాదెండ్ల పద్మ, మందనపు రాజు, గుగులోత్ రవి, నందా, నీలావతి, మౌనిక, తోకట వీరన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 21న మంచిర్యాలలో సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాలలో జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు పిలుపునిచ్చారు. దండేపల్లి మండల మూడవ మహాసభ రాజలింగయ్య కాలనీలో గురువారం జరిగింది. సమావేశంలో మేకల దాసు మాట్లాడుతూ జూన్ 21న ప్రదర్శన, బహిరంగ సభ, జూన్ 22న ప్రతినిధుల సభ జరుగుతుందని, సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీజాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో దండేపల్లి మండల కార్యదర్శిగా పేర్క రాజేశం ఎన్నికయ్యారు కార్యక్రమంలో మేదరి దేవవరం, నీరటి కమల, గుంట భూమన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కామేపల్లి:** ఎన్నికల్లో గెలిచినా ఓడినా నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. కామేపల్లి సిపిఐ 18వ మండల మహాసభ మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామం లో గురువారం సిపిఐ మండల సహాయ కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. మహా సభకు ముఖ్యఅతిథిగా భాగం హేమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి, అణచివేతకు గురవుతున్న ఏజెన్సీ గ్రామాల ప్రజల జీవన ప్రమాణా మార్పునకు నాంది పలికి వారిని ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానే అన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమన్నారు. అన్యాయం దోపిడి అణచివేత ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని, ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక పేద ప్రజల ప్రాణాలను బిజెపి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని భాగం హేమంతరావు డిమాండ్ చేశారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐ సత్తా చాటుతుందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ సిపిఐ శ్రేణులు కార్యకర్తలు నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత తాళ్లగూడెం గ్రామంలో మండల మహాసభ సందర్భంగా సిపిఐ జెండాను ఎగరవేశారు. మహాసభలో సిపిఐ, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్ర బాబు, ఏపూరి లతాదేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి శివ, కామేపల్లి మండల సిపిఐ కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నాయకులు పుచ్చకాయల కృష్ణ, శ్రీను, వెంకట కృష్ణ, శతకోటి సత్యనారాయణ, సిరిపురపు ప్రభాకర్‌రావు, బండి శ్రీను, అమరబోయిన తిరపయ్య, ఎస్‌కే సలీం, అంబడపూడి జగ్గయ్య, మండల పరిధిలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు గృహాలు ఇచ్చే వరకూ.. భూపోరాటాలు నిర్వహిస్తాం

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు కట్టించిఇచ్చే వరకు భూపోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. గురువారం బొల్లికుంట అంబేద్కర్ నగర్ శాఖ సిపిఐ ప్రథమ మహాసభ జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా మేకల రవి హాజరై మాట్లాడుతూ జిల్లాలో భూమి పేద వర్గాలకు కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను, ప్రజలకు నివాస స్థలాలు వచ్చేంతవరకు పోరాడుతామన్నారు. బొల్లికుంట శివారు ప్రభుత్వ భూమిలో సిపిఐ ఆద్వర్యంలో ఎర్రజెండాలు పాతిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డు పెట్టారని గుర్తు చేశారు. ఈ భూమిలో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి పోరాటాలు ఆపలేరని హెచ్చరించారు. వరంగల్ జిల్లాలో ఇతర ప్రాంతాలలోనూ ఇలాంటి భూములు అనేకం ఉన్నాయని, వాటిని గుర్తించి పేదలకు పంచాలన్నారు. సభలో రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, ఖిలా వరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఖిలా వరంగల్ మండల సహాయ కార్యదర్శులు ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్‌పాల్, జిల్లా సమితి సభ్యులు యండి అక్బర్ పాషా, ఆరెల్లి రవి, మండల సమితి సభ్యులు యాకుబ్, చిట్యాల సువర్ణ, అంబేద్కర్ నగర్ శాఖ కమిటీ సభ్యులు, బాబు రమేష్ గౌడ్, కుమార్, ప్రభాకర్, కరుణాకర్, రోజా, సునిత తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



**ప్రజాపక్షం/అల్వాల్:** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అల్వాల్ డివిజన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలమేరకు అల్వాల్ సర్కిల్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డితో కలిసి పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సునీత, మాజీ కౌన్సిలర్ సూర్య కిరణ్, స్థానిక నాయకులు సాయిరాం గౌడ్, మధుసూదన్,అశోక్, జ్యోతియాదవ్, గాయత్రి, బాబిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మనుచౌదరి నియామకం



మిక్కిలినేని మనుచౌదరి



గౌతం పొట్రు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గౌతం పొట్రు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేసారు. గౌతం పొట్రు 2023 శాసనసభ ఎన్నికలకు ముందు కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకొని విధులు నిర్వహించారు. వివాదరహితుడిగా, సమర్థవంతమైన అధికారిగా జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను నిర్వహించటంలో మంచి పేరు గడించారు. నూతనంగా మేడ్చల్ కలెక్టర్‌గా బదిలీపై వస్తున్న మిక్కిలినేని మనుచౌదరి ఖమ్మం జిల్లా మధిర మండలంలోని దెందులూరు గ్రామం స్వస్థలం, ఆయన తండ్రి ఓరియంట్ సిమెంట్ కంపెనీలో సీనియర్ కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారునప. తల్లి ఆశయం, కోరిక మేరకు మనుచౌదరి సివిల్స్ రాసి తొలి యత్నంలోనే 2017లో ఆలిండియా 36వ ర్యాంక్ సాధించారు. గతంలో ఆయన నాగర్‌కర్నూల్, కామారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్‌గా సిద్దిపేట కలెక్టర్‌గా పని చేసారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేత

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రభుత్వ పాఠశాలలు ఎంతో మందిని విద్యార్థులను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం 2025–26 విద్య సంవత్సరం, బడి బాటను పురస్కరించుకుని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలే ఎపిజె అబ్దుల్ కలాం వంటి మహోన్నత వ్యక్తులను అందజేశాయని, ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి అత్యున్నత స్థానాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు బంగారు బాట : పవన్‌కుమార్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి, ఉద్దెమర్రి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బడిబాటలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. అలాగే మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, అంగన్‌వాడి టీచర్ సంధ్య, నాయకులు దోసకాయల వెంకటేష్, విష్ణుగౌడ్, వెంకట్‌రెడ్డి, బాల్‌నర్సింహా, లక్ష్మ న్, టీచర్లు, పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఎంపికలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఈ నెల 18న మూడుచింతలపల్లి మున్సిపల్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తామని మూడుచింతలపల్లి ఎంఇఒ బాగ్యమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడుచింతలపల్లి మండల స్థాయిలో నాలుగవ తరగతి ప్రవేశానికి ఎంసిపల్లిలోని స్టేడియంలో ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయని చెప్పారు. 01 092016 నుంచి 31082017 మద్యకాలంలో జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టినతేది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బోనోఫైడ్, మూడవ తరగతి ప్రోగ్రెస్‌కార్డు, ఐదు పాస్‌ఫోటోలతో పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 917416542457, 918019607642 మొబైల్ నెంబర్‌లను సంప్రదించాలని, tgss.telangana.govt.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎంసిపల్లిలో ముగిసిన రెవెన్యూ సదస్సు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి ఆర్ఒఆర్ నూతన చట్టంపై ఈ నెల 3 నుంచి నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయని ఎంసిపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. లక్ష్మాపూర్‌లో అదనంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 166 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 982 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటి సింగాయిపల్లిలో 13, దేవరయాంజాల్‌లో 46 దరఖాస్తులు వచ్చాయని శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. అందుబాటులో లేని రైతులు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్‌లు అనూషరెడ్డి, సంయుక్త, ఆర్ఐలు అన్వేష్, కవిత, రాఘవసాగర్, సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు బట్టలు పంపిణీ

**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు మరియు యూనిఫామ్ ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేసిన మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అనంతరం అంగన్‌వాడీ బాలలతో కలిసి అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. బిజెపి నాయకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఈరోజు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత స్థాయి ఉపాధ్యాయులు, పుస్తకాలు, బట్టలు, మధ్యాహ్న భోజనం, ఎన్నో సమాకూర్చిన ఏ విషయం లోనైనా ఏవైనా తక్కువ ఐతే స్థానిక ప్రజాప్రతినిధుల, నాయకుల సహకారంతో కొదువ లేకుండా అన్నీ చూసుకుంటున్న ఉపాధ్యాయులు కావున మీరంతా ఈ పాఠశాలకు దేశానికి ఎంతో గొప్ప పేరు తీసుక రావాలని ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, మోడీగారి శ్రీధర్, క్రాంతి, శ్రావణి, శిల్ప, జళేశ్వర్ అంగన్వాడీ టీచర్ డి లలితబాయి పాల్గొన్నారు.

# వరద ముప్పు ప్రాంతాలను సందర్శించిన హైడ్రా కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరద ముంపు ఉన్న పలు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ గురువారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. వేకువ జామున కురిసిన భారీ వర్షాలకు వరద ముంచెత్తిన డోయన్స్ కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చిన వరద సాఫీగా గోపీ చెరువుకు చేరే మార్గం లేక శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కాలనీని ముంచిన వరద, వర్షం నీరు, గోపి చెరువు నుంచి వచ్చిన వరదతో లింగంపల్లి అండర్ పాస్‌లో నీరు నిలిచిందని స్థానికులు తెలిపారు. గోపీ చెరువు, చాకలి చెరువులో నీటిమట్టం తగ్గించి, వరద కట్టడి చేయవచ్చని సూచన చేశారు. అంతకు ముందు వరద ముంపు ఉన్న కొండాపూర్‌లోని కాసోలోస్ అపార్ట్‌మెంట్ పరిసరాలను తనిఖీ చేశారు. వరద, మురుగు కాలువలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని హెచ్ఎం అధికారులకు సూచించారు. ఎస్ఎన్‌డిపి చేపట్టిన కాలువల నిర్మాణ పనులు వేగంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు చెన్నం చెరువు నుంచి వచ్చే వరద రామచంద్రాపురం కాలనీలో నిలవకుండా దిగువన ఉన్న బాచుపల్లి చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**12 గంటల్లో వరద ముప్పునకు పరిష్కారం..**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు నగరంలోని రాజేంద్రనగర్ మండలంలోని ఉప్పరపల్లి, శాస్త్రిపురం, పల్లె చెరువు ప్రాంతాలను బుధవారం సందర్శించారు. ఉప్పరపల్లి లోని అశోక్ విహార్ కాలనీలో మురుగు, వరద కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే వరదలతో దాదాపు 5 అపార్ట్‌మెంట్ నివాసితులు 400ల కుటుంబాలు ఏళ్లకొల ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్ ముందు వాపోయారు. 150 మీటర్ల దూరంలో మూసీనదిని కలిపే ప్రధాన కాలువ ఉందని, దానికి అనుసంధానంగా కాలువ ఏర్పాటు చేస్తే తమ కాలనీ వరద, మురుగు ముప్పు తప్పుతుందని స్థానికులు తెలిపారు. మున్సిపాలిటీ నిధులు మంజూరయినా అక్కడి భూ యజమానులు పనులు అనుమతించడం లేదని వాపోయారు. అపార్ట్మెంట్‌లో మురుగు నీరు నిలిచి పోతోందని కమిషనర్‌కు చూపించారు. కాలువను తవ్వి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు గురువారం కాలువలను తవ్వించి సమస్యను పరిష్కరించారు. 7 ఏళ్ల సమస్యకు12 గంటల్లో పరిష్కారం చూపారంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**పల్లె చెరువు ఔట్‌లెట్ పరిశీలన..**

మైలార్‌దేవ్ పల్లిలోని పల్లె చెరువు ఔట్‌లెట్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. గతంలో ఈ చెరువు కట్ట తెగి రోడ్డు మీద వరద ఉధృతికి వాహనాలు కొట్టుకుపోయి, పలువురు మృతి చెందిన విషయాన్ని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. ఔట్‌లెట్‌ను విస్తరించాలని కోరారు. ఆ దగ్గరలోని శాస్త్రి పురంలో ఎకరన్నర పార్కు కబ్జాను కమిషనర్ పరిశీలించారు. ఈ పార్కుకు సంబంధించిన వివరాలు తీసుకొని, ఆక్రమణదారులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు.

## బాలల ప్రాథమిక హక్కులను కాపాడాలి :ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉందని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర,జి ల్లా కార్యదర్శి సత్యప్రసాద్‌లు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలసంఘం, ఎఐవైఎఫ్‌లు సంయుక్తంగా మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాను బడిలో అన్న నినాదంతో చిన్నారులతో కల్సి నిర్వహించిన కార్యక్రమంలో వారికి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర, సత్యప్రసాద్‌లు బాల సంఘం కన్వీనర్ అజింపాషాతో కల్సి మాట్లాడుతూ 14 ఏళ్లలోపు వయస్సున్న చిన్నారనులతో ఎలాంటి పనులు చేయించరాదన్న చట్ట నిబంధనలను కాలరాస్తుండటం శోచనీయమన్నారు. చిన్నారులతో పనులు చేయిస్తున్నవారిపై చట్ట ప్రకారం శిక్షించటంతో పాటు వారి నుండి వసూలు చేసే జరిమానాలు చిన్నారుల ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, బాబూరావు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, నేతలు ప్రీతం, వికాసరెడ్డి, అఫ్రోజ్, సంజు, షోయబ్, మోనిన్, సమీర్, సత్యం, ఇర్ఫాన్, సల్మాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలి: వీఎస్ బోస్




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని మహారాజా గార్డెన్స్‌లో ఆగస్టు 19 నుండి 22 వరకు జరుగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ కోరారు. దీని కోసం ఇంటింటికి పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపిచ్చారు. రాష్ట్ర మహాసభల నేపథ్యంలో హెచ్‌బి కాలనినుండి హౌసింగ్ బోర్డ్ ఫస్ట్ ఫేస్ వరకు ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాలడుతూ మహాసభల నిర్వహణకు ఆతిథ్యం ఇచ్చిన సిపిఐ మేడ్చల్ జిల్లా సమితికి అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు దాదాపు 1000 మవదికి పైగా హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై, రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై చర్చలు జరిపి తీర్మానాల రూపంలో భవిష్యత్ పోరాటాలకు ఈ మహాసభ వేదిక కానుందన్నారు. పార్టీ శ్రేణులందరూ ప్రణాళికాయుక్తంగా మహాసభకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి వారిని భాగస్వాములను చేయటం ద్వారా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, శంకర్రావు, ధర్మేంద్ర, ఉప్పల్ మండల కార్యదర్శి సత్య ప్రసాద్, స్వామి దాస్, నాగేష్, కుమార్, మంగ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


## మోగిన బడి గంట



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** దాదాపు 50 రోజుల వేసవి సెలవుల తర్వాత మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు శుక్రవారం తిరిగి తెరచుకొన్నాయి. పిల్లలందరూ సెలవులకు టాటా చెప్పి ఎప్పటిలాగే బడిబాట పట్టారు. చిన్నారులను కొత్తగా పాఠశాలల్లో చేర్పించటం, ఇప్పటికే పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలను తమ సొంత వాహనాల్లోనో, ఆటోలు, స్కూల్ బ స్సుల్లోనో విడిచి పెట్టటం, పాఠశాలలు ముగియగానే ఇళ్లకు చేరే ఏర్పాట్లతో జిల్లాలోని విద్యా సంస్థల వద్దే కాకుండా అన్ని ప్రాంతాల్లో సందడి మొదలైంది. విద్యార్థులు సెలవుల అనంతరం సంతోషంతో పాఠశాలలకు ఆసక్తిగా చేరుకొని సుదీర్ఘ విరామం అనంతరం పాత క్లాస్‌మేట్లు, స్నేహితులను ఆనందంగా కల్సుకొని కొత్త విద్యా సంవత్సరంలో సరికొత్త లక్ష్యాలతో అడుగు పెడుగుతున్నారు. మొదటి రోజే పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు అందచేయ గా కొన్ని చోట్ల ప్రజా ప్రతినిధులు, ఆయా ప్రాంతాల్లో నివసించే ఛోటా మోటా రాజకీయ నేతలు సైతం హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కాగా మొదటి రోజే అవటంతో విద్యార్థుల హాజరు పలు పాఠశాలల్లో కాస్త పలుచగానే కనపడింది. మల్లాపూర్ డివిజన్‌లోని మల్లాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాల,నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల,సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తెలంగాణా ఎస్‌ఇఆర్‌టి డైరెక్టర్ రమేష్‌తో కల్సి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందచేసారు..మండల విద్యాశాఖాధికారి రామారా వు, ప్రధాన ఉపాధ్యాయులు యాదగిరి రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి. పద్మారావు, కొండల్‌రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ సిఎం సహాయనిధి

ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అర్హులైన పేదందరు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, జీడిమెట్ల, దుందిగల్‌కి చెందిన అర్జున్, పలివన్ అజీజ్, తిలక్ జ్యోతిలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.నాలుగు లక్షల ముప్పై వేల రూపాయల చెక్కులను కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య బాగుకై అర్హులైన నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్ రాంరెడ్డి, సిద్ధిరాములు, నదీమ్, ఇబ్రహీం బేగ్, కమలాకర్, మూసాఖాన్, మహేశ్, సంధ్యారెడ్డి, శ్రీదేవి రెడ్డి, యాదగిరి, జునైద్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో దోమ ద్వారా సక్రమించే వ్యాదులల నియంత్రనఫకై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకలంఎ దోమ కాటు వల్ల మాలేరియా డెంగ్యూ చికెన్ గున్యలంటి వ్యాదులు రాకుండా,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. వ్యాధులపై ప్రణాళిక బద్దంగా కార్యచరణ రూపొందించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అయాన తెలిపారు. వసతి గృహలు ,పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆరోగ్య విబిరాలు నిర్వహించాలని అదేవిదంగా ముందస్తుగా నే జ్వరము ,దగ్గు ,జలుబుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అయన వైద్య అధికారులకు సూచించారు. ఎలాంటి వ్యాదికి గురయ్యారో నిర్దారణ చేసి మందులు అందించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు కోర్లినేషన్ చేస్తు తాగునీటిని అందించాలని అయాన తెలిపారు. గ్రామాల్లో మురుగు నీరు నిలువకుండా ,పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ర్యాలీలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను అదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకుంటేనే ప్రజలను స్వచ్చంద సంస్థల భాగస్వామ్యంతో సీజనల్ వ్యాధులను నివరించే అన్ని జాగ్రత్తలు చేపట్టాలని అయన తెలిపారు, గ్రామాల్లో డాక్టర్లు ,ఆశావర్కర్లు , ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అయన తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల సౌకర్యార్థం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. 9702705161 ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ కమలాకర్ రెడ్డి , వివిధ శఖల అధికారుల పాల్గొన్నారు.

## అడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి



**ప్రజాపక్షం / కొడంగల్:** పేదింటి అడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ ఉన్నదని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ పట్టణంలోని కడ ప్రత్యేక కార్యాలయంలో వివిధ గ్రామాలకు సంబందించి 90 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను అందజేశారు. మండల పరిధిలోని ఎస్‌సిలకు 8, ఎస్‌టి 7, బిసి 60, మైనార్టీలకు 15 చొప్పున మొత్తం 90,10,440 లక్షల విలువ గల చెక్కులను తిరుపతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో హెచ్‌ఎండిఎ సమక్షంలో 45 లక్షలు, లహోటి కాలనీలో 65 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కులను హట్టహసంగా ప్రారంభించి పార్కులో కాసేపు సరదాగా తిరుగుతు పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరిరాజేష్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్నం అంబయ్యగౌడ్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, సాయిలు, నాయకులు నయ్యూం, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## యుపిఎస్ పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి



**ప్రజాపక్షం/బంట్వారం :** ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలో ఉన్న బొపునారం యుపిఎస్ పాఠశాలను జిల్లా విద్యాధికారి రేణుక దేవి సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాధికారి రేణుక దేవి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్నా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించబడుతుందన్నారు. ప్రభుత్వం విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, ఉచితంగా నోట్ పుస్తకాలు వాటితో పాటుగా రెండు జతల దుస్తులు మధ్యాహ్న భోజనం సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థుల తల్లి దండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ బడులు చేర్పించి చదివించలన్నారు. స్థానిక మండల విద్యాధికారి వేంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకనే విద్యార్థుకు మేరుగైన విద్యను అందచడమే కాకుండా జీవన నైపుణ్యాలు జీవన విధానం స్కిల్ ఫుల్ విద్యాను అందించడం జరుగుతుందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించలన్నారు. చివరగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల దుస్తులను జిల్లా విద్యాధికారి రేణుక దేవి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి రామ్ మస్తా, సిఎంఒ రజని కూమారి, కాంప్లెక్స్ ప్రధానోధ్యాయులు విక్రం రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజమ్మ,ఉపధ్యాయ బృందం, అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ కమసమ్మ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

## పట్టణ ప్రగతికి ప్రత్యేక ప్రణాళికలు

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గంలో సుమారు రూ. 1000 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బు య్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు పట్టణంలో రూ.2.21 కోట్ల నిధులతో చేపడుతున్న సైడ్రైన్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విలేమూన్ చౌరస్తా నుండి రూ.21లక్షల వ్యయంతో ఆర్టిఒ కార్యాలయం నుండి రాయల్ కాంట వరకు సైడ్రైన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తాండూరు పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు నీరాజబాల్‌రెడ్డి, పట్లోళ నర్సిములు, ప్రభాకర్ గౌడ్, మమత, సోమశేఖర్, సీనియర్ నాయకులు రావుఫ్, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర ట్రాన్స్ ఫార్మర్ల దొంగ అరెస్ట్

ఎస్ఐని అభినందించిన జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** సుదీర్ఘకాలంగా తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ అరెస్ట్ 30కిపైగా కేసులలో నిందితుడిని ఉత్తర ప్రదేశ్‌లో నవాబ్‌పేట్ ఎస్ఐ అరుణ్ కుమార్ చాకచక్యంగా పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యలయంలో ఎస్ఐ అరుణ్ కుమార్‌ని జిల్లా ఎస్‌పికె. నారాయణ రెడ్డి, ఐపిఎస్ గఅభినందించారు. వికారాబాద్ జిల్లాతో పాటు పలు పొరుగు జిల్లాలలో రైతులు మరియు విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం కలిగిస్తూ,సంవత్సరాలుగా పోలీసులకు సవాలుగా మారిన అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ నందులాల్ రాజ్ బార్‌ను నవాబ్‌పేట్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. 30కి పైగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులలో నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్ బి డబ్లుఎస్) పెండింగ్‌లో ఉన్న ఇతడిని,వారం రోజుల పాటు శ్రమించి ఉత్తర ప్రదేశ్‌లోని అతని స్వస్థలంలో అదుపులోకి తీసుకున్నారు. కేసు పూర్వాపరాలు, నిందితుని నేర చరిత్ర: నిందితుడు నందులాల్ రాజ్ బార్ (వయస్సు 35,తండ్రి స్వామి చరణ్,వృత్తి: గ్యాస్ వెల్డింగ్, నివాసం చెన్నై గ్రామం,బిలాదియా గుంజన్, అజంగఢ్ జిల్లా, ఉత్తర ప్రదేశ్) ఒక వ్యవస్థీకృత నేరస్థుడు. ఇతను తన గ్యాస్ వెల్డింగ్ వృత్తిని అడ్డుపెట్టుకుని, నిర్మానుష్య ప్రాంతాలలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుంటాడు.అందులోని అత్యంత విలువైన కాపర్ వైరు మరియు ఆయిల్‌ను దొంగిలించి ఇతర రాష్ట్రాలలో అమ్మి సొమ్ము చేసుకుంటాడు. 20–2021 సంవత్సరాలలో నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10కి పైగా కేసులలో అరెస్ట్ అయి జైలుకు వెళ్ళాడు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చి, వికారాబాద్ గౌరవ జఎఫ్ సి ఎం కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో గౌరవ న్యాయస్థానం నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి, తక్షణమే పట్టుకుని కోర్టు ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



ప్రజాపక్షం/యాచారం : అమ్మమాట అంగన్ వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్య గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం గురువారంమండల పరిధిలోని గున్‌గల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించినట్టు ఇబ్రహింపట్నం సిడిపిఒ వినితాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఒ శ్రీలత, ఎంపిడిఒ బాలశంకర్, ఎపిఎం సాంబశివుడు, పంచాయితీ కార్యదర్శి శోభ, ప్రైమరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు,అంగన్ వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బి నగర్ నియోజకవర్గ పరిధిలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకోచ్చారు. రానున్న వర్షాకాలంలో దృష్ట్యా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్‌ను కోరారు. డివిజన్ అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఇఇ రమేష్ బాబు, డిఇ దామోదర్ రావు, శానిటేషన్ డిఇ నీలిమా, జిహెచ్‌ఎంసి ఎలక్ట్రిక్ సిటీ డిఇ పున్నా నాయక్, ఎంటమాలజీ ఏఇ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఎఇ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయ పద్ధతులతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి



ప్రజాపక్షం/యాచారం : రైతులు సమగ్ర వ్యవసాయ పద్దతులు పాటించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రొఫెసర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రాజేంద్ర నగర్ శాస్త్ర వేత్త డాక్టర్ రాజేశ్వర్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అభ్యుదయ రైతు జోగిరెడ్డి,బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి,వ్యవసాయాధికారి అర్ రవినాథ్, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదలది : కందికంటి



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : పేద ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఖిల్లా మైసమ్మదేవాలయ మాజీ చైర్మన్, లింగోజిగుడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ అన్నారు. గురువారం డివిజన్‌లోని పలు రేషన్ షాపులను శ్రీధర్ గౌడ్ సందర్శించి లబ్ధిదారులకు సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను కలిసిన ఉప్పల శ్రీనివాస్‌గుప్త



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌ను గురువారం ఉప్పల శ్రీనివాస్‌గుప్త మర్యాద పూర్వకంగా కలిశారు. టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేష్‌కుమార్‌ను ఉప్పల కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ పటిష్టతకు పాటుపడుతానని తెలిపారు.

## గ్రామీణ క్రీడాకారులు రాణించాలి



ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామీ ణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన పసుపుల రాయుడు తెలంగాణ మారథాన్ 5కె రన్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన నేపథ్యంలో ఆయనను అభినందించారు.

## పాఠశాలలోనే విద్యార్థుల భవిష్యత్తు



ప్రజాపక్షం/షాబాద్ : విద్యార్థుల భవిష్యత్తు పాఠశాలలోనే ప్రారంభం అవుతున్నట్లు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బాబు బేరి, ఎంపిడిఒ అపర్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల విద్య అధికారి లక్ష్మ ణ్, ఉపాధ్యాయులతో కలిసి పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. హైతాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మెన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డిలతో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు అనంత ప్రవీణ్ రెడ్డి, పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రంజిత్‌రెడ్డికి ఎమ్మెల్యేలు సబితారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాళి



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మాజీ ఎంపిటిసి తీగల రంజిత్‌రెడ్డి మృతికి మాజీమంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ బిఆర్‌ఎస్ ఇంచార్జ్ పి.కార్తిక్‌రెడ్డి నివాళులర్పించారు. గురువారం రంజిత్‌రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. రంజిత్‌రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, సిద్దాల లావణ్యభీరప్ప, అర్కల భూపాల్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, మేకల రవీందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్, సిద్దాల అంజయ్య, ఎల్చాల సుదర్శన్‌రెడ్డి, రామిడి రామిరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, రాజుకుమార్, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, వీర రాఘవరెడ్డి, సునిత పాల్గొన్నారు.

# భవన నిర్మాణ అనుమతుల నిబంధనల్లో మార్పులకు సర్కార్ నిర్ణయం

### హెచ్‌ఎండిఏ కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

### కసరత్తు చేస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం యంత్రాంగం

ప్రజాపక్షం/హైదరాబాద్ : భవన నిర్మాణ అనుమతులను సమూలంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిబందనలు సవరించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అమల్లో ఉన్న నిబంధనలకు సవరణలు తీసుకవచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, ఆధునిక అవసరాలకు సరిపడేలా నిబంధనలను సవరిస్తూ నియమనిబంధనల్లో సమూలమార్పులు తీసుకరావాలని ఇప్పటికే ప్రభుత్వ స్థాయిలో చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల కిందటే ఉత్తర్వులు జారీ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏ ) కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నూతన నిబంధనల ముసాయిదా సిద్ధం చేసేందుకు కసరత్తును ప్రారంభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భవన నిర్మాణ నిబంధనలలో ప్రతి అంశాన్ని కమిటీ నిశితంగా పరిశీలించనుంది. బిల్డర్లు, డెవలపర్లు, నిర్మాణ సంస్థలు, ఆర్కిటెక్టులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు తదితర పౌర సమాజం నుంచి సమగ్రంగా అభిప్రాయాలు సేకరించనున్నారు. అయితే కమిటీకి కేటాయించిన నెల రోజుల వ్యవధిలోనే ఇది పూర్తి కాలేకనట్లు తెలిసింది. అయితే నిబంధనల రూపకల్పన అంశం ఇంకా ప్రాథమిక దశలో ఉందని అధికార వర్గాల సమాచారం. ముసాయిదా నిబంధనల రూపకల్పన మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 2012లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భవన నిబంధనలను, తెలంగాణ ఏర్పడిన తర్వాత యథాతథంగా కొనసాగిస్తూ వస్తున్నారు. నియమాలను మరింత సులభతరం చేయడం, వినియోగదారులకు అనుకూలంగా తీర్చిదిద్దడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం భావిస్తోంది. కాలం తీరిన నిబంధనలను తొలగించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2016, 2023లో రెండు విడతలుగా నేషనల్ బిల్డింగ్ కోడ్‌ను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్‌లో కూడా రెండు సార్లు మార్పులు చేర్పులు జరిగాయి. కేంద్ర మార్గదర్శకాలతో అనుసంధానంగా రాష్ట్ర నిబంధనలను సమగ్రంగా మళ్లీ రూపకల్పన చేయాల్సిన అవసరముందని నిర్మాణ రంగ నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ అనుమతులతో నిర్మాణదారులు ఇక్కట్లకు గురవుతున్నారని, వీటిని సులభతరం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.




## ఆ నాలుగు నియోజకవర్గాలకు ‘డబుల్ ’ఇండ్లు

### రాష్ట్ర ప్రభుత్వానికి భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : చాంద్రాయణగుట్ట, యాకత్‌పురా, చార్మినార్, మలక్‌పేట నియోజకవర్గాల డబుల్ బెడ్ రూమ్ బాధితులకు న్యాయం చేయాలని భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కానుగుల్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు శేషు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు పలువురు బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 2న ఈ నాలుగు నియోజకవర్గాలకు చెందిన 1730 మంది లబ్ధిదారులకు మహేశ్వరం మండలకేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు లాటరీ పద్ధతిన కేటాయించిందని తెలిపారు. కానీ, ఈ నెల 9న రంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్ వాసులకు జి.ఒ.10 ప్రకారం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వడం కుదరదని ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. మూడ వ జాబితా లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించారు కానీ, మొదటి జాబితాలో ఉన్న తమకు ఇప్పటివరకు ఇండ్లు కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, ఈ 1730 మంది లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో డబుల్ బెడ్‌రూమ్ బాధితులు ఇబ్రహీం, శ్రీనివాస్, శ్రీవిద్య, సుభాష్, కౌసర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి

### మున్నూరు కాపు సంఘం వినతి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఏ ఆది శ్రీనివాస్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చదలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వరరావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బొప్ప దేవన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 40లక్షల మందికిపైగా ఉన్న మున్నూరుకాపులంతా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉంటున్న మున్నూరుకాపులకు మంత్రి పదవి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. దీనిపై పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి విన్నవించామన్నారు. మున్నూరు కాపులకు ప్రభుత్వ నా మినేటెడ్ పోస్టులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, మహేశ్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు సీజ్ చేయాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్‌గౌడ్



ప్రజాపక్షం/తుర్కయాంజల్ : ఫిట్ నెస్ లేని ప్రైవేట్ పాఠశాల,కళాశాలల బస్సులను సీజ్ చేయాలని ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్‌టిఒ సుభాష్ చంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యాలు తమ బస్సులను కచ్చితంగా ఫిట్నెస్ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. వాహన వేగ పరిమితిని తగ్గించి నడిపే విధంగా చూడాలని, పరిమితికి మించి బస్సులో విద్యార్థులను తరలించ వద్దని, విద్యార్థుల సంరక్షణ అందరీ బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. మోటార్ వెహికల్ ఆక్ట్ ప్రకారం నియమ నిబంధనలు పాటించని అన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల, కళాశాలల బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు గోవర్ధన్, వివేక్, గండికోట శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో టిబి వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు

### హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు

ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో టిబి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు అన్నారం సబ్‌సెంటర్‌లో టిబి వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూర్గుల డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ లలిత, మహేశ్వరీ, హెల్త్ సూపర్‌వైజర్లు, టెక్నికల్ అసిస్టేంట్లు, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## జిహెచ్‌ఎంసి పరిధిలోని 24 బార్లకు నేడు డ్రా

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : జిహెచ్‌ఎంసి పరిధిలో 24 బార్లకు జూన్ 13 న (నేడు) డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక జరుగునుందని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ మీడియా ఇంచార్జ్ కృష్ణప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ల డ్రాకు పర్యవేక్షణకు ప్రత్యేక టీముల ఏర్పాటు పూర్తి చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి సమీపంలోని " ద అడ్రస్ కన్వెన్షన్స్ ఎగ్జిబిషన్స్" హాల్ లో ఏర్పాటు చేశామన్నారు. ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ చేతుల మీదుగా డ్రా తీయడం జరుగుతుందని వివరించారు. ఈ డ్రా నిర్వహణ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ కన్వెన్షన్స్ హాల్లో అన్ని ఏర్పాట్లను చేసిందని మీడియా ఇంచార్జ్ కృష్ణప్రియ స్పష్టం చేశారు.

# ‘ప్రైవేటు’కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కుంటబడి)లో విద్యాసంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేశామని, విద్యార్థుల భవిష్యత్ బంగారుమయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి అప్పుల పాలు కాకుండా సర్కారు బడుల్లోనే చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్పోరేట్‌కు తీసిపోకుండా తెలుగు, ఇంగ్లీష్ మీడియం తరగతులు అందిస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌ను బంగారుమయం చేసుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్, లక్ష్మ ణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.గురువారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో జడ్పిఎచ్‌ఎస్ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య భోదించి ఉత్తమ ఫలితాలు సాధించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గడ్డన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటిల చైర్మన్లు చిలుక మధుసూధన్‌రెడ్డి, గురునాథ్ రెడ్డి, మంఖాల కరుణాకర్, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి,మండల విద్యాధికారి హీర్యానాయక్, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అవరోధించాలి : ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

గండిపేట : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాల్ని అవరోధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల, నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రకాష్ గౌడ్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్నన్న భోజనం అందిస్తున్నదని, వీటిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్‌నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, గ్రామపెద్దలు ప్రభాకర్‌రెడ్డి, శంకర్, ఇంద్రపాల్‌రెడ్డి, కీర్తి రామకృష్ణ, ఉపాధ్యాయులు సుదర్శన్, వెంకటయ్య, జనార్ధన్ చారి, సరళమ్మ, రూపాదేవి, ఉదయ లక్ష్మి, సుధాకర్, అంజయ్య, నర్సింహాచారి, రాజమహేందర్‌రెడ్డి, మొగులయ్య కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బి నగర్ : ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్దులకు బోదించాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలు పునఃప్రారంభంలో భాగంగా బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్‌కుమార్, నాయకులు మాధవరం నర్సింహ్మారావు, గడ్డం మల్లేష్‌గౌడ్, సతీష్‌గౌడ్, సుమన్‌గౌడ్, రాఘవేంద్ర రావు, మనోజ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.







# రీల్





పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన '8 వసంతాలు' ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్ సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'అందమా అందం మా' చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ రోజు సెకండ్ సింగిల్ పరిచయమిలా సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. సోల్ ఫుల్ నెంబర్‌కి పాపులరైన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఒక బ్యూటిఫుల్ మెలోడీ ట్యూన్ కంపోజ్ చేశారు. వనమాలి రాసిన సాహిత్యం అద్భుతంగా వుంది. వెటరన్ సింగర్ కేఎస్ చిత్ర మెలోడియస్ వాయిస్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేసింది. ఆమె మాగ్నటిక్ వాయిస్ తో సాంగ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్ళింది. సాంగ్ లో విజువల్స్ చాలా ప్లెజెంట్ గా వున్నాయి.నవీన్ యెర్నేని,వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. అరవింద్ ములే ప్రొడక్షన్ డిజైన్‌ను, శశాంక్ మాలి ఎడిటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతమైన కథనంతో ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ విడుదల కానుంది.



## 'తమ్ముడు' ట్రైలర్ విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ లో ఘనంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ మా సంస్థలో సంక్రాంతికి వస్తున్నాం తర్వాత తమ్ముడు మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడెప్పుడు అనౌన్స్ చేద్దామా అని ఎదురుచూశాం.జూలై 4 న రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాం. దర్శకుడు శ్రీరామ్ వేణు మాట్లాడుతూ తమ్ముడు మూవీ ట్రైలర్ కు మీ దగ్గర నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఆనందంగా ఉంది. హీరో నితిన్ మాట్లాడుతూ తమ్ముడు మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాం. ఈ సినిమాకు లయ చాలా ఇంపార్టెంట్. ఆమె చాలా బాగా పర్ ఫార్మ్ చేశారు. అలాగే సప్తమి గౌడ ఈ చిత్రంలో కీ రోల్ చేశారు. నా కెరీర్ బిగినింగ్ లో దిల్ సినిమాకు రాజు హయ్యెస్ట్ బడ్జెట్ పెట్టారు. అప్పట్లో సెట్ సాంగ్ కోసం 60 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఆ సినిమా మంచి హిట్ అయ్యింది. మళ్లీ తమ్ముడు మూవీకి నా కెరీర్ లోనే హయ్యెస్ట్ బడ్జెట్ ఖర్చు చేశారు.

## హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ తో గోపీచంద్ సినిమా



**గోపీచంద్ 33వ సినిమా గ్లింప్స్ రిలీజ్**

మాచో స్టార్ గోపీచంద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 33వ సినిమా కు శ్రీకారం చుట్టారు. హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. యాక్షన్ నేపథ్యంలో నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్నారు. బర్త్ డే సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇంతవరకు గోపీచంద్ చేయని పాత్రను ఇందులో పోషిస్తున్నారని శ్రీనివాస్ రావు తెలిపారు. మేకర్స్ అద్భుతమైన పోస్టర్, గ్లింప్స్ ను విడుదల చేశారు. గోపీచంద్ లుక్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఒక యోధుడిగా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. పొడవాటి జుట్టు, యుద్ధగాయాలు, నుదిటిపై వీర తిలకంతో కనిపించిన ఇంటెన్స్ లుక్ ఫ్యాన్స్‌ను సర్ ప్రైజ్ చేసింది. చేతిలో ఖడ్గంతో యుద్ధరంగంలో కనిపించిన ఈ పోస్టర్ శక్తి, శౌర్యాన్ని ప్రజెంట్ చేస్తోంది.ఘాజీ , అంతరిక్షం వంటి విభిన్న కథల చిత్రాలతో తన ప్రత్యేక కథనశైలి, సాంకేతిక నైపుణ్యంతో గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి, ఇప్పుడు మరో డిఫరెంట్ జానర్ లోకి అడుగుపెట్టారు .సంకల్ప్ రెడ్డి ఈ సినిమాలో భారత దేశ చరిత్రలో మరిచిపోయిన ఒక కీలక ఘట్టాన్ని అద్భుతంగా మలిచారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, మరిచిపోయిన అధ్యాయానికి మళ్లీ జీవం పోస్తోంది.



## 16న రాజా సాబ్ టీజర్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో నిర్మిస్తున్న రాజాసాబ్ టీజర్ విడుదలకు సిద్ధమైంది. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు మారుతి కలిసి టీజర్ ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 16న ఉదయం 10 గంటల 52 నిమిషాలకు టీజర్ రిలీజ్ చేయనున్నారు. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోంది.

## సీనియర్ నిర్మాత ఏ.ఏ ఆర్ట్స్ మహేంద్ర కన్నుమూత



శ్రీహరిని హీరోగా పరిచయం చేసిన నిర్మాత ఏఏఆరట్స్ అధినేత మహేంద్ర గుండెపోటు తో కన్నుమూశారు. 1946 ఫిబ్రవరి 4న గుడివాడ తాలుక దోసపాడులో జన్మించిన కావూరి మహేంద్ర దర్శకత్వ శాఖలో శిక్షణ పొంది నిర్మాతగా మారారు. కె. ప్రత్యగాత్మ, కె. హేమాంబరధరరావు వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన మహేంద్ర ప్రొడక్షన్ కంట్రోలర్ గానూ పలు చిత్రాలకు పనిచేశారు. 1977లో 'ప్రేమించి పెళ్ళి చేసుకో'తో నిర్మాతగా మారిన మహేంద్ర ఏది పుణ్యం? ఏది పాపం?', 'ఆరని మంటలు', 'తోడు దొంగలు', 'బందిపోటు రుద్రమ్మ', 'ఎదురలేని మొనగాడు', 'ధాకూరాణి', ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహాత్మ్యం' తదితర చిత్రాలను నిర్మించారు. యాక్షన్ స్టార్ శ్రీహరిని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' 'దేవా' సినిమాలను నిర్మించారు. మహేంద్ర కుమార్తెను హీరో మాదాల రవి వివాహం చేసుకున్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న మహేంద్ర గుంటూరులో తుదిశ్వాస విడిచారు. మహేంద్ర అంత్యక్రియలు గుంటూరులో జరిగాయి.




## 'మిత్ర మండలి' టీజర్ ఆవిష్కరించిన అల్లు అరవింద్

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడి యా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ కు విశేష స్పందన లభించింది.తాజాగా 'మిత్ర మండలి' టీజర్ ను నిర్మాతలు విడుదల చేశారు. టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం హైదరాబాద్ లోని ఎఎఎ సినిమాస్‌లో జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'బన్నీ వాసు సమర్పిస్తున్న మొదటి సినిమా గా, నా మిత్రులందరూ కలిసి తీసిన ఈ 'మిత్ర మండలి' టీజ ర్‌ను లాంచ్ చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. ఒకసారి వాసు ఈ కథ వినమని దర్శకుడిని నా దగ్గరకు పంపించాడు. కానీ, మీ ముందు కథ చెప్పలేకపోతున్నాను అని దర్శకుడు వెళ్ళిపోయాడు. నేను కథ వినకుండానే, నేరుగా ఈ సినిమా చూడబోతున్నాం. వీరందరి మాటలు వింటుంటే.. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది.టీజర్ చాలా బాగుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్.' అన్నారు.

## కాళోజీ సినిమాకు గద్దర్ అవార్డు సంతోష దాయకం

– దర్శకుడు ప్రభాకర్ జైనీ






తాను రూపొందించిన 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్ కు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని దర్శకుడు ప్రభాకర్ జైనీ అన్నారు. మంచి సినిమా తీసి అవార్డుకు ఎంపికైనందుకు ఆనందంగానే ఉన్నా ఇలాంటి సినిమాలు థియేటర్ లో విడుదల చేయడానికి ఎవరూ సహకరించకపోవడం బాధాకరం అన్నారు. కాళోజీ సినిమా కు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా దర్శకుడు ప్రభాకర్ జైనీ తో ప్రజాపక్షం ప్రతినిధి స్పందన అడిగారు. ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ థియేటర్లో రిలీజ్ కాలేదు. ఎంతో మందిని బ్రతిమిలాడినా, 'ఈ సినిమా నడవదు' అని తిరస్కరించారు. అప్పటికే మేము ఆర్థికంగా బాగా నష్టపోయాము కాబట్టి, డబ్బు లు ఎదురు కట్టి, క్యూబ్, యూ ఎఫ్ ఓ వంటి కంటెంట్ ప్రొవైడర్స్ కు ఒక్క థియేటరుకు వారానికి సుమారు 20 వేలు, పబ్లిసిటీ మెటీరియల్‌కు మరి కొన్ని డబ్బులు కట్టలేక, థియేటర్లలో రిలీజ్ చేయలేకపోయాము.గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు రావడం, నాకు నా జీవితంలో అత్యంత ఆనందకరమైన సంఘటన. ఆ వార్త తెలిసినప్పుడు మా కుటుంబ సభ్యులందరం కన్నీరు కార్చాము. మా నాలుగు సంవత్సరాల శ్రమకు ఫలితం దక్కిందని భావించాము. మేము వృత్తిరీత్యా సినిమా నిర్మాతలం కాదు. ఒక ప్యాషన్ తో, సందేశాత్మక, మంచి సినిమా తీయాలన్న ఉద్దేశ్యంతో సినిమా రంగాన్ని మా ప్రవృత్తిగా ఎంచుకున్నవాళ్ళం. మేం సినిమా మొదలు పెట్టినప్పుడే 'ప్రజాకవి కాళోజీ' కమర్షియల్ సినిమా కాదని తెలుసు.

## అద్భుత స్వప్నాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తులు అత్యున్నత నా ణ్యమైన వస్త్రాలని తెలిపారు. ప్రత్యేక భౌగోళిక గుర్తింపుతో చేనేత ఇక్కత్ వస్త్రాలు ప్రపంచ మూల మూలన విస్తరించి మార్కెటింగ్ సొంతం చేసుకున్న పెద్ద పరిశ్రమని ఇలాంటి పరిశ్రమపై ఆధారపడి జీవించే వారందరి జీవన ప్రమాణాలు మెరుగుపడి లాభాల బాటన నడిచి పరిశ్రమ కొత్త పుంతలు తొక్కాలని అభిప్రాయా న్ని వెలిబుచ్చారు. నేత కార్మికులు సృష్టించే కళాఖండాలు యావత్ జాతి ఐక్యతకు ప్రతిరూపాలని, హ్యాండ్లూమ్ పరిశ్రమకు ఊతమిచ్చేలా ఐఐటి నెట్ వివిధ వస్త్రాల డిజైనింగ్ అధ్యయన కేంద్రాల నిపుణులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పర్యటనకు వచ్చానని తెలిపారు. చేనేత పరిశ్రమ అధ్యయనం చేస్తామని ఏ ఉత్పత్తులకైనా ప్రధాన సమస్య మార్కెటింగ్ అని, సమస్యకు పరిష్కారం కనుగొన్నప్పుడే పరిశ్రమపై ఆధారపడిన వారి బతుకులు బాగుపడతాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చేనేత పరిశ్రమకు సాటి మరి ఏది లేదని స్పష్టం చేశారు. కళా సంపద కలిగిన కుటుంబాల సందర్శనకు రావడం చాలా సంతోషమన్నారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ పోచంపల్లి సందర్శనకు రావడం వల్ల 30 శాతం వ్యాపారాలు పెరిగినట్లు అధికారులు తెలిపారని, ఇది ఒక శుభ సూచకమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐదు లక్షల నేతన్న భీమా చెక్కులను ముగ్గురు, నేతన్న పొదుపు స్కీం చెక్కులను ముగ్గురి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టూరిజం పార్కు సందర్శనకు ముందే భారత మధు పెండెం కృష్ణ నేత కార్మికుల ఇళ్లల్లోకి వెళ్లి మగ్గాలపై చీరలు వేసే విధానాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం టూరిజం పార్క్ లోని చేనేత చీరల వస్త్రాల ప్రక్రియలోని వివిధ దశలను చూపే మ్యూజియంలో సందర్శించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానాకిషోర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 14న 'ఒబిసిల పోరుబాట'పుస్తకావిష్కరణ




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరు రాష్ట్రాల్లో ఆరేళ్ల పాటు పరిశోధన చేసి, బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలను పొందుపరిచిన 'ఒబిసిల పోరుబాట' పుస్తకాన్ని ఈ నెల 14న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్లు జన అధికార సమితి అధ్యక్షులు చేరాల నారాయణ, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్‌లు 'ఒబిసిల పోరుబాట' పుస్తకాన్ని రచించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మహేశ్‌కుమార్ గౌడ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎంపిలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎపి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంఎల్‌సి దాసోజ్ శ్రవణ్, పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, బిసి సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరవుతారని వివరించారు. త్వరలోనే ప్రముఖ ఆన్‌లైన్, బుక్‌స్టాళ్లలో ఈ పుస్తకం అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సమితి కార్యదర్శి పరికిపండ్ల సుమంత్, కార్యదర్శి కీర్తి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడితో బిసి నేతల భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ నియమిత పదవులలో, ప్రభుత్వ పదవులలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను బిసి సంఘాల నేతలు కలిసి అభినందించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం బుధవారం ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం అమలు కోసం కృషి చేస్తున్న టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో బడుగులకు న్యాయం చేసే దిశలో ఆలోచిస్తున్నారని తెలిపారు. ఇదే సమయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సమాచార కమిషనర్‌లో బిసిలకు అన్యాయం జరిగిందని, దీనిని తక్షణమే సరిదిద్ది, బిసిలకు సమాచారం కమిషనర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గంలో బిసి మంత్రులకు ప్రాధాన్యత గల శాఖలు కేటాయించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి రాష్ట్ర మంత్రివర్గంలో బడుగులకు ఏవిధంగా ప్రాధాన్యత కల్పించారో బిసి మంత్రులకు శాఖల కేటాయింపులలో కూడా అదే ప్రాధాన్యత కల్పించాలని శ్రీనివాస్ గౌడ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసిన బిసి ప్రతినిధుల బృందంలో బిసికుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, కో ఆర్డినేటర్ ఉప్పరి శేఖర్ సగర, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బిసి నేతలు జాజుల లింగం గౌడ్, ఐలీ వెంకన్న, సింగం నగేష్, శంకరాచారి, నిద్ర సంపత్, దుర్గయ్య, బండి గారి వెంకన్న గౌడ్, భరత్ ఉన్నారు

## నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ( ఐఎండి) హెచ్చరికల నేపథ్యంలో గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంతవరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచి ంచారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వివిధ జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, ఎన్‌డిఆర్ఎఫ్ (అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ, ప్రత్యేక పోలీస్ విభాగంలోని ఎస్‌డిఆర్ఎఫ్) సహాయంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక విభాగం డిజి, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ , నీటిపారుదల, ఆర్అండ్‌బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని, కమిటీ నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీ రాజ్ కమీషనర్ సృజన, టిజి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ ముషారఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి. ఐఎండి అధికారిణి నాగరత్నం, ఆదిలాబాద్ , భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షాకాల సీజన్ అనుకున్నదానికంటే 15 రోజుల ముందుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని ప్రకృతి వైపరీత్యాల ప్రభావం వీలైనంతవరకు తగ్గించేలా చర్య లు తీసుకోవాలని అన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రదేశాలలో జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హ ఠాత్తుగా వచ్చే వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయని, ముఖ్యంగా పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్క డి నుంచి శాశ్వతంగా తరలించి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## పిడి యాక్ట్

(మొదటి పేజీ తరువాయి)

తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/8 లో 10.33 ఎకరాలు, సర్వే నెంబరు 33/9 లో 13 ఎకరాలు, సర్వే నెంబరు 33/10 లో 6.33 ఎకరాల చొప్పున మొత్తం 30.28 ఎకరాల భూమిని 1968 లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ కు భూ పట్టదారులైన తోటకూర ఎల్లయ్య యాదవ్, రామయ్య చౌదరి తదితరుల ద్వారా... సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సదరు భూమిని 1976 సంవత్సరంలో దేవాదాయ శాఖకు అప్పగించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ భూ మిని కాపాడుతూ వచ్చాయన్నారు. అయితే, ఈ భూములను కబ్జా చేసేందుకు కొంతమంది పని చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. దేవాదాయ శా ఖ భూములు కబ్జాకు పాల్పడిందే ఎవరైనా సరే వది లే ప్రసక్తే లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. అయినా, భూములను స్వాధీనం చేసుకొని కబ్జా దా రులపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. మంత్రి వెంట పర్యటించిన వారిలో బోడుప్పల్ మా జీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మేడిపల్లి తహసీల్దారు హసీనా, దేవాదాయ శాఖ సర్వేయర్లు, అధికారులు, కాం గ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ భూము లు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. చెంగిచెర్ల భూములు, 1976లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేవాదాయ శాఖకు దక్కాయని గుర్తు చేశారు. అయితే, వీటిని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి విల్లాల నిర్మాణాలు చేపడుతున్న ట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మార్వోతో కలసి కొంతమంది నకిలీ సర్వే చేయించి అక్రమంగా సొంతం చేసుకునే ప్రయత్నం చేసినట్టు వివరించా రు. కాగా, తాజాగా ఏడీ సర్వే చేయించగా ఈ భూ ములన్నీ దేవాదాయ శాఖకు చెందిన భూములుగా తేలినట్టు మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. అయితే, ఈ కబ్జా అంశం, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, జంగయ్య యాదవ్... వరంగల్ వెళ్తున్న మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి కొండా సురేఖ వెనువెంటనే రెవెన్యూ, దేవాదాయ, పోలీసు అధికారులను పిలిపించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్తోనూ ఫోన్లో మాట్లాడారు. దేవాదాయ శాఖకి చెందిన ఈ 30 ఎకరాల భూములను రక్షించి బార్ కోడ్ చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### గత ప్రభుత్వంలో దేవుడి భూములపై నిర్లక్ష్యం

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవుడి భూ ములపై నిర్లక్ష్యం కొనసాగింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆలయ భూములపై ఫోకస్ పెట్టింది. ఎక్కడెక్కడ భూములున్నాయో... ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయో... అన్యాక్రాంతమైన జాగలెన్నో... అనే లెక్కలు తీశారు. రాష్ట్రంలో వివిధ ఆలయాల పరిధిలో మొత్తం 91,827 ఎకరాలున్నట్టు ఎండోమెంట్ గుర్తించింది. అందులో 25 వేల ఎకరాలు కబ్జా అయినట్టు నిర్ధారించింది. మరో 6 వేల ఎకరాలు ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్నట్టు తేలిందని దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.




## సంక్షేమ భవన్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, 12 ఎస్‌సి గురుకులాల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, గురుకుల విద్యార్థుల పట్ల వివక్ష చూపిస్తున్న గురుకుల సెక్రటరీని విధుల నుండి తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గ్యార నరేష్, రెహమాన్, కాసోజు నాగజ్యోతి, నాయకులు చైతన్య యాదవ్, సామిడి వంశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com